అయ్యప్ప భక్తుల కోసం శబరిమలలో 25 కోట్లతో భవనం



నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం మన పత్రిక



కాశీ యాత్రికుల కోసం వారణాసిలో 25 కోట్లతో భవనం

శుక్రవారం 10.3.2023 | సంపుటి 12 • సంచిక 275 • వెల. రూ.6.50 | హైదరాబాద్ పేజీలు: 12+16/12 | తదియ

శుక్రవారం, సూర్యోదయం: 6-28, సూర్యాస్తమయం: 6-25. శ్రీ శుభకృత్ నామ సంవత్సరం ఉత్తరాయణం శిశిర రుతువు ఫాల్గుణ మాసం కృష్ణ పక్షం తిథి: తదియ రాత్రి 9-42 వరకు. నక్షత్రం: చిత్త పూర్తి. వర్జ్యం: పగలు 2-21 నుంచి సాయంత్రం 4-02 వరకు. రాహుకాలం: ఉదయం 10-57 నుంచి పగలు 12-26 వరకు. దుర్ముహూర్తం: ఉదయం 8-52 నుంచి ఉదయం 9-39 వరకు, పునర్ దుర్ముహూర్తం: పగలు 12-50 నుంచి పగలు 1-37 వరకు. అమృతకాలం: రాత్రి 12-27 నుంచి రాత్రి 2-08 వరకు.

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline

4 లక్షల మందికి గృహలక్ష్మి



ఇల్లాలి పేరు మీదే కొత్త ఇల్లు

జాగ ఉంటే ఇల్లు కట్టుకొనేందుకు 3 లక్షల సాయం

బంగారు పంటలు పండిస్తున్న సేద్యం.. దండిగ ఉద్యోగాలిస్తున్న పరిశ్రమ.. దేశానికే ఆదర్శంగా నిలిచిన సంక్షేమం.. ద్వేషానికి తావులేని ఆధ్యాత్మిక పరిమళం.. విరజిమ్ముతున్న తెలంగాణ రాష్ట్రంలో సకలజనుల సంక్షేమమే లక్ష్యంగా కేసీఆర్ ప్రభుత్వం మరిన్ని సంచలన నిర్ణయాలు తీసుకొన్నది.

ఒకనాడు అష్టకష్టాలతో కునారిల్లిన ఒక్కొక్క రంగాన్ని లెక్క సరిచేసుకుంటూ, సరిదిద్దుకుంటూ వస్తున్న కేసీఆర్ నిరుపేదలకు గూడు కల్పించడమే ధ్యేయంగా భారీ నిర్ణయాలు తీసుకున్నారు. పేదవాడు తన సొంతింటి కలను సాకారం చేసుకోవడానికి ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందించాలని నిర్ణయించారు. అంతేకాదు.. గత ప్రభుత్వాలు ఇంటిపేరుతో పేదల నెత్తిన మోపిన బాకీల భారాన్ని మాఫీ చేయాలని నిశ్చయించారు. ఎక్కడుండాలో తెల్వక, నిలువ నీడలేక అనివార్యపరిస్థితుల్లో ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకున్న లక్షలాది మందికి ఆ స్థలాలను క్రమబద్ధీకరించబోతున్నారు.

మానవీయ సంక్షేమమే కాదు.. మరోవైపు మహనీయ ఆధ్యాత్మికం.. ఉప్పొంగే భక్తి భావనతో కాశీ యాత్రకు, శబరిమల దీక్షకు వెళ్లే లక్షలాది తెలంగాణ భక్తుల కోసం అటు వారణాసిలో, ఇటు శబరిమలైలో రూ.50 కోట్లతో భారీ వసతి గృహాలు నిర్మించబోతున్నారు. మరో లక్షా 30 వేల మందికి దళితబంధు, అడవిని దున్ని సాగుచేసుకుంటున్న గిరిజన సోదరులకు 4 లక్షల ఎకరాల పోడు భూముల పంపిణీ, ఏప్రిల్ నుంచి మళ్లీ గొర్రెల యూనిట్ల వితరణ, యాసంగిలో పండే వరి ధాన్యం కొనుగోలు..

ఇలా ఒక క్యాబినెట్ సమావేశం.. అనేక ప్రజాహిత నిర్ణయాలు! ఆరు గంటల చర్చలు.. లక్షల మంది తెలంగాణ ప్రజలకు ప్రయోజనాలు!! అందుకే ఆయన ప్రజా నాయకుడు.. తెలంగాణే ఆయన తొలి శ్వాస... ప్రజాహితమే ధ్యాస! పరిపాలన ఆయనకు తపస్సు!! సర్వోతోముఖ సమ్మిళిత తెలంగాణే ఆయన యశస్సు.. అందుకే దేశానికి కేసీఆర్ రేపటి ఉషస్సు!!

ఎన్నికల దృష్టితో అధికారంపై యావతో విపక్ష విదూషక పాత్రలు.. యాత్రల పేరుతో తిట్టుకుంటూ తిరుగుతుండగా, కేసీఆర్ మాత్రం తెలంగాణ ప్రజాహితమే ధ్యేయంగా తన ఆలోచన మథనాన్ని కొనసాగిస్తున్నారు. తెలంగాణకు ఏం కావాలో కేసీఆర్‌కు తెలుసు. కేసీఆర్ ఏమిటో తెలంగాణ ప్రజలకు తెలుసు. అందుకే విపక్ష నేతలు కార్నర్ మీటింగులు పెట్టుకుంటే ప్రజలు వారినే కార్నర్ చేస్తున్నారు. దటీజ్ కేసీఆర్.

అదే ఎజెండా.. తెలంగాణే మది నిండా
కేసీఆర్ గులాబీ జెండా.. ప్రగతి దండ



- నియోజకవర్గానికి 3 వేల మందికి వర్తింపు
- ఒక్కో విడతలో లక్ష చొప్పున ఖాతాలో జమ
- డబుల్ బెడ్‌రూం పథకం కూడా కొనసాగింపు
- 30 లక్షల ఇండ్లపై 4,000 కోట్ల అప్పు మాఫీ
- జీవో 58, 59 కటాఫ్ గడువు 2020కి పెంపు
- చివరిసారి దరఖాస్తు చేసుకొనేందుకు చాన్స్
- క్యాబినెట్ నిర్ణయాలు.. వెల్లడించిన హరీశ్

మరో 1.3 లక్షల మందికి దళితబంధు
118 నియోజకవర్గాల్లో 1100 మందికి..

ఏప్రిల్ నుంచి మళ్లీ గొర్రెల పంపిణీ
రూ.4,463 కోట్ల నిధులు మంజూరు

4 లక్షల ఎకరాల పోడుకు పట్టాలు
1.55 లక్షల అడవిబిడ్డలకు పంపిణీ

ఏప్రిల్ ఆఖరు నుంచి వడ్ల కొనుగోలు
యాసంగి పంట ప్రతిగింజా సేకరణ



బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థులు దేశపతి శ్రీనివాస్, కే నవీన్‌కుమార్ పార్టీ అధినేత, సీఎం కేసీఆర్‌ను గురువారం ప్రగతిభవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. నామినేషన్ దాఖలు చేసిన అనంతరం నేరుగా ప్రగతిభవన్‌కు వెళ్లి తమకు ఎమ్మెల్సీలుగా అవకాశం కల్పించినందుకు సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం వారికి శుభాకాంక్షలు తెలిపారు.



అంబేద్కర్ విగ్రహం ఏప్రిల్ 14న ఆవిష్కారం

- అదే రోజు హైదరాబాద్‌లో భారీ సభ
- తెలంగాణ అమరవీరుల స్మృతి చిహ్నం
- సెక్రటేరియట్ జూన్ 2లోగా ప్రారంభం

హైదరాబాద్, మార్చి 9 (నమస్తే తెలంగాణ): పేదల గృహ నిర్మాణం కోసం తెలంగాణ సర్కారు కీలక నిర్ణయం తీసుకొన్నది. సీఎం కేసీఆర్ శాసనసభలో చెప్పినట్టుగానే సొంత స్థలం ఉండి ఇల్లు నిర్మించుకొనేందుకు ఆర్థిక స్థోమతలేని పేదల కోసం 'గృహలక్ష్మి పథకం' ప్రారంభించాలని క్యాబినెట్ నిర్ణయించింది. ప్రస్తుతం డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణాన్ని కొనసాగిస్తూనే.. గృహలక్ష్మి పథకం కింద ఒక్కో లబ్ధిదారుడికి రూ. 3 లక్షల చొప్పున గ్రాంటుగా ఇవ్వాలని నిర్ణయించింది. కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాల హయాంలో వివిధ గృహనిర్మాణ పథకాల కింద లబ్ధిదారుల వాటాతో నిర్మించిన ఇండ్లకు సంబంధించిన రూ. 4 వేల కోట్ల అప్పును ప్రభుత్వం మాఫీ చేయాలని నిర్ణయించింది. దీంతో 30 లక్షల మందికి ఊరట లభించనున్నది. అలాగే, స్థలాల క్రమబద్ధీకరణకు సంబంధించిన జీవో-58, 59 కటాఫ్ గడువును 2020కి పెంచుతూ నిర్ణయించిన నేపథ్యంలో కొత్తగా దరఖాస్తు చేసుకొనేందుకు మరో నెల సమయం ఇవ్వాలని నిర్ణయం తీసుకొన్నది. అలాగే, కాశీ, శబరిమలకు వెళ్లే రాష్ట్ర భక్తుల సౌకర్యార్థం ఈ రెండుచోట్లా రూ.25 కోట్ల చొప్పున ఖర్చుతో వసతిగృహ సముదాయాలు నిర్మించాలని నిర్ణయించింది. ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్ అధ్యక్షతన గురువారం జరిగిన సమావేశంలో రాష్ట్ర మంత్రి మండలి పలు కీలక నిర్ణయాలు తీసుకొన్నది. రెండో విడత దళితబంధు పథకం, గొర్రెల పంపిణీ కార్యక్రమాలను వెంటనే చేపట్టాలని నిర్ణయం తీసుకొన్నది. సమావేశం అనంతరం రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు, మంత్రులు గంగుల కమలాకర్, ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మల్లారెడ్డి తదితరులతో కలిసి క్యాబినెట్ తీసుకొన్న నిర్ణయాల వివరాలను విలేకరులకు వెల్లడించారు. రెండో విడత దళితబంధు పథకం కింద లక్షా 30 వేల కుటుంబాలకు సహాయం అందించాలని, ఈ ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని అధికారులను ఆదేశిస్తూ నిర్ణయం తీసుకొన్నట్టు › 3వ పేజీలో



డబుల్ ఇంజిన్.. ప్రధాని, అదానీ

- ఈడీ విచారణకు హాజరవుతా.. సహకరిస్తా
- ఎన్నికల రాష్ట్రాల్లో మోదీకి ముందే ఈడీ
- దర్యాప్తు సంస్థల దాడులు ఎన్నికల స్టంట్
- ఏజెన్సీల డైరెక్టర్లకు ఎక్స్‌టెన్షన్ ఎందుకు?
- అగ్నివీర్ పోస్టులను పర్మినెంట్ చేయండి › 4
- బీజేపీ సర్కారును గద్దె దింపటమే లక్ష్యం
- ఎప్పటికైనా బీఆర్ఎస్సే ప్రత్యామ్నాయం
- బీజేపీ డైవర్షన్ పాలిటిక్స్ చెల్లవని నిరూపిస్తా
- మహిళలను వీసీలో విచారించాలి: కవిత

మోదీ బినామీ అదానీ

హిండెన్‌బర్గ్‌పై అదానీని ప్రశ్నించే దమ్ముందా?

- డబుల్ ఇంజిన్ అసలు రూపం మోదానీ
- ఈడీ జారీచేసే సమన్లు.. మోదీ సమన్లే
- సీబీఐ కీలుబొమ్మ... ఈడీ తోలుబొమ్మ › 2
- దాడులతో బీఆర్ఎస్ విస్తరణను ఆపలేరు
- దేశమంతా అవినీతిపరులా? బీజేపీ నేతలు సత్యహరిశ్చంద్రుడి కజిన్నా.. బామ్మర్దులా?
- బీజేపీ నిజస్వరూపాన్ని నగ్నంగా నిలబెడ్తాం
- విపక్షాలపై కేసుల దాడి.. ప్రజలపై ధరల దాడి
- ఏ విచారణకైనా మేం సిద్ధం.. మోదీ రెడీయా?
- ప్రెస్‌మీట్‌లో ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ సవాల్

అదానీకి శ్రీలంకకు మధ్య రూ.6 వేల కోట్ల ఒప్పందంపై జీ టు జీ డీల్‌గా శ్రీలంక ఆర్థిక మంత్రి చెప్పారు. అంటే గౌతమ్ అదానీ టు గొటబయ రాజపక్సే (శ్రీలంక మాజీ అధ్యక్షుడు). జీ టు జీకి మధ్యవర్తి మోదీ. అదానీ కంపెనీ నరేంద్రమోదీ సొంత కంపెనీ. అదానీ కోసం ప్రపంచవ్యాప్తంగా ప్రధాని హోదాలో మార్కెటింగ్ చేస్తున్నారు. ప్రధానిపై ఆరోపణలు వస్తే ప్రజలకు వివరణ ఇవ్వాలనే ఇంగితం కూడా లేదు.

- మంత్రి కేటీఆర్





బోయింగ్.. రోరింగ్

హైదరాబాద్‌లో కన్వర్షన్ లైన్

జీఎమ్మార్ ఏరో టెక్నిక్స్ భాగస్వామ్యంతో ఏర్పాటు

- త్వరలోనే ఇరు సంస్థల ఒప్పందం.. ఫలిస్తున్న సీఎం కేసీఆర్ కృషి
- సరుకు రవాణా విమానాలుగా 737 బోయింగ్ ప్యాసింజర్ ప్లేన్లు
- కలిసొస్తున్న తెలంగాణ ప్రభుత్వం ప్రగతిశీల విధానాలు › 12

నేడు ఢిల్లీలో ఎమ్మెల్సీ కవిత దీక్ష

- మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం డిమాండ్
- హాజరుకానున్న 18 పార్టీల ప్రతినిధులు
- ఆరు వేల మంది పాల్గొనేలా ఏర్పాట్లు › 4


- డిగ్రీలో సైబర్ సెక్యూరిటీ కోర్సు వచ్చే ఏడాది అందుబాటులోకి
- అన్ని ప్రోగ్రాంల విద్యార్థులకు వర్తింపు
- రూపొందించిన నల్సార్, ఓయూ › 5



గురువారం అసెంబ్లీలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానానికి రిటర్నింగ్ అధికారులకు నామినేషన్ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి దేశపతి శ్రీనివాస్. చిత్రంలో మంత్రులు హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్‌యాదవ్, జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే బాల్క సుమన్



నామినేషన్ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి నవీన్‌రావు. చిత్రంలో మంత్రులు మహమూద్ అలీ, సబితా ఇంద్రారెడ్డి, మల్లారెడ్డి, ఎంఐఎం ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్



నామినేషన్ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి చల్లా వెంకట్రామిరెడ్డి. చిత్రంలో మంత్రులు నిరంజన్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే అబ్రహం

మోదీ బినామీ అదానీ

హిండెన్‌బర్గ్‌పై అదానీని ప్రశ్నించే దమ్ముందా?

డబుల్ ఇంజిన్ అసలు రూపం మోదానీ • ఈడీ జారీచేసే సమన్లు.. మోదీ సమన్లే • సీబీఐ కీలుబొమ్మ... ఈడీ తోలుబొమ్మ • బీజేపీ నిజస్వరూపాన్ని నగ్నంగా నిలబెడ్తాం

దేశమంతా అవినీతిపరులా.. బీజేపీ నేతలు సత్యహరిశ్చంద్రుడి కజిన్సా.. బామ్మర్దులా? • ఏ విచారణకైనా మేం సిద్ధం.. మోదీ రెడీయా? • ప్రెస్‌మీట్‌లో ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ సవాల్

హైదరాబాద్, మార్చి 9 (నమస్తే తెలంగాణ): ప్రధాని మోదీకి విచారణను ఎదుర్కొనే దమ్ముందా? మంత్రి కేటీఆర్ సవాల్ విసిరారు. మోదీకి అదానీనే బినామీ అని దేశంలో చిన్నపిల్లవాడిని అడిగినా చెప్తాడని ఎద్దేవా చేశారు. చట్టాలను గౌరవించే భారతీయపౌరులుగా తాము విచారణను ధైర్యంగా ఎదుర్కొంటామని, న్యాయ వ్యవస్థపై నమ్మకం ఉన్నదని తెలిపారు. కేసును ఎదుర్కొనే ధైర్యంలేని బీజేపీ నేత బీఎల్ సంతోష్ లాంటి వాళ్లం తాము కాదని స్పష్టం చేశారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని కనుమరుగు చేయటమే బీజేపీ లక్ష్యమని విమర్శించారు. దేశవ్యాప్తంగా విపక్షపార్టీల నేతలపై కేంద్ర దర్యాప్తు సంస్థలు జారీ చేసే సమన్లను మోదీ సమన్లుగా ఆయన అభివర్ణించారు. సీబీఐ, ఈడీ, ఐటీ సంస్థల దాడులకు బీఆర్‌ఎస్‌కు చెందిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు బెదరరని తేల్చి చెప్పారు. మంత్రి గంగుల కమలాకర్ నుంచి ఎమ్మెల్సీ కవిత దాకా ఎంతోమంది బీఆర్‌ఎస్ పార్టీనేతలపై దాడులు జరిగాయని తెలిపారు. గురువారం తెలంగాణభవన్‌లో మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, వీ శ్రీనివాస్‌గౌడ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, పువ్వాడ అజయ్, ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే క్రాంతికిరణ్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. మోదీ సర్కార్‌పై కేటీఆర్ నిప్పులు చెరిగారు. మోదానీగా మారిన డబుల్ ఇంజిన్ సర్కార్ నిజస్వరూపాన్ని నగ్నంగా ప్రజల ముందు ఉంచుతామని చెప్పారు. ఈడీ, సీబీఐ, ఐటీ దాడులు బీఆర్‌ఎస్ విస్తరణను, సీఎం కేసీఆర్ మనోస్థైర్యాన్ని అడ్డుకోలేవని స్పష్టం చేశారు.

సీబీఐ కీలుబొమ్మ... ఈడీ తోలుబొమ్మ

మోదీ చేతుల్లో సీబీఐ కీలుబొమ్మ.. ఈడీ తోలుబొమ్మగా మారాయని మంత్రి కేటీఆర్ ఆరోపించారు. బీఆర్‌ఎస్ పార్టీ నేతలపై ఇప్పటి దాకా జరిగిన దాడులు నూటికి నూరుపాళ్లు ఈడీ ద్వారా మోదీ చేయించిన దాడులని పేర్కొన్నారు. అయితే జుమ్లా లేదంటే హమ్లా ఇదే మోదీ విధానంగా మారిందని ధ్వజమెత్తారు. దేశమంతా అవినీతిపరులు, తాము మాత్రమే సత్యహరిశ్చంద్రుడి కజిన్‌బ్రదర్స్.. బామ్మర్దులైనట్టు బీజేపీ ఫోజులు కొడుతున్నదని ఎద్దేవా చేశారు. నీతి లేని పాలనకు.. నిజాయితీలేని దర్యాప్తు సంస్థలకు పర్యాయపదంగా ఎన్డీయే ప్రభుత్వం నిలిచిందన్నారు.

ప్రతిపక్షాల మీద కేసుల దాడి.. ప్రజల మీద ధరల దాడి

> ప్రతిపక్షాల మీద కేసుల దాడి, ప్రజల మీద ధరల దాడి.. ఇది తప్ప కేంద్రం సాధించింది ఏమీలేదని కేటీఆర్ స్పష్టం చేశారు. గౌతమ్ అదానీ ఎవరి బినామో చెప్పాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని, మోదీని ప్రశ్నించారు. మోదీ వల్లనే అదానీ ప్రాపకం పెరిగిందని స్పష్టం చేశారు.

బీబీసీపై దాడితో ఇండియన్ మీడియాకు మోదీ హెచ్చరిక

బీబీసీ వంటి అంతర్జాతీయ మీడియా సంస్థల మీద దాడులు చేయడం ద్వారా తమకు అనుకూలంగా లేకపోతే మీడియా సంస్థల మీద ఎలాంటి చర్యలకైనా సిద్ధం అని మోదీ దేశ మీడియా సంస్థలను హెచ్చరించారని మంత్రి కేటీఆర్ చెప్పారు. 'బీబీసీనే లెక్క చేస్తలేను ఇక మీరెంత' అని ఇండియన్ మీడియాకు వార్నింగ్ ఇచ్చారని తెలిపారు.

జీ టు జీ డీల్ – అదానీ మోదీ బినామీ

జీ 20 సదస్సులో పాల్గొనడానికి వచ్చిన శ్రీలంక ఆర్థిక మంత్రి అదానికి శ్రీలంకకు మధ్య జరిగిన రూ.6 వేల కోట్ల ఒప్పందంపై జీ టు జీ డీల్‌గా పేర్కొన్న విషయాన్ని మంత్రి ఉదహరించారు. జీ టు జీ అంటే గవర్నమెంట్ టు గవర్నమెంట్ కాదని, అదీ గౌతమ్ అదానీ టు గొటబయ (శ్రీలంక మాజీ రాష్ట్రపతి గొటబయ రాజపక్సే) అని వివరించారు. జీ టు జీకి మధ్యవర్తిగా వ్యవహరించింది మోదీ అని విమర్శించారు. మోదీ అధికారంలోకి వచ్చిన తరువాత దేశంలో ప్రతిపక్షాల మీద 5,422 కేసులు పెట్టారని, వీటిలో కేవలం 23 కేసుల్లో మాత్రమే శిక్షపడిందని తెలిపారు. దర్యాప్తుసంస్థను ఈ స్థాయిలో దుర్వినియోగం చేసినందుకు ఈడీకి నోబెల్ ప్రైజ్ ఇవ్వాలా? అని ఎద్దేవా చేశారు. ఈడీ అంటే ఇరాడికేషన్ ఆఫ్ డెమోక్రసీ (ప్రజాస్వామ్యాన్ని కనుమరుగు చేయటం)గా మోదీ మార్చారని మండిపడ్డారు. దేశంలో అసలు ప్రతిపక్షాలే లేకుండా చేయాలనే మోదీ కుట్రకు నిదర్శనమే ఈ దాడులని వివరించారు. కేవలం విపక్షాలపై బురదజల్లటమే పనిగా బీజేపీ వ్యవహరిస్తున్నదన్నారు. నమ్ముకున్న ప్రజల కోసం బీజేపీ వైఫల్యాలను ఎండగట్టిన పాపానికి ప్రాంతీయ పార్టీల నేతల మీద కేసుల పేరుతో బీజేపీ బెదిరిస్తున్నదని తెలిపారు. ఒక్క బీజేపీ నాయకుడిపై ఈడీ, సీబీఐ దాడులు ఎందుకు లేవని నిలదీశారు.



రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారని, దీనిమీద ఈడీ, సీబీఐ దాడి ఎందుకు జరగలేదని ప్రశ్నించారు. మహారాష్ట్రకు చెందిన ఎంపీ పాటిల్ చేసిన వ్యాఖ్యలపై టీవీల్లో ప్రసారమైన వీడియో క్లిప్‌ను మంత్రి కేటీఆర్ ప్రదర్శించారు. కాంగ్రెస్ నుంచి గెలిచి బీజేపీలో చేరిన హర్షవర్ధన్ అనే ఎంపీ 'నేను బీజేపీలోకి వచ్చిన తర్వాత హాయిగా నిద్రపోతున్నా. ఈడీ నుంచి ఉపశమనం లభించింది' అని బాహాటంగా చెప్పిన ఉదంతాలను పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్‌లో వేల కోట్ల కుంభకోణంలో ఇరుక్కున్న తృణమూల్ నేత సువేందు అధికారిని విచారణ పేరుతొ భయపెట్టి ఆ తర్వాత బీజేపీలో చేరగానే వాషింగ్ పౌడర్ నిర్మా కాలేదా? అని గుర్తు చేశారు. శారదా కుంభకోణంలో ప్రధాన నిందితుడిగా ఉన్న హిమంత బిశ్వశర్మ బీజేపీలో చేరిన తరువాత ఈడీ, సీబీఐ కేసులు, దర్యాప్తు ఎక్కడికి పోయాయని ప్రశ్నించారు.

కేసీఆర్ మానసిక స్థైర్యాన్ని దెబ్బతీయలేరు

కేసీఆర్ మానసిక స్థైర్యాన్ని దెబ్బతీయాలనే బీజేపీ కుట్రలను తిప్పికొడతామని మంత్రి కేటీఆర్ తేల్చి చెప్పారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి 105 సీట్లల్లో డిపాజిట్లు రాలేదని గుర్తుచేశారు. ఉద్యమనేత బిడ్డగా మొదటి నుంచే చైతన్యాన్ని పుణికిపుచ్చుకున్న ఉద్యమకారురాలు ఎమ్మెల్సీ కవితపై ఈడీ పేరుతో వేధింపులకు దిగటం వెనుక ఉద్దేశం కేసీఆర్‌ను టార్గెట్ చేయటం కాదా? అని ప్రశ్నించారు.

రాజకీయ డ్రామాను ఎదుర్కొంటాం

రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగానే ఇదంతా జరుగుతున్నదని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. రాజకీయ డ్రామాను రాజకీయంగానే ఎదుర్కొంటామని చెప్పారు. తమకు న్యాయవ్యవస్థపై నమ్మకం ఉన్నదన్నారు. అంతిమంగా న్యాయమే విజయం సాధిస్తుందని చెప్పారు. మోదీ సమన్లకు.. ఉడుత ఊపులకు తెలంగాణలో భయపడేవాడెవరూ లేరని స్పష్టం చేశారు. ప్రతిరోజూ ఆదివారమేలా కాదో, మోదీయే శాశ్వతం కాదని తెలిపారు.

అవినీతికి కేరాఫ్ బీజేపీ

దేశంలో అవినీతికి కేరాఫ్‌గా బీజేపీ మారిందని కేటీఆర్ ఆరోపించారు. 2 రోజుల క్రితం కర్ణాటకలో బీజేపీ ఎమ్మెల్యే విరూపాక్షప్ప కొడుకు రూ.40 లక్షల లంచం తీసుకుంటూ

రూ.2500 కోట్లు ఇస్తే సీఎం పదవీ ఇస్తానని చెప్పిందెవరు?

కర్ణాటక ఎమ్మెల్యే, మాజీ మంత్రి రూ.2500 కోట్లు ఇస్తే తమ పార్టీ ముఖ్యమంత్రి పదవి ఇస్తానని బాహాటంగా చెప్పింది నిజం కాదా? అని మంత్రి నిలదీశారు. ఇంత బాహాటంగా చేసిన వ్యాఖ్యలపై చర్యలు తీసుకోలేదంటేనే అందులో నిజం ఉన్నట్టు ప్రజలకు అర్థమైపోయిందని తెలిపారు. దేశంలో అత్యంత అవినీతి పాలన కర్ణాటకలో సాగుతున్నదని మీడియా, తమకు పనులు కావాలంటే 40 శాతం కమీషన్ ఇవ్వాల్సి వస్తున్నదని ఆ రాష్ట్ర కాంట్రాక్టర్లు, ప్రైవేట్ యాజమాన్య సంస్థలు బాహాటంగా ఘోషిస్తే చర్యలెక్కడ తీసుకున్నారని ప్రశ్నించారు. హిందుత్వానికి ప్రతీకలుగా ఉన్న మఠాధిపతులు కూడా తమకు కమీషన్లు ఇవ్వాల్సిందేనని పట్టుపడుతున్న సందర్భాలను సైతం కేటీఆర్ గుర్తుచేశారు.

బీజేపీలో చేరితే పునీతులా..

దేశంలో ఏం జరుగుతున్నదంటే సీఎం కేసీఆర్ చెప్పినట్టు వాషింగ్‌పౌడర్ నిర్మా జరుగుతున్నదని మంత్రి కేటీఆర్ ఎద్దేవా చేశారు. గంగలో మునిగినోళ్లు పునీతులు అయిపోతారు అన్నట్టు బీజేపీలో చేరగానే వారి పాపాలు పోతున్నాయన్నట్టుగా ఆ పార్టీ వ్యవహరిస్తున్నదని ఆరోపించారు. అందుకు అనేక ఉదహరణలున్నాయని వెల్లడించారు. వైఎస్ సుజనాచౌదరి ఉదంతాన్ని ఉదాహరణగా పేర్కొన్నారు. సుజనాచౌదరీకి 6 విలాసవంతమైన కార్లు.. 120 షెల్ కంపెనీలకు సంబంధించి రూ.6000 కోట్ల అవినీతి జరిగిందని నవంబర్ 24, 2018న ఈడీ తన అధికారిక ట్వీట్‌లో పేర్కొన్నదని తెలిపారు. దీంతో జూన్ 20, 2019న సుజనా చౌదరీ, సీయం రమేశ్ ఇద్దరూ బీజేపీలో చేరినట్టు ఆధారాలతో సహా వివరించారు. ఇది వాషింగ్‌పౌడర్ నిర్మా కాక మరేంటని నిలదీశారు.

ఈడీ, సీబీఐ, ఐటీ దాడులకు గురైన మంత్రులు, బీఆర్‌ఎస్ నేతలు

- మంత్రి గంగుల కమలాకర్
- మంత్రి మల్లారెడ్డి
- జగదీశ్‌రెడ్డి, పీఏ
- తలసాని శ్రీనివాస్ యాదవ్ పీఏ, బంధువులు
- బీఆర్‌ఎస్ లోక్‌సభాపక్ష నేత నామా నాగేశ్వర్‌రావు
- రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, పార్థసారథిరెడ్డి
- లోక్‌సభ సభ్యుడు మన్నే శ్రీనివాస్‌రెడ్డి
- ఎమ్మెల్యేలు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, పైలట్ రోహిత్‌రెడ్డి
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

మోదీకి విచారణను ఎదుర్కొనే దమ్ముందా?

బీఎల్ సంతోష్ ఇద్దరు స్వాములను పంపి దొరికాడని.. ఆయన దొంగలా కోర్టులకు వెళ్లి విచారణకు రాకుండా స్టే తెచ్చుకున్నారని, తాము అలా కాదని మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. విచారణకు హాజరు కాకుండా కోర్టుకు పోయి తనను అరెస్టు చేయవద్దని భయపడి దాక్కోబోమని తేల్చిచెప్పారు. చట్టాలను గౌరవించే వ్యక్తులుగా బాజాప్తా విచారణకు హాజరవుతామని స్పష్టం చేశారు. విచారణలను ఎదుర్కొంటామని చెప్పారు. ఎమ్మెల్సీ కవిత కూడా బాజాప్తా ఎదుర్కొంటారని తెలిపారు. ఈడీ, సీబీఐ, ఐటీ దాడులు ఎదర్కోవటంలో తమ పార్టీలో కవితనే మొదటివారు కాదని, ఆమె చివరి వారూ కాబోరని కూడా చెప్పారు. ఇప్పటికే మంత్రులు గంగుల కమలాకర్, మల్లారెడ్డి, తలసాని, జగదీశ్‌రెడ్డి, నామా నాగేశ్వరరావు, ఎల్ రమణ, పైలెట్ రోహిత్‌రెడ్డి, మన్నె శ్రీనివాస్‌రెడ్డి, పార్థసారథిరెడ్డి తదితరులపై కేంద్ర ప్రభుత్వ సంస్థలు దాడులు చేశాయని గుర్తు చేశారు. ఇటువంటివి ఇంకా వస్తాయని చెప్పారు. ఎన్ని వచ్చినా వాటి విచారణను ఎదుర్కొనే దమ్ము తమకు ఉన్నదని, ఆ దమ్ము మోదీకి ఉన్నదా? అని ఆయన ప్రశ్నించారు. గౌతం అదానీ మోదీ బినామీ అని లోకం కోడై కూస్తున్నా... శ్రీలంక ప్రభుత్వం చెప్పినా 'పలుకే బంగారమాయేనా ' అన్నట్టు మోదీ ఎందుకు మాట్లాడటం లేదన్నారు. చాయ్‌పే చర్చ.. పరీక్షాపై చర్చ అని అన్నిటిపై మాట్లాడే మోదీ వీటిపై ఎందుకు స్పందించటం లేదని నిలదీశారు.



గురువారం హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కల్వకుంట్ల తారకరామారావు. చిత్రంలో మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, పువ్వాడ అజయ్‌కుమార్, వీ శ్రీనివాస్‌గౌడ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే క్రాంతికిరణ్, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్

గౌతమ్ అదానీని ప్రశ్నించే దమ్ముందా?

దేశాన్ని ఓ కుదుపు కుదిపిన హిండెన్‌బర్గ్ నివేదికతో రూ.13 లక్షల కోట్ల ఎల్ఐసీ, ఎస్‌బీఐ సంస్థల్లోని ప్రజల డబ్బులు ఆవిరైనా ప్రధానమంత్రి ఉలకడు పలకడు, దేశ ఆర్థిక మంత్రికి కనీసం చీమకుట్టినట్టు కూడా కాదని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. హిండెన్‌బర్గ్ నివేదికపై ప్రధాని, ఆర్థికమంత్రి నోరెందుకు మెదపరని నిప్పులు చెరిగారు. ఒక సంస్థకు రెండు ఎయిర్‌పోర్టులకంటే ఎక్కువ కాంట్రాక్టు కట్టబెట్టొద్దు అని అప్పటిదాకా ఉన్న నిబంధనలను తుంగలో తొక్కి గౌతమ్ అదానీకి 6 ఎయిర్‌పోర్టులు కట్టబెట్టడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. ఇలా కట్టబెట్టడం సరికాదని కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ, నీతి అయోగ్ చెప్పినా ఎవరి ప్రయోజనాల కోసం కట్టబెట్టారని ఆయన ప్రశ్నించారు. ఒక వ్యక్తికి అనుకూలంగా నిబంధనలను మార్చి ఆయనకు ఆర్థికలబ్ది చేకూరేలా వ్యవహరిస్తూ దేశాన్ని మోదీ ప్రభుత్వం భ్రష్టు పట్టిస్తున్నదని మండిపడ్డారు. గౌతం అదానీ ఆధీనంలోని గుజరాత్ ముంద్రాపోర్టులో రూ.21 వేల కోట్ల విలువైన 3000 కిలోల హెరాయిన్ పట్టుబడినా ఒక్క కేసు కూడా ఎందుకు నమోదు కాదని ప్రశ్నించారు. కేంద్రానికి, దర్యాప్తు సంస్థలకు గౌతమ్ అదానీని ప్రశ్నించే దమ్ముందా అని ఆయన నిప్పులు చెరిగారు. దేశంలోని యువతను పెడత్రోవ పట్టించే మత్తు పదార్థాలు అదానీ పోర్టు కేంద్రంగా బట్వాడా అయితే అదానీపై కేసు పెట్టారా? అని నిలదీశారు.

విదేశీ బొగ్గెందుకు?

> ఒక వ్యక్తి ప్రయోజనం కోసం విధానాన్ని మార్చిన దుర్మార్గం కేంద్రంలోని బీజేపీ సర్కార్‌దని మంత్రి కేటీఆర్ మండిపడ్డారు. స్వదేశంలో చౌకగా దొరికే బొగ్గు ఉండగా, విదేశీబొగ్గును ఎందుకు తీసుకోవాలె అని ముఖ్యమంత్రి కేసీఆర్‌తోపాటు స్వయంగా ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ యోగి కూడా ప్రశ్నించటం నిజం కాదా? అని గుర్తు చేశారు. ఇది ఒక వ్యక్తి కోసం పాలసీ మార్చటం కాక మరేమిటని ప్రశ్నించారు. అదానీ ఇండోనేషియా, ఆస్ట్రేలియాలో తీసుకున్న బొగ్గు కోసం మోదీ ఇదంతా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇజ్జత్‌లేకుండాప్రమాణ స్వీకారానికి

దేశంలో కొన్రాడ్ సంగ్మా ప్రభుత్వం అత్యంత అవినీతి పాలన సాగిస్తున్నదని మేఘాలయ ఎన్నికల ప్రచార సభల్లో అమిత్‌షా, ప్రధాని మోదీ ఇద్దరికిద్దరు విమర్శించి, తీరా అదే సంగ్మా సీఎంగా పదవీ ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఇజ్జత్‌లేకుండా వెళ్లారని మంత్రి కేటీఆర్ ధ్వజమెత్తారు. సంగ్మా పార్టీకి 28 సీట్లు, బీజేపీకి 2 సీట్లు రావటంతో సంగ్మాకు మద్దతు ఇచ్చిన మాట వాస్తవం కాదా? అని ఆయన ప్రశ్నించారు. రాజకీయాల్లో ఇజ్జత్.. మానం.. మాట్లాడిన మాటకు విలువ ఉన్నదా? అని మంత్రి కేటీఆర్ నిప్పులు చెరిగారు. అధికారం కోసం ఏదైనా చేస్తామనే మోదీ వ్యవహారాన్ని దేశ ప్రజలందరూ గమనిస్తున్నారని చెప్పారు.

డబుల్ ఇంజిన్ అసలు రూపం మోదానీ

మోదీ సర్కార్ తొమ్మిది ఏండ్ల పాలనలో 9 రాష్ట్రాల్లో ప్రభుత్వాలను కూల్చింది, రాజకీయ పార్టీలను చీల్చింది నిజం కాదా? అని మంత్రి కేటీఆర్ ప్రశ్నించారు. డబుల్ ఇంజిన్ అంటూ ఊదరగొడుతున్న బీజేపీ ప్రభుత్వం అసలు రంగు దేశ ప్రజలకు తెలిసిపోయిందని తెలిపారు. డబుల్ ఇంజిన్‌లో ఒక ఇంజిన్ మోదీ అయితే మరో ఇంజిన్ అదానీ అని, ఈ రెండూ కలిస్తే మోదానీ అని ఎద్దేవా చేశారు. ఇందులో ఒకటి పొలిటికల్ ఇంజిన్.. మరొకటి ఎకనామిక్ ఇంజిన్.. అదానీ కోసం మార్కెటింగ్ చేయటం.. ప్రాజెక్టులు ఇప్పించటం మోదీ పని అయితే.. ప్రాజెక్టులల్లో వచ్చిన దందా సొమ్మును అదానీ చందాల రూపంలో పార్టీకి ఇవ్వటం, ఆ దొంగ సొమ్ముతో రాష్ట్రాల్లో ప్రజల పక్షాన నిలిచిన పార్టీలను, ప్రభుత్వాలను కూల్చటమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. తమకు అనుకూలంగా లేని, తమ పార్టీలో చేరని నాయకులపై, పార్టీలపై ఈడీని ఉసిగొల్పాలి అనేది మోదీ నిత్యకృత్యంగా మారిందని ఆరోపించారు. రాష్ట్రంలో ఇటీవల మునుగోడు ఉపఎన్నికలకు ముందు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి రూ.18 వేల కోట్ల కాంట్రాక్టు కట్టబెట్టి కాంగ్రెస్ అభ్యర్థిని బీజేపీ తరుపున నిలపెట్టింది నిజం కాదా? ఇది కాదని చెప్పే దమ్మూ.. ధైర్యం ఉన్నదా? అని నిలదీశారు. మోదీ, అదానీ చీకటి స్నేహం ఎన్నో రోజులు దాగదని స్పష్టం చేశారు.

మద్యనిషేధం ఉన్న గుజరాత్‌లో జరిగింది నిజమైన లిక్కర్ స్కాం

మద్య నిషేధం ఉన్న గుజరాత్‌లో కల్తీ మద్యం తాగి 42 మంది మరణించారని, అసలైన లిక్కర్ స్కాం ఆ రాష్ట్రంలో జరిగిందని మంత్రి కేటీఆర్ వెల్లడించారు. అయితే కొంతమందికి అనుకూలంగా పాలసీ తయారు చేశారనేది బీజేపీ అభియోగమని, అదానీకి అనుకూలంగా పాలసీలు తయారు చేస్తే అవి తప్పు కాదా? అని ప్రశ్నిస్తూ.. ఆర్థికమంత్రిత్వశాఖ, నీతి అయోగ్ లాంటి సంస్థలే కాకుండా హిండెన్‌బర్గ్ నివేదిక ఈ విషయాన్నే తేల్చి చెప్పాయని వివరించారు.

వీ6లో.. ఏం చూపిస్తారో వెలుగులో ఏం రాస్తారో తెలుసు

గుజరాత్‌లో మద్య నిషేధం ఉన్నా 42 మంది చనిపోతే వీ6లో చూపించారా? దీన్ని లిక్కర్ స్కాం అనాలా? మోదీ స్కాం అనాలా? అని మంత్రి కేటీఆర్ నిలదీశారు. వీ6లో ఏం చూపిస్తారో, వెలుగులో ఏం రాస్తారో, ఏ డ్రామాలు చేస్తారో మాకు తెలుసు.. మిమ్మల్ని ఎప్పుడు బ్యాన్‌చేయాలో కూడా మాకు తెలుసని పేర్కొన్నారు. బీజేపీ మౌత్ పీస్‌లాగా పనిచేసే సంస్థల నిజస్వరూపాన్ని ప్రజల ముందు ఎండగడతామని తేల్చిచెప్పారు. 'నమస్తే తెలంగాణ', 'తెలంగాణ టు డే'ను బీజేపీ ఆఫీసులో బ్యాన్ చేసిన విషయాన్ని గుర్తుచేశారు. దేశంలో మీడియా తన వెన్నెముక కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీలంకలో మోదీ వ్యవహారాన్ని ఎందుకు రిపోర్ట్ చేయలేదని నిలదీశారు. జర్నలిస్టు మిత్రులపై, సంస్థలపై తమకు గౌరవం ఉన్నదని, అలాగే యాజమాన్యాలపై తమకు స్పష్టమైన అవగాహన ఉన్నదని స్పష్టం చేశారు.

ఎమ్మెల్సీ స్థానాలకు దేశపతి, చల్లా, నవీన్ నామినేషన్

- హాజరైన మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు
- కోలాహలంగా శాసనసభ ప్రాంగణం

హైదరాబాద్, మార్చి 9 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థులుగా బీఆర్‌ఎస్ పార్టీ నేతలు నవీన్‌కుమార్, దేశపతి శ్రీనివాస్, చల్లా వెంకట్రాంరెడ్డి గురువారం ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు సమర్పించారు. ముందుగా గన్‌పార్క్‌లోని అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించారు. అనంతరం మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, ప్రభుత్వ విప్ బాల్క సుమన్‌తో కలిసి దేశపతి శ్రీనివాస్ తన నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే అబ్రహాంతో కలిసి చల్లా వెంకట్రాంరెడ్డి, అలాగే మంత్రులు సబితాఇంద్రారెడ్డి, మల్లారెడ్డి, మహమూద్ అలీ, ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్‌తో కలిసి నవీన్‌కుమార్ తన నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారికి సమర్పించారు.

కోలాహలంగా అసెంబ్లీ ప్రాంగణం

ఎమ్మెల్సీ అభ్యర్థుల నామినేషన్ సందర్భంగా అసెంబ్లీ ప్రాంగణం కోలాహలంగా మారింది. మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, పువ్వాడ అజయ్, అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ప్రభుత్వ విప్‌లు ఎంఎస్ ప్రభాకర్‌రావు, శంభీపూర్ రాజు, గువ్వల బాలరాజు, ఎమ్మెల్సీ వాణీదేవి సహా పలువురు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, నామినేషన్ దాఖలు చేసిన అభ్యర్థుల కుటుంబ సభ్యులతో అసెంబ్లీ ప్రాంగణం కిటకిటలాడింది.

నేడు బీఆర్‌ఎస్ విస్తృత స్థాయి సమావేశం

- తెలంగాణభవన్‌లో మధ్యాహ్నం రెండు గంటల నుంచి మొదలు
- ఎన్నికల సంవత్సరం నేపథ్యంలో శ్రేణులకు అధినేత కేసీఆర్ దిశానిర్దేశం

హైదరాబాద్, మార్చి 9 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం శుక్రవారం జరుగనున్నది. హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో మధ్యాహ్నం 2 గంటలకు పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి పార్లమెంటరీ పార్టీ, లెజిస్లేచర్ పార్టీ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లాల పార్టీ అధ్యక్షులు, జిల్లా పరిషత్ చైర్మన్లు, రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ల చైర్మన్లు, డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్లు హాజరుకానున్నారు. ఎన్నికల సంవత్సరం కావడంతో అనుసరించాల్సిన విధివిధానాలపై పార్టీ శ్రేణులకు సీఎం కేసీఆర్ దిశానిర్దేశం చేయనున్నారు. ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను అన్ని నియోజకవర్గాల్లో క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లటంతోపాటు విపక్షాల ఎత్తుగడను ఎలా చిత్తుచేయాలి? అనే అంశంపై అధినేత కీలక సూచనలు చేయనున్నారు.


కీలక పథకాలపై అధినేత దిశానిర్దేశం

క్యాబినెట్ తీసుకొన్న నిర్ణయాల్లో కీలకమైన గృహలక్ష్మి పథకం, దళిత బంధు, రెండో విడత గొర్రెల పంపిణీ, పోడు భూముల పంపిణీ, 58, 59 జీవోల అమలు గడువు పొడిగింపు అంశాలపై సీఎం కేసీఆర్ ప్రజాప్రతినిధులకు దిశానిర్దేశం చేయనున్నారు. నిర్దేశిత గడువులో లబ్ధిదారుల ఎంపిక, పంపిణీ వంటి పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాల్సిన అనివార్యతలను విశదీకరించనున్నారు. వీటితోపాటు క్షేత్రస్థాయిలో పార్టీ, ప్రజాప్రతినిధుల సమన్వయం, అనుసరించాల్సిన వ్యూహం, విపక్ష పార్టీలు బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై చేస్తున్న విషప్రచారాన్ని తిప్పికొట్టే బలమైన అస్త్రాలను అధినేత కేసీఆర్ పార్టీ శ్రేణులకు ఇవ్వనున్నారు.



'జెనిసిస్ అండ్ ఎవల్యూషన్ ఆఫ్ బీఆర్ఎస్' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్. చిత్రంలో పుస్తక రచయిత, సీఎం పీఆర్వో వనం జ్వాలానరసింహారావు, సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్

కేసీఆర్ జాతీయ రాజకీయాలపై పుస్తకం



- 'జెనిసిస్ అండ్ ఎవల్యూషన్ ఆఫ్ బీఆర్ఎస్' పుస్తకాన్ని ఆవిష్కరించిన సీఎం కేసీఆర్
- కేసీఆర్ ఐదేండ్ల మేధోమథనానికి దర్పణం ఈ పుస్తకం: సీఎం పీఆర్వో వనం జ్వాలానరసింహారావు

హైదరాబాద్, మార్చి 9 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి కేసీఆర్ జాతీయ రాజకీయాలపై ఐదేండ్లుగా చేసిన మేధోమథనానికి దర్పణంగా రూపొందించిన 'జెనిసిస్ అండ్ ఎవల్యూషన్ ఆఫ్ భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)' పుస్తకాన్ని గురువారం ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్ ఆవిష్కరించారు. సీఎం పీఆర్వో వనం జ్వాలా నరసింహారావు రచించిన ఈ పుస్తకాన్ని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ ప్రచురించారు. ఈ సందర్భంగా రచయితను, ప్రచురణకర్తలను సీఎం కేసీఆర్ అభినందించారు.సీఎం కేసీఆర్ జాతీయ రాజకీయాల ప్రస్తావన, బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం నుంచి 2023 ఫిబ్రవరి 5న నాందేడ్‌లో జరిగిన బీఆర్ఎస్ సభ వరకు 35 వ్యాసాలు ఈ పుస్తకంలో ఉన్నాయి. బీఆర్ఎస్ ఆవిర్భావ, ఆరోహణా క్రమాన్ని మాత్రమే కాకుండా వర్తమాన జాతీయ రాజకీయాల గురించి పరిశోధనా దృక్పథంతో అధ్యయనం చేసే వారికి ఈ పుస్తకం ఉపయోగపడుతుందని రచయిత వనం జ్వాలా నరసింహారావు పేర్కొన్నారు.

సంక్షేమమే లక్ష్యంగా అద్భుత నిర్ణయాలు

- అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

హైదరాబాద్, మార్చి 9 (నమస్తే తెలంగాణ): ప్రజాసంక్షేమమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ నేతృత్వంలోని మంత్రిమండలి అద్భుత నిర్ణయాలు తీసుకున్నదని అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ కొనియాడారు. పేదల సొంతింటి కలను నెరవేర్చడానికి ఒక్కో నియోజకవర్గంలో 3,000 మందికి రూ.3 లక్షల చొప్పున ఇవ్వాలని మంత్రివర్గం నిర్ణయించడంపై హర్షం వ్యక్తం చేశారు. రెండోవిడత దళితబంధును త్వరలో ప్రారంభించాలని నిర్ణయించడంతో దళితుల అభ్యున్నతికి కేసీఆర్ ప్రభుత్వం ఎంతటి చిత్తశుద్ధితో ఉన్నదో స్పష్టమైనదని పేర్కొన్నారు. ప్రభుత్వ స్థలాల్లో ఇల్లు కట్టుకున్న వారికి హక్కులు కల్పించడం, కాశీ, శబరిమలై యాత్రికుల వసతిగృహాలకు నిధులు కేటాయించడం హర్షణీయమని పేర్కొన్నారు.

4 లక్షల మందికి గృహలక్ష్మి

మొదటిపేజీ తరువాయి...

మంత్రి హరీశ్‌రావు వెల్లడించారు. ఈ పథకంపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్నదని, వివిధ రాష్ట్రాల నుంచి అధికారులు, ప్రజా ప్రతినిధులు వచ్చి అధ్యయనం చేసి వెళ్తున్నారని పేర్కొన్నారు. దళితులకు రూ.10 లక్షల చొప్పున ఉచిత గ్రాంటు ఇచ్చే దళితబంధు పథకం 2021 ఆగస్టు 16న ప్రారంభం కాగా, ఏటా ఈ రోజున రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున దళితబంధు వేడుకలు నిర్వహించాలని నిర్ణయించినట్టు చెప్పారు. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాలకుగాను హుజూరాబాద్‌లో ఇప్పటికే 100 శాతం దళితబంధు పథకం అమలు అయిందని, మిగిలిన 118 నియోజకవర్గాల్లో ఒక్కొక్క నియోజకవర్గానికి 1,100 మందికి ఇవ్వాలని నిర్ణయించినట్టు పేర్కొన్నారు. 118 నియోజకవర్గాలకు 1,29,800 మందికి ఇవ్వనున్నట్టు చెప్పారు. మరో 200 మంది లబ్ధిదారుల ఎంపిక బాధ్యతను చీఫ్ సెక్రటరీకి అప్పగిస్తూ నిర్ణయం తీసుకొన్నామని తెలిపారు. చేయాలని నిర్ణయం తీసుకొన్నట్టు వివరించారు. గొర్రెల పంపిణీ కలెక్టర్ల నేతృత్వంలోనే నిర్వహించాలని, పారదర్శకంగా, వేగవంతంగా జరుగాలని నిర్ణయం తీసుకొన్నట్టు చెప్పారు.

4 లక్షల ఎకరాల పోడు భూములకు పట్టాలు

రాష్ట్రంలో 4,00,903 ఎకరాల పోడుభూములకు సంబంధించి 1,55,393 మంది అడవి బిడ్డలకు పట్టాలు పంపిణీ చేయాలని నిర్ణయించినట్టు మంత్రి హరీశ్‌రావు చెప్పారు. ఈ పట్టాల పంపిణీ ఇకముందు కూడా కొనసాగుతుందని తెలిపారు. ప్రస్తుతం లబ్ధిదారుల గుర్తింపు, తీర్మానాలు పూర్తై పట్టాలు సిద్ధంగా ఉన్నవాటికి వెంటనే పంపిణీ చేపట్టాలని నిర్ణయించామని తెలిపారు.

ఏప్రిల్ 14న అంబేద్కర్ విగ్రహావిష్కరణ

హైదరాబాద్‌లో చేపట్టిన దేశంలోనే అతిపెద్ద 125 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం నిర్మాణం దాదాపు పూర్తయిందని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. ఏప్రిల్ 14న అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని నిర్ణయించినట్టు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దళిత బిడ్డలను హైదరాబాద్‌కు పిలిపించుకొని లక్షలాదిమంది మధ్య గొప్ప పండుగగా ఈ కార్యక్రమాన్ని జరుపాలని క్యాబినెట్ నిర్ణయం తీసుకొన్నదని వెల్లడించారు. అన్ని గ్రామాలు, పట్టణాల నుంచి దళితవర్గాలు హైదరాబాద్ వచ్చేలా ఏర్పాట్లు చేయాలని, అదేరోజు హైదరాబాద్‌లో పెద్ద సభను కూడా ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు చెప్పారు.

జీవో 58, 59 దరఖాస్తులకు మరో అవకాశం

భూముల క్రమబద్ధీకరణకు సంబంధించిన జీవో-58,59 కటాఫ్ డేట్‌ను పొడిగించాలని విజ్ఞప్తులు వచ్చాయని, దీంతో చివరిసారి అవకాశం ఇవ్వాలని నిర్ణయించామని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. జీవో-58 కింద ఒక్క రూపాయి కూడా ఖర్చులేకుండా భూములపై హక్కులు కల్పిస్తున్నామని తెలిపారు. గతంలో కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలు పేదలపై జులుం ప్రదర్శిస్తే, బీఆర్ఎస్ ప్రభుత్వం మాత్రం వారిని అక్కున చేర్చుకొంటూ ఉచితంగా పట్టాలు ఇస్తున్నదని చెప్పారు. జీవో-58 కింద ఇప్పటివరకూ 1,45,668 మందికి పట్టాలు ఇచ్చినట్టు తెలిపారు. జీవో-59 కింద ఇప్పటివరకూ 42 వేల మంది లబ్ధి పొందారని చెప్పారు. కటాఫ్ గడువును 2014 నుంచి 2020కి పొడిగించాలని నిర్ణయించిన నేపథ్యంలో దరఖాస్తులకు మరో నెలరోజులు గడువు ఇవ్వాలని నిర్ణయించామని తెలిపారు.

కాశీ, శబరిమలలో వసతిగృహాలు

హిందువులు కాశీ, శబరిమల యాత్రకు భారీగా వెళ్తున్న నేపథ్యంలో ఈ రెండు ప్రాంతాల్లో వసతిగృహాలు నిర్మించాలని నిర్ణయించినట్టు మంత్రి హరీశ్‌రావు వెల్లడించారు. ఒక్కొక్క పుణ్యక్షేత్రానికి రూ.25 కోట్ల చొప్పున మొత్తం రూ.50 కోట్లు మంజూరు చేస్తూ నిర్ణయం తీసుకొన్నట్టు తెలిపారు. మంత్రుల బృందం, చీఫ్ సెక్రటరీని వీలైనంత తొందరగా కాశీకి పంపి అక్కడి అధికారులతో మాట్లాడి, వసతిగృహం నిర్మాణానికి చర్యలు తీసుకొనేలా ఆదేశాలు జారీచేయాలని నిర్ణయించినట్టు చెప్పారు. ప్రైవేటు స్థలం అయినా కొనుగోలు చేసి వసతి సముదాయాన్ని నిర్మించాలని నిర్ణయించామని తెలిపారు. సీఎంవో ఓఎస్డీ ప్రియాంక వర్గీస్ శబరిమలకు వెళ్లి స్థల ఏర్పాట్లు చూడాలని, అన్నీ కుదిరితే వెంటనే పనులు ప్రారంభించాలని ప్రభుత్వం ఆదేశించినట్టు చెప్పారు. గతంలో కేరళ ముఖ్యమంత్రితో సీఎం కేసీఆర్ మాట్లాడితే.. అక్కడ స్థలం ఇచ్చేందుకు సుముఖత వ్యక్తం చేశారని తెలిపారు. దీంతో శబరిమలలో భవన నిర్మాణానికి టెండర్ల ప్రక్రియను మొదలుపెట్టాలని క్యాబినెట్ నిర్ణయం తీసుకొన్నట్టు పేర్కొన్నారు.

నెల వ్యవధిలో మూడు ప్రారంభోత్సవాలు

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నూతన సెక్రటేరియట్ ప్రారంభోత్సవానికి కొంత సమయం ఉందని, పనులు జరుగుతున్నాయని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. త్వరలోనే సెక్రటేరియట్ ప్రారంభోత్సవ తేదీని ప్రకటిస్తామని వెల్లడించారు. అమరవీరుల స్థూపం పనులు దాదాపు పూర్తికావొచ్చాయని, మంత్రి ప్రశాంత్‌రెడ్డి దగ్గరుండి పనులు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ఇక డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి రోజున ఆయన విగ్రహావిష్కరణను పండుగలా నిర్వహిస్తామని తెలిపారు. ఈ మూడు ప్రారంభోత్సవాలు నెల వ్యవధిలో ఉంటాయని వెల్లడించారు. వీటి ప్రారంభోత్సవ తేదీలు త్వరలోనే ప్రకటిస్తామని చెప్పారు. అన్ని కార్యక్రమాలు జూన్ 2లోగా ముగిస్తామని వెల్లడించారు.

ఏప్రిల్ నెలాఖరు నుంచి వడ్ల కొనుగోలు

ఈ ఏడాది రాష్ట్రంలో పండిన ప్రతి గింజనూ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని మంత్రి హరీశ్‌రావు రైతులకు భరోసా ఇచ్చారు. ఏప్రిల్ నెలాఖరు నుంచి వడ్ల కొనుగోలు ప్రారంభం అవుతుందని చెప్పారు. గవర్నర్ కోటా ఎమ్మెల్సీలకు సంబంధించి మే నెల వరకు సమయం ఉందని, దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని వెల్లడించారు. 'గృహలక్ష్మి పథకం' ప్రారంభమైన నేపథ్యంలో డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణాలను నిలిపివేస్తామనే ఆలోచనే వద్దని, ఇదొక నిరంతర ప్రక్రియ అని స్పష్టంచేశారు. ఇండ్లులేని పేదల కోసం ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇండ్లను కట్టిస్తుందని వెల్లడించారు.



గురువారం ప్రగతిభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, గంగుల కమలాకర్, శ్రీనివాస్‌గౌడ్, చామకూర మల్లారెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, పౌర సరఫరాల సంస్థ చైర్మన్ రవీందర్‌సింగ్

మొత్తంగా లక్షా 30వేల మందికి లబ్ధి చేకూరుతుందని వెల్లడించారు. గతంలో మాదిరిగానే జిల్లా కలెక్టర్ల ద్వారా లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని, ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించినట్టు చెప్పారు.

'గృహలక్ష్మి' పేరుతో కొత్త పథకం

పేదల గృహ నిర్మాణ కార్యక్రమంలో భాగంగా సొంత ఇంటి జాగా ఉన్నవారు ఇండ్లు నిర్మించుకొనేందుకు 'గృహలక్ష్మి' పేరుతో కొత్త పథకాన్ని ప్రవేశపెట్టినట్టు మంత్రి హరీశ్‌రావు తెలిపారు. ఇండ్లు లేనివారితోపాటు గతంలో ఇల్లు ఉండి అవి కూలిపోయినవారికి ఈ పథకం వర్తిస్తుందని పేర్కొన్నారు. ఇందులో భాగంగా 4 లక్షల మందికి ఇండ్లు మంజూరు చేయాలని నిర్ణయం తీసుకొన్నట్టు చెప్పారు. ఒక్కో నియోజకవర్గానికి 3 వేల చొప్పున, 119 నియోజకవర్గాల్లో ఇండ్లు నిర్మించాలని నిర్ణయించినట్టు చెప్పారు. వీటితోపాటు 43 వేల ఇండ్లను స్టేట్ కోటాలో మంజూరు చేయాలని నిర్ణయించామని పేర్కొన్నారు. లబ్ధిదారుల ఎంపిక, నిర్మాణ ప్రక్రియ వెంటనే చేపట్టాలని నిర్ణయించామని తెలిపారు. ఒక్కో ఇంటికి రూ.మూడు లక్షలను మూడు దఫాలుగా లక్ష చొప్పున లబ్ధిదారుడి ఖాతాలో జమచేయాలని నిర్ణయించినట్టు చెప్పారు. లబ్ధిదారుడు తనకు నచ్చిన విధంగా ఇల్లు కట్టుకొనేలా వెసులుబాటు కల్పిస్తున్నట్టు వివరించారు. దీనికోసం బడ్జెట్‌లో ఇప్పటికే రూ.12 వేల కోట్లు కేటాయించామని గుర్తుచేశారు. ఇండ్లను మహిళ పేరుపైనే మంజూరు చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. గత ప్రభుత్వాలు గృహ నిర్మాణ సంస్థ ద్వారా పేదలకు ఇండ్లు నిర్మించుకొనేందుకు ఇచ్చిన రూ. 4 వేల కోట్ల అప్పులను మాఫీ చేస్తూ నిర్ణయం తీసుకొన్నామని చెప్పారు. ఇలా మొత్తం 30 లక్షల ఇండ్లపై రూ.4 వేల కోట్ల అప్పు ఉన్నదని, వాటిని పూర్తిగా మాఫీ చేస్తున్నట్టు ప్రకటించారు. దీనివల్ల 30 లక్షల మంది పేదలు రుణవిముక్తులు అవుతారని వెల్లడించారు.

వచ్చే నెల నుంచి రెండో దశ గొర్రెల పంపిణీ

గొర్రెల పంపిణీ పథకంలో భాగంగా 7.31 లక్షల మంది లబ్ధిదారులను గుర్తించగా, అందులో మొదటిదశలో 50 శాతం పంపిణీ పూర్తయిందని మంత్రి హరీశ్‌రావు వెల్లడించారు. మిగిలిన 50 శాతం మందికి వెంటనే పంపిణీ చేయాలని నిర్ణయించినట్టు చెప్పారు. దీనికోసం రూ.4,463 కోట్ల నిధులు మంజూరు చేస్తూ క్యాబినెట్ నిర్ణయం తీసుకొన్నదని చెప్పారు. రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమం ఏప్రిల్‌లో ప్రారంభించి, ఆగస్టు నెలాఖరుకల్లా పూర్తి

క్యాబినెట్ సమావేశం ముఖ్యాంశాలు

- *రెండో విడత దళితబంధు పథకం కింద 1,29,800 కుటుంబాలకు చేయూత. ఒక్కో నియోజకవర్గానికి 1,100 కుటుంబాలకు పంపిణీ*
- *పేదల గృహనిర్మాణానికి 'గృహలక్ష్మి' పేరుతో కొత్త పథకం. ఒక్కో ఇంటికి రూ. మూడు లక్షల గ్రాంటు. నాలుగు లక్షల మందికి పంపిణీ. బడ్జెట్‌లో రూ. 12 వేల కోట్లు కేటాయింపు*
- *గత గృహనిర్మాణ పథకాల అప్పులు రూ.4 వేల కోట్లు మాఫీ. 30 లక్షల కుటుంబాలకు లబ్ధి*
- *రెండో విడత గొర్రెల పంపిణీకి రూ. 4,463కోట్లు.*
- *1,55,393 మందికి నాలుగు లక్షల ఎకరాల పోడు భూముల పంపిణీ*
- *ఏప్రిల్ 14న ఘనంగా అంబేద్కర్ విగ్రహావిష్కరణ, అదేరోజు హైదరాబాద్‌లో భారీ సభ*
- *జీవో- 58,59 కటాఫ్ గడువు 2020కి పొడిగింపు, దరఖాస్తులకు నెలరోజులు అవకాశం*
- *కాశీ, శబరిమలలో తెలంగాణ భక్తులకు వసతిగృహాల నిర్మాణానికి రూ.50 కోట్లు.*



గురువారం పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డికి మద్దతు లేఖను అందజేస్తున్న సీపీఎస్ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ

చెన్నకేశవరెడ్డిని గెలిపించండి : టీఎస్ సీపీఎస్ఈయూ

హైదరాబాద్, మార్చి 9 (నమస్తే తెలంగాణ): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలో పీఆర్టీయూ టీఎస్ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డిని గెలిపించాలని టీఎస్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ యూనియన్ (సీపీఎస్ఈయూ) పిలుపునిచ్చింది. గురువారం పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి హైదరాబాద్‌లోని సీపీఎస్ఈయూ కార్యాలయంలో సంఘం నేతలతో భేటీ అయి మద్దతు కోరారు. దీంతో సీపీఎస్ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ మద్దతు లేఖను శ్రీపాల్‌రెడ్డికి అందజేశారు. పాత పెన్షన్ వ్యతిరేకశక్తులను అంతంచేయాలన్న తలంపుతోనే గుర్రం చెన్నకేశవరెడ్డికి తాము మద్దతు తెలియజేస్తున్నట్టు స్థితప్రజ్ఞ పేర్కొన్నారు. మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల పరిధిలో 8వేల సీపీఎస్ టీచర్లున్నారని, వీరి మద్దతుతో గుర్రం చెన్నకేశవరెడ్డి గెలుస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎస్ఈయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్, కోశాధికారి నరేశ్ గౌడ్ తదితరులు ఉన్నారు.

భద్రాద్రి ఫారెస్ట్ రోడ్డు విస్తరణకు అనుమతి

హైదరాబాద్, మార్చి 9 (నమస్తే తెలంగాణ): భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా భద్రాద్రి ఫారెస్ట్ డివిజన్ పరిధిలో పంచాయతీరాజ్ రోడ్డు విస్తరణ పనులకు అటవీశాఖ అనుమతి మంజూరు చేసింది. జిల్లా పంచాయతీరాజ్ అధికారుల ప్రతిపాదనల మేరకు తెలంగాణ స్టేట్ ఫారెస్ట్ యాక్ట్-1980 ప్రకారం ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. రిజర్వ్ ఫారెస్ట్ ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి కొమ్మనపల్లి వరకు 1.640 హెక్టార్లు, కందూరు నుంచి బోడుగూడెం, పెద్దమామిడి, సీలేరు వరకు 1.971 హెక్టార్లు, చెల్మల నుంచి ఉయ్యాలమడుగు వరకు 2.233 హెక్టార్ల అటవీ భూమి పరిధిలో రోడ్డు విస్తరణ పనులు చేపట్టనున్నారు.

ప్రభుత్వ నిర్ణయంపై ఆర్ కృష్ణయ్య హర్షం

హైదరాబాద్, మార్చి 9 (నమస్తే తెలంగాణ): బీసీ సంక్షేమ గురుకుల, హాస్టళ్ల విద్యార్థుల డైట్ చార్జీలను 25 శాతం పెంచాలని రాష్ట్ర మంత్రివర్గ ఉపసంఘం ప్రతిపాదించడంపై జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య హర్షం వ్యక్తం చేశారు. బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్‌ను ఆయన నివాసంలో గురువారం ప్రత్యేకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపి, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఆయనతోపాటు పలువురు సంఘం నేతలు పాల్గొన్నారు.

విద్యుత్తు ఉద్యోగుల పీఆర్సీపై నేడు చర్చలు

హైదరాబాద్, మార్చి 9 (నమస్తే తెలంగాణ) : విద్యుత్తు ఉద్యోగుల పీఆర్సీపై రెండో దఫా చర్చలు శుక్రవారం జరుగనున్నాయి. హైదరాబాద్ ఖైరతాబాద్‌లోని విద్యుత్తుసౌధలో నిర్వహించే ఈ చర్చల్లో విద్యుత్తుశాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొంటారు. సమావేశానికి తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ జేఏసీ, తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ నేతలు కూడా హాజరుకానున్నారు.

డబుల్ ఇంజిన్.. ప్రధాని, అదానీ

- ఈడీ విచారణకు వస్తా.. సహకరిస్తా
- ఎన్నికలున్న చోట మోదీకి ముందే ఈడీ
- దర్యాప్తు సంస్థల దాడులు ఎన్నికల స్టంట్
- ఏజెన్సీ డైరెక్టర్లకు ఎక్స్‌టెన్షన్ ఎందుకు?
- అగ్నివీరులను పర్మనెంట్ చేయండి
- బీజేపీని గద్దె దించడమే మా లక్ష్యం
- ఎప్పటికైనా బీఆర్ఎస్సే ప్రత్యామ్నాయం
- పవర్‌ఫుల్ పొలిటికల్ పార్టీగా బీఆర్ఎస్
- బీజేపీ డైవర్షన్ పాలిటిక్స్ ఇక చెల్లవు
- మహిళలను ఈడీ అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌లో విచారించాలి
- ఢిల్లీలో మీడియాతో ఎమ్మెల్సీ కవిత



ఢిల్లీలోని జంతర్‌మంతర్‌లో గురువారం నిరసన దీక్షా స్థలిని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

హైదరాబాద్, మార్చి 9 (నమస్తే తెలంగాణ): ఎప్పటికైనా ధర్మమే గెలుస్తుందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. ఈ నెల 11న తాను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణకు హాజరవుతానని, సంపూర్ణంగా సహకరిస్తానని చెప్పారు. గురువారం ఆమె ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. ఎన్నికలు ఉన్న రాష్ట్రాల్లో మోదీకి ముందు ఈడీ రావటం సహజమేనని తెలిపారు. తెలంగాణలో ఎన్నికలున్నాయి కాబట్టే దర్యాప్తు సంస్థలు వరుస కడుతున్నాయని, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను లక్ష్యంగా చేసుకున్నాయని ఆమె విమర్శించారు.

విచారణకు హాజరవుతా.. బీఎల్ సంతోష్ కూడా రావాలి

బాధ్యత కలిగిన పౌరురాలిగా తాను ఈడీ విచారణకు హాజరవుతానని ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. ఎలాంటి ప్రశ్నలు అడిగినా సమాధానాలు ఇస్తానని చెప్పారు. 'మేం ఏ తప్పూ చేయలేదు. కాబట్టే విచారణకు వస్తున్నాం' అని స్పష్టం చేశారు. ఇదే సమయంలో బీజేపీ నేత బీఎల్ సంతోష్ కూడా సిట్ ముందు హాజరు కావాలని డిమాండ్ చేశారు. 'తెలంగాణకు వచ్చి సిట్ ముందు హాజరై ప్రశ్నలకు జవాబులు చెప్పమని బీఎల్ సంతోష్‌కు సూచించండి. ఆయన ఎందుకు భయపడుతున్నారు? కోర్టులో కేసుల మీద కేసులు వేసి ఎందుకు స్టేలు తెచ్చుకుంటున్నారు?' అని ప్రశ్నించారు. ప్రజలు వీటన్నింటి గురించి ఆలోచించాలని కోరారు. 'వన్ నేషన్ - వన్ ఫ్రెండ్' ప్రభుత్వానికి మరోసారి అవకాశం ఇవ్వొద్దని, ప్రజల గురించి ఆలోచించే విపక్షాలకు అవకాశం ఇవ్వాలని కోరారు. 'ఇప్పుడు మహిళా బిల్లుపై ధర్నా చేస్తున్నందుకు నాకు ఈడీ నోటీసులు అందాయి. రేపు గ్యాస్ ధర పెంపు పోరాటం చేస్తే.. ఇంకొకరిని ఈడీ పిలుస్తుంది. అదానీ విషయం తెరమీదికి వస్తే.. మరొకరికి నోటీసులు వస్తాయి' అని కవిత మండిపడ్డారు. ఈడీ నోటీసులు ఇచ్చినా తాను ధర్నా విరమించదలచుకోలేదని ఆమె స్పష్టం చేశారు. బీజేపీ డైవర్షన్ పాలిటిక్స్ నడవవని చెప్పడానికే ఈ నిర్ణయం తీసుకున్నానని చెప్పారు.

ధర్నా కొనసాగుతుంది

మహిళా బిల్లు కోసం ధర్నాకు సంబంధించి ఈ నెల 2న హైదరాబాద్‌లో పోస్టర్ రిలీజ్ చేశామని కవిత చెప్పారు. భారత జాగృతి తరఫున 29 రాష్ట్రాల్లోని అన్ని సంస్థలకు ఆహ్వానం పంపించామని వెల్లడించారు. దాదాపు 6 వేల మందికిపైగా దీక్షకు హాజరవుతామని చెప్పినట్టు తెలిపారు. 18 పార్టీలు తమ ప్రతినిధులను పంపుతామని చెప్పాయని పేర్కొన్నారు. తనతోపాటు 500-600 మంది దీక్షలో కూర్చుంటారని చెప్పారు. సీతారాం ఏచూరి చేతుల మీదుగా దీక్ష ప్రారంభం అవుతుందని ప్రకటించారు. ఇది కేవలం ప్రారంభం మాత్రమేనని చెప్పారు. 'ఈ సెషన్ నుంచి వచ్చే సెషన్ వరకు దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో కార్యక్రమాలు, రౌండ్ టేబుల్ సమావేశాలు కొనసాగుతాయి' అని ప్రకటించారు.

తెలంగాణపై వరుసగా దాడులు

కేంద్ర ప్రభుత్వం గతేడాది జూన్ నుంచి వరుసగా దర్యాప్తు సంస్థలను తెలంగాణపై ఉసిగొల్పుతున్నదని ఎమ్మెల్సీ కవిత మండిపడ్డారు. 500 వ్యాపార కేంద్రాలపై ఐటీ, 100 ప్రాంతాల్లో సీబీఐ, 200 ప్రాంతాల్లో ఈడీ దాడులు అయ్యాయని చెప్పారు. ఎన్ఐఏ ఏకంగా 500-600 మందిని పిలిపించి బెదిరించి పంపిందన్నారు. బీఆర్ఎస్‌కు చెందిన 15-16 మంది ప్రజాప్రతినిధులను లక్ష్యంగా చేసుకున్నట్టు చెప్పారు. 'మోదీజీ మీరు ప్రజల దగ్గరికి వెళ్లండి. దేశాన్ని ఎలా అభివృద్ధి చేశారో, తెలంగాణకు ఏం ఇచ్చారో చెప్పండి. ప్రజల మనసులు గెలవండి. ఆ తర్వాత ఎన్నికల్లో గెలవండి. అంతేగానీ.. ఎన్నికల్లో గెలిచినా, ఓడినా ఈడీలను ప్రయోగిస్తాం, ప్రజాస్వామ్య ప్రభుత్వాలను కూలదోస్తాం, అడ్డదారిలో అధికారంలోకి వస్తాం అంటే కుదరదు' అని స్పష్టం చేశారు. ఇప్పటికే 9 రాష్ట్రాల్లో అడ్డదారిన ప్రభుత్వాలను ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. 'తెలంగాణలోనూ ఇదే తరహాలో ప్రభుత్వాన్ని కూలగొట్టాలని ప్రయత్నించారు. కానీ వారి పప్పులు ఉడకలేదు. అందుకే దర్యాప్తు సంస్థలను ప్రయోగించి భయపెట్టయినా తెలంగాణను హస్తగతం చేసుకోవాలని చూస్తున్నారు' అని మండిపడ్డారు. కానీ తాము భయపడే వాళ్లం కాదని స్పష్టం చేశారు. ఉద్యమం చేసి రాష్ట్రం సాధించి, ప్రజల ఆశీర్వాదంతో ప్రభుత్వాన్ని నడుపుతున్నవాళ్లమని గుర్తు చేశారు. మోదీ, బీజేపీ వైఫల్యాలను ఎత్తి చూపుతూనే ఉంటామన్నారు.

అగ్నివీరులకు ఎక్స్‌టెన్షన్ ఇవ్వండి

కేంద్ర ప్రభుత్వం ఈడీ, సెబీ, ఎస్బీఐ, ఎల్ఐసీ డైరెక్టర్ల పదవీ కాలాన్ని పదే పదే పొడిగిస్తున్నదని కవిత గుర్తు చేశారు. 'వాళ్లు ఎక్కడ డబ్బు పెట్టమంటే అక్కడ పెడతారు. ఎక్కడికి వెళ్లమంటే అక్కడికి ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీలు వెళ్లి పని పూర్తి చేసుకొస్తాయి. అందుకే వాళ్లకు ఎక్స్‌టెన్షన్ ఇస్తారు' అని ఎద్దేవా చేశారు. అగ్నివీర్ పేరుతో యువతను సైన్యంలోకి తీసుకుంటున్నారని, శిక్షణ ఇచ్చి నాలుగేండ్ల తర్వాత రోడ్డుమీద పడేస్తున్నారని మండిపడ్డారు. దేశం కోసం ప్రాణాలు అర్పించేందుకు ముందుకొచ్చినవారికి ఇచ్చే విలువ ఇదేనా? అని ప్రశ్నించారు. ఇప్పటికైనా అగ్నివీరులను పర్మనెంట్ చేయాలని మోదీని డిమాండ్ చేశారు. ఆర్మీలో ప్రస్తుతం 3.5 లక్షల ఖాళీలు ఉన్నాయన్నారు. గాంధీజీ తిరిగిన ఈ దేశంలో ఇప్పుడు అబద్ధం రాజ్యమేలుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. జీడీపీ గురించి, అభివృద్ధి గురించి పచ్చి అబద్ధాలు ఆడుతున్నారని, ప్రధాని స్వయంగా పార్లమెంట్‌లోనే అబద్ధాలు చెప్తున్నారని వెల్లడించారు.

యథో ధర్మః తథో జయః

'ధర్మమే గెలుస్తుంది'. 'జైల్లో పెట్టినంత మాత్రాన కృష్ణుడికి నష్టం కలగలేదు. అజ్ఞాతవాసంలో ఉన్నంత మాత్రాన అర్జునుడి పరాక్రమం తగ్గలేదు. వనవాసం నుంచి తిరిగి వచ్చాక శ్రీరాముడు మరింత పరిపూర్ణత సాధించి ప్రజా సంక్షేమం కోసం పనిచేశారు'. అంతా మా చేతుల్లోనే ఉన్నది, మేం ఎవరినైనా ఏమైనా చేయగలం, మేం దేవుడి కన్నా బలవంతులమని విర్రవీగినప్పుడల్లా.. ప్రకృతి స్పందించి న్యాయం చేస్తుంది. రాబోయే రోజుల్లో అలాంటి న్యాయమే వస్తుంది. దేశంలో అరాచక పాలన చేస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని కూలదోస్తుంది.

మమ్మల్ని టార్చర్ పెడితే ఏమొస్తుంది?

'దేశంలో డబుల్ ఇంజిన్ సర్కార్ నడుస్తున్నదని చెప్పుకుంటున్నారు. అందులో ఒక ఇంజిన్ ప్రధాని అయితే.. మరో ఇంజిన్ అదానీ. ఈ విషయాన్ని దేశంలో చిన్న పిల్లగాడిని అడిగినా చెప్తారు' అని కవిత విమర్శించారు. 'మాలాంటి వారిని టార్చర్ పెడితే ఏమొస్తుంది?. దీనికి బదులు ధరల తగ్గుదలపై దృష్టిపెట్టండి. మరిన్ని రాయితీలు కల్పించటంపై, మరిన్ని ఉద్యోగాలు కల్పించటంపై దృష్టిపెట్టండి' అని హితవు పలికారు.

మేం బీ టీం కాదు.. ఏ టీమే

బీజేపీకి బీఆర్ఎస్ బీ టీమ్ అనే ఆరోపణలు అసంబద్ధమని కవిత పేర్కొన్నారు. 'మేము బీ టీమ్ అయితే ఇక్కడి వరకు ఎందుకు వస్తాం?. బీజేపీ వాళ్లయితే ఎంత అవినీతి చేసినా ఏమీ కాదని ఆ పార్టీ నేతలే చెప్తున్నారు' అని గుర్తు చేశారు. బీజేపీకి ఆల్టర్నేటివ్ బీఆర్ఎస్ మాత్రమే అని స్పష్టం చేశారు. బీజేపీని గద్దె దించడమే తమ లక్ష్యమని చెప్పారు. ఇందుకు కలిసి వచ్చే పార్టీలతో కలిసి పనిచేస్తామని వెల్లడించారు. కాంగ్రెస్ విఫలమైంది కాబట్టే ప్రతిపక్షాలను ఏకం చేసే బాధ్యతను బీఆర్ఎస్ తీసుకున్నదని చెప్పారు. ఇప్పటికే ఖమ్మంలో భారీ బహిరంగ సభ నిర్వహించామని, ఏప్రిల్‌లో మరో బహిరంగ సభ నిర్వహిస్తామని తెలిపారు.



గురువారం ఢిల్లీలో సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరితో సమావేశమైన ఎమ్మెల్సీ కవిత

మహిళలను వీడియోకాన్ఫరెన్స్ ద్వారా విచారించాలి

దర్యాప్తు సంస్థలు మహిళలను విచారించాలంటే వారి ఇంటికి వెళ్లి విచారించాల్సి ఉంటుందని కవిత పేర్కొన్నారు. చట్టంలో ఇందుకు అవకాశం ఉన్నదని, అనేక కోర్టు తీర్పులు అనుకూలంగా ఉన్నాయని చెప్పారు. తనను 9వ తేదీన విచారణకు హాజరు కావాల్సిందిగా ఈడీ సూచించిందని, అయితే 10న ఢిల్లీలో ధర్నా ఉన్నది కాబట్టి.. 11న ఈడీ అధికారులు తన ఇంటికి వచ్చి విచారణ జరపాలని కోరినట్టు తెలిపారు. అవసరమైతే మిగతా నిందితులను తీసుకొచ్చి, వారి సమక్షంలోనే విచారణ జరపాలని సూచించినట్టు చెప్పారు. అయితే అధికారులు తన అభ్యర్థనను తిరస్కరించారని చెప్పారు. వీడియోకాన్ఫరెన్స్ ద్వారా విచారణ ఎందుకు సాధ్యం కాదని నిలదీశారు.

లోకం పోకడ



మీ క్యాబినెట్‌లో వీళ్లకు ప్రత్యేకశాఖ కేటాయిస్తే బాగుంటుందని ఇలా రాశాను సార్!

13న కేఆర్ఎంబీ త్రిసభ్య కమిటీ సమావేశం

హైదరాబాద్, మార్చి 9 (నమస్తే తెలంగాణ): ఈ నెల 13న కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ) త్రిసభ్య కమిటీ సమావేశాన్ని నిర్వహించాలని బోర్డు నిర్ణయించింది. ఈ మేరకు తెలంగాణ, ఏపీ రాష్ట్రాలకు గురువారం లేఖలు రాసింది. ఉమ్మడి ప్రాజెక్టుల నుంచి నీటి విడుదల అంశంపై ఈ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోవాల్సి ఉన్నది. తాగునీటి అవసరాలకు 15 రోజుల పాటు రోజుకు 1,500 క్యూసెక్కుల చొప్పున సాగర్ ఎడమ కాలువ ద్వారా నీటిని విడుదల చేయాలని ఇటీవల ప్రతిపాదించింది. ఏపీ తన కేటాయింపులకు మించి జలాలను ఇప్పటికే వినియోగించుకున్నదని, పెద్ద మొత్తంలో విద్యుత్తును ఉత్పత్తి చేస్తూ కుడి కాలువకు ఇప్పటికీ నీటిని విడుదల చేస్తున్నదని, వెంటనే ఏపీని నిలువరించాలని కేఆర్ఎంబీకి తెలంగాణ ఫిర్యాదు చేసింది. 13న జరిగే సమావేశంలో ఈ రెండు అంశాలపై చర్చించనున్నారు.

ఎండాకాలం



	గరిష్ఠం	కనిష్ఠం
రంగారెడ్డి	37.5°c	14.7°c
మహబూబ్‌నగర్	36.0°c	21.1°c
కరీంనగర్	36.0°c	21.0°c
ఖమ్మం	36.0°c	21.0°c
మెదక్	34.9°c	15.6°c
ఆదిలాబాద్	34.8°c	14.5°c
వరంగల్	34.0°c	19.0°c
నిజామాబాద్	33.9°c	19.4°c
నల్లగొండ	33.0°c	18.6°c
హైదరాబాద్	27.0°c	18.0°c


సీబీఐ దర్యాప్తుపై స్టే విధించాలి

- అరెస్టు నుంచి రక్షణ కల్పించాలి
- వివేకానందరెడ్డి హత్య కేసులో ఎంపీ అవినాశ్ రెడ్డి పిటిషన్

హైదరాబాద్, మార్చి 9 (నమస్తే తెలంగాణ): ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సీబీఐ దర్యాప్తును నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి తెలంగాణ హైకోర్టును కోరారు. ఈ మేరకు గురువారం అత్యవసర లంచ్ మోషన్ పిటిషన్‌ను దాఖలు చేశారు. ఈ కేసులో సీబీఐ శుక్రవారం తనను విచారిస్తే సీఆర్పీసీ సెక్షన్ 161 ప్రకారం ఆ ప్రక్రియను ఆడియో, వీడియో రికార్డింగ్ చేసేలా ఆదేశించాలని, అరెస్టు నుంచి తనకు రక్షణ కల్పిస్తూ ఉత్తర్వులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌పై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కే లక్ష్మణ్ శుక్రవారం విచారణ జరుపనున్నారు.

నేడు ఢిల్లీలో ఎమ్మెల్సీ కవిత నిరసన దీక్ష

- చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు కోసం డిమాండ్
- హాజరుకానున్న 18 పార్టీల ప్రతినిధులు
- ఆరు వేల మంది పాల్గొనేలా ఏర్పాట్లు
- ఢిల్లీకి వెళ్లిన మంత్రులు సత్యవతి, సబిత



ఢిల్లీలోని జంతర్‌మంతర్‌లో నిరసన దీక్ష కోసం గురువారం రాత్రి జరుగుతున్న ఏర్పాట్లు

హైదరాబాద్, మార్చి 9 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద శుక్రవారం నిరసన దీక్ష చేపట్టనున్నారు. చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ బిల్లును కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి, ఆమోదింపజేయాలనే డిమాండ్‌తో భారత జాగృతి తరఫున ఆమె ఒక్క రోజు దీక్ష తలపెట్టిన సంగతి తెలిసిందే. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. బుధవారం ఢిల్లీకి చేరుకున్న కవిత.. గురువారం సభాస్థలిని పరిశీలించారు. ఏర్పాట్లను పర్యవేక్షించారు. దీక్ష ఉదయం పదింటికి మొదలై సాయంత్రం 4 గంటల వరకు కొనసాగుతుంది. ఎమ్మెల్సీ కవితతో పాటు దాదాపు 500 మంది దీక్షకు కూర్చునే అవకాశం ఉన్నది. మొత్తంగా అన్ని రాష్ట్రాల నుంచి సుమారు ఆరు వేల మంది వరకు హాజరవుతారన్న అంచనా మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు. 18 రాజకీయ పార్టీల నుంచి ప్రతినిధులు వస్తున్నట్టు వెల్లడించారు. దీక్షను సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రారంభించనున్నారు. ఈ మేరకు కవిత గురువారం ఏచూరిని కలిశారు. దీక్షకు హాజరుకావాల్సిందిగా మరోసారి ఆహ్వానించారు. బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు దీక్షలో పాల్గొనేందుకు రాష్ట్రం నుంచి మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్, ఎంపీ మాలోత్ కవిత, నామా నాగేశ్వర్‌రావు, కే కేశవరావు, వెంకటేశ్ నేత, వద్దిరాజు రవిచంద్ర, సంతోష్‌కుమార్, ఎమ్మెల్యేలు పద్మాదేవేందర్‌రెడ్డి, రేఖా నాయక్ తదితరులు ఢిల్లీకి వెళ్లారు.

సభాస్థలిపై హైడ్రామా..

ఎమ్మెల్సీ కవిత దీక్షను అడ్డుకునేందుకు బీజేపీ చివరి నిమిషం వరకు ప్రయత్నించింది. జంతర్‌మంతర్‌లో శుక్రవారం సభ నిర్వహించేందుకు భారత జాగృతి గతంలోనే దరఖాస్తు చేసుకోగా, పోలీసులు అనుమతులు మంజూరు చేశారు. అయితే బుధవారం మధ్యాహ్నం ఆ స్థలంలో అదే సమయంలో బీజేపీ దీక్ష ఉన్నదంటూ కొత్త డ్రామా మొదలుపెట్టారు. దీక్షను వేరే మైదానానికి వాయిదా వేసుకోవాలని ఒకసారి, జంతర్‌మంతర్‌లోనే సగం స్థలంలో సర్దుకోవాలని, మిగతా స్థలాన్ని బీజేపీకి ఇవ్వాలని మరోసారి సూచించారు. దీంతో భారత జాగృతి సభ్యులు పోలీసు అధికారులతో సంప్రదింపులు జరిపారు. చివరికి ఢిల్లీ పోలీసులు దీక్షకు అనుమతి ఇచ్చారు.

నిపుణ

విద్య, ఉద్యోగ సమాచారం

యూపీఎస్సీలో...

ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న కింది పోస్టుల భర్తీకి యూపీఎస్సీ ప్రకటన విడుదల చేసింది.

- మొత్తం ఖాళీలు: 45
- పోస్టులు: జూనియర్ డైరెక్టర్, మార్కెటింగ్ ఆఫీసర్, గ్రేడ్-3 స్పెషలిస్ట్, ఎకనమిక్ ఆఫీసర్
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: మార్చి 30
- వెబ్‌సైట్: http://www.upsconline.nic.in

మహబూబాబాద్ కేవీలో...

మహబూబాబాద్ కేంద్రీయ విద్యాలయంలో కాంట్రాక్టు ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- పోస్టులు: టీజీటీ (ఇంగ్లిష్, హిందీ, మ్యాథ్స్, సైన్స్ తదితరాలు), పీఆర్‌టీ, స్పోర్ట్స్ కోచ్
- ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా
- ఇంటర్వ్యూ తేదీలు: టీజీటీ అభ్యర్థులకు మార్చి 24, ఇతర పోస్టులకు మార్చి 25
- వెబ్‌సైట్: https://mahabubabad.kvs.ac.in

టెక్నికల్ స్టాఫ్

ప్రభుత్వ సంస్థ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా (ఎస్‌టీపీఐ)లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- పోస్టులు: మెంబర్ టెక్నికల్ స్టాఫ్ (సైంటిస్ట్)
- మొత్తం ఖాళీలు: 4
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: మార్చి 27
- వెబ్‌సైట్: https://stpi.in/en/main-career

ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్

పోటీ పరీక్షల ప్రత్యేకం

- తెలంగాణ చరిత్ర, ఎకానమీ, ఇంటర్ జువాలజీ మెటీరియల్ కోసం పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.
- కింది వెబ్‌సైట్‌ను క్లిక్ చేయండి.
- https://bit.ly/3ZQIrEN

మోదీ చేతిలోనే దర్యాప్తు సంస్థలు

- కేంద్రం తీరుపై భగ్గుమన్న బీఆర్ఎస్ శ్రేణులు
- ఎమ్మెల్సీ కవితకు ఈడీ నోటీసులపై ఫైర్
- నల్లగొండలో మోదీ దిష్టిబొమ్మ దహనం

నమస్తే తెలంగాణ న్యూస్‌నెట్‌వర్క్, మార్చి 9: కేంద్ర ప్రభుత్వం దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేయడంపై ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నేతలు భగ్గుమంటున్నారు. దర్యాప్తు సంస్థలు స్వతంత్రంగా వ్యవహరించకుండా ప్రధాని మోదీ చెప్పినట్టు నడుచుకుంటున్నాయని మండిపడ్డారు. ఈ క్రమంలో బీజేపీ సర్కార్ తీరును నిరసిస్తూ గురువారం నల్లగొండ జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు బొమ్మరబోయిన నాగార్జున, కట్టా శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి చల్లా కోటేశ్ మాట్లాడుతూ.. ఇతర పార్టీల ప్రభుత్వాల కూల్చివేతకు మోదీ సర్కారు కుట్ర పన్నుతున్నదని విమర్శించారు. అందులో భాగంగానే ఎమ్మెల్సీ కవితకు ఈడీ నోటీసులు ఇచ్చిందని దుయ్యబట్టారు.

మోదీది కక్షసాధింపే..

ప్రధాని మోదీ కక్షసాధింపు చర్యలు పాల్పడుతున్నారని కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు విమర్శించారు. తెలంగాణలో సీఎం కేసీఆర్‌ను బలహీన పర్చాలనే ఉద్దేశంతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎమ్మెల్సీ కవితకు ఈడీతో నోటీసులు పంపిందని దుయ్యబట్టారు. ఎమ్మెల్సీ కవితకు ఈడీ నోటీసులు ఇవ్వడం తగదని నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ ప్రభుత్వాన్ని అప్రతిష్ఠ పాల్జేయాలనే కుట్రలో భాగంగా ఢిల్లీ లిక్కర్ స్కాంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేరును చేర్చారని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తెలంగాణలో రాజకీయంగా లబ్ధిపొందాలనే లక్ష్యంతోనే బీఆర్ఎస్ నేతలను భయాందోళనకు గురిచేసేందుకు కుట్రలు పన్నుతున్నదని వరంగల్ జిల్లా వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్ ఆరోపించారు. మహిళా సాధికారత, ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను టార్గెట్ చేసి ఈడీతో నోటీసులు ఇప్పించడం దారుణమన్నారు.

బ్లాక్ మెయిల్ రాజకీయాలు: పుట్ట మధు

సీఎం కేసీఆర్ బీఆర్ఎస్ ఏర్పాటు చేయడంతో బీజేపీలో వణుకు మొదలైందని, అందుకే ఎమ్మెల్సీ కవితపై సీబీఐ, ఈడీ దాడులకు ఉసిగొల్పుతున్నదని పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధు ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రతిపక్షాలపై ఈడీ, సీబీఐ లాంటి దర్యాప్తు సంస్థలతో దాడి చేస్తూ దుర్మార్గపు రాజకీయాలు చేస్తున్నదని విమర్శించారు. భూపాలపల్లి జడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిని మాట్లాడుతూ ఎమ్మెల్సీ కవితకు మహిళా లోకం అండగా ఉంటుందని అన్నారు. ఆమెను ఈడీ పేరిట విచారణకు పిలవడాన్ని ఖండించారు.

తెలంగాణ సమాజం తిప్పికొడుతుంది: కేతిరెడ్డి

ఎమ్మెల్సీ కవితకు ఈడీ నోటీసులు జారీ చేయడం ముమ్మాటికీ తెలంగాణపై దాడిగానే భావిస్తామని దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవరెడ్డి తెలిపారు. కేంద్రంలోని మోదీ సర్కార్ వైఫల్యాలను ఎండగడుతున్నందుకే బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు బీజేపీ కుట్ర చేస్తున్నదని విమర్శించారు. సీబీఐ సంస్థలను ఇష్టారీతిగా దుర్వినియోగం చేస్తున్న బీజేపీకి కాలం దగ్గరపడిందని ట్రైకార్ చైర్మన్ ఇస్లావత్ రాంచంద్రనాయక్ అన్నారు. సీఎం కేసీఆర్ కుటుంబాన్ని బ్లాక్‌మెయిల్ చేయాలని కేంద్రం కుట్రలు చేస్తున్నదని, కవితకు నోటీసులు ఇచ్చినంత మాత్రాన బీఆర్ఎస్ బెదిరిపోదని తేల్చిచెప్పారు.

బీజేపీ చెప్పుడు.. ఈడీ చేసుడు!

- కథ, స్క్రీన్‌ప్లే అంతా ఆ పార్టీయే
- పావులుగా మారిన దర్యాప్తు సంస్థలు
- నేతలు చెప్పినట్టే దాడులు, అరెస్టులు

హైదరాబాద్, మార్చి 9 (నమస్తే తెలంగాణ): కేంద్ర దర్యాప్తు సంస్థలు బీజేపీతో జోడీ కట్టాయి. ఆ పార్టీ నేతలు ఎలా చెప్తే అలా సీబీఐ, ఈడీ లాంటి సంస్థలు తోక ఆడిస్తున్నాయి. ఆ సంస్థలకు బీజేపీ గల్లీ లీడర్లు స్క్రీన్‌ప్లే, దర్శకత్వం వహిస్తున్నారు. ఇటీవలి ఘటనలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. ఈ అక్రమ సంబంధం వల్ల ఆయా సంస్థల పట్ల ప్రజల్లో నమ్మకం సన్నగిల్లుతున్నది. కేంద్ర దర్యాప్తు సంస్థలు చేపట్టే రహస్య విచారణల గురించి రాష్ట్రాల్లోని బీజేపీ గల్లీ లీడర్లు 'చిలక జోస్యం' మాదిరిగా ముందే చెప్పడం.. ఆ మరుసటి రోజే సీబీఐ, ఈడీ, ఐటీ అధికారులు రంగంలోకి దిగడం పరిపాటిగా మారడం ఇందుకు కారణం.

లీకుల చిట్టా ఇదీ..

నిరుడు ఆగస్టు 21న ఢిల్లీలో బీజేపీ ఎంపీ పర్వేశ్ వర్మ, మాజీ ఎమ్మెల్యే మంజీందర్ సిర్సా సంయుక్త మీడియా సమావేశంలో మద్యం కుంభకోణంలో ఎమ్మెల్సీ కవిత పేరును ప్రస్తావించారు. వాస్తవానికి అప్పటికి సీబీఐ దర్యాప్తు తెలంగాణ వరకు రాలేదు. అయినా వారు బాహాటంగా కవిత పేరును ప్రస్తావించడం గమనార్హం. కవిత చుట్టూ కుట్ర జరిగిందనడానికి వారి మాటలే నిదర్శనం.

- 'మద్యం కుంభకోణంలో కవిత తప్పు లేకపోతే 10 ఫోన్లను ఎందుకు పగలగొట్టుకున్నది?' అంటూ బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ నిరుడు ఆగస్టులో ప్రజా సంగ్రామ యాత్ర సందర్భంగా వ్యాఖ్యానించారు. తద్వారా ఆ ఫోన్ల గురించి ఈడీ ఆరా తీయనున్నదని, ధ్వంసమైన ఫోన్లలోని సమాచారాన్ని సేకరించిందని మీడియాకు హింట్ ఇచ్చారు. దీంతో దర్యాప్తు సంస్థల వద్ద ఉన్న ఆయా ఫోన్ల వివరాలు, వాటి ఐఎంఈఐ నంబర్లు బీజేపీకి అనుకూల చానల్‌లో ప్రసారమయ్యాయి.
- 'ఆమె (కవిత)నే ప్రైవేట్ జెట్‌ల పోయింది. ఢిల్లీలో మీటింగులల్ల కూర్చున్నది. మద్యం కుంభకోణంలో ఆమె హస్తమున్నది. ఈ కుంభకోణం వల్ల ఢిల్లీ ప్రభుత్వం రూ.6-7 వేల కోట్లు నష్టపోయినట్టు మాకు సమాచారం ఉన్నది. దీనిపై విచారణకు గమ్మున కో-ఆపరేట్ చెయ్యాలిగానీ, కోర్టులకెందుకు పోపుడు' అంటూ నిజామాబాద్ ఎంపీ అర్వింద్ నిరుడు సెప్టెంబర్ 5న మీడియాతో మాట్లాడారు. తద్వారా ఢిల్లీ లిక్కర్ స్కాం పరిమాణం రూ.6 వేల కోట్ల నుంచి రూ.7 వేల కోట్లు ఉంటుందని సీబీఐ, ఈడీలు నిగ్గు తేల్చక ముందే చెప్పారు. అంటే ఢిల్లీ లిక్కర్ స్కాం వి లువను లెక్కకట్టింది ఈ ఘనాపాటీ లేనని తేలుతున్నది. లేని స్కాంను ఉన్నట్టుగా పదిసార్లు చెప్పి కుంభకోణం నిజమేనన్న భ్రమలు కల్పించేందుకే ఆయన ఈ వ్యాఖ్యలు చేసినట్టు ఇప్పుడు స్పష్టమవుతున్నది.
- 'కేసీఆర్ గారాల కూతురు, ఎమ్మెల్సీ కవిత నేడో రే పో జైలు పాలు అవక తప్పదు' అంటూ బీజేపీ నేత కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఈ నెల 4న పవిత్రమైన తిరుమల సన్నిధిలో రాజకీయాల గురించి మాట్లాడారు. ఆయన ఆ మాట అనగానే 6వ తేదీ నుంచే రామచంద్ర పిళ్లై అరెస్టుకు రంగం సిద్ధం చేసిన ఈడీ అధికారులు.. 7న ఆయనను అరెస్టు చేశారు.
- పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన ఓటమిని బీజేపీ భరించలేకపోతున్నది. అందుకే ఢిల్లీలో జరిగిన స్కాంను గోవా, పంజాబ్ ఎన్నికలకు ముడిపెట్టి బురద జల్లే ప్రయత్నం చేసింది. బీజేపీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్ర నిరుడు సెప్టెంబర్ 14న ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియాకు కొన్ని ప్రశ్నలు సంధించారు. వారు సమాధానం చెప్పకపోవడంతో సెప్టెంబర్ 15న బీజేపీ స్టింగ్ ఆపరేషన్ వీడియోలను బయటపెట్టడం, అదే రోజున మనీశ్ సిసోడియా ఇంటితో సహా దేశంలోని 31 ప్రాంతాల్లో సీబీఐ సోదాలు చేపట్టడం చకచకా జరిగిపోయాయి. ఆ తర్వాత నుంచి బీజేపీ ముఖ్యనేతలంతా ఎమ్మెల్సీ కవితపై అడ్డగోలు వ్యాఖ్యలు చేశారు. ఆమె అరెస్ట్ తప్పదని, జైలుకు వెళ్లడం ఖాయమని ఊదరగొట్టారు. ఈ క్రమంలోనే కవితకు ఈడీ సమన్లు జారీ చేసింది. ఈ పరిణామాలను బట్టి కేంద్ర దర్యాప్తు సంస్థలు బీజేపీ నేతల డైరెక్షన్‌లోనే పనిచేస్తున్నాయని, అందుకే గోప్యంగా ఉంచాల్సిన సమాచారాన్ని ముందుగానే బీజేపీ నేతలకు లీక్ చేస్తున్నాయని అర్థమవుతున్నది.

అంతా పథకం ప్రకారమే..

ఢిల్లీలో మద్యం కుంభకోణం జరిగిందంటూ నిరుడు ఆగస్టులో ఆ రాష్ట్ర లెఫ్టినెంట్ గవర్నర్ విచారణకు ఆదేశించారు. అప్పటి నుంచి ఏ రోజు ఏం జరుగుతుందో ముందుగానే బీజేపీ నేతలకు తెలిసిపోతున్నది. ఈ కేసులో అత్యంత పారదర్శకంగా వ్యవహరించాల్సిన కేంద్ర దర్యాప్తు సంస్థలు నిస్సిగ్గుగా బీజేపీ గల్లీ నేతలకు సమాచారాన్ని చేరవేస్తున్నాయి. 2022 ఆగస్టులో సీబీఐ దేశవ్యాప్తంగా 31 చోట్ల దాడులు నిర్వహించిన నాటి నుంచి మొన్న అరుణ్ రామచంద్ర పిళ్లై అరెస్టు వరకూ ప్రతి విషయాన్ని బీజేపీ గల్లీ నేతలు పథకం ప్రకారం ముందుగానే మీడియాకు బహిర్గతం చేస్తున్నారు. ఈ కేసులో ఈడీ ఇప్పటివరకు 11 మందిని అరెస్టు చేసింది. ఈ అరెస్టుల విషయాన్ని ఈడీ కంటే ముందుగానే చెప్పిన బీజేపీ నేతలు.. మున్ముందు మరిన్ని అరెస్టులు జరుగుతాయని చెప్తున్నారు. దీన్ని బట్టే బీజేపీకి, కేంద్ర దర్యాప్తు సంస్థలకు మధ్య అక్రమ సంబంధం ఉన్నదని ప్రజలు నిర్ధారించుకుంటున్నారు.



మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సమక్షంలో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్న ఆర్జీయూకేటీ వైస్ చాన్సలర్ వీ వెంకటరమణ, డైరెక్టర్ సతీశ్‌కుమార్, టీఎస్ కాస్ట్ సభ్య కార్యదర్శి నగేశ్

ఆర్జీయూకేటీ, టీఎస్‌కాస్ట్‌ల ఎంవోయూ

ఉమ్మడిగా రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులకు రూపకల్పన

హైదరాబాద్, మార్చి 9 (నమస్తే తెలంగాణ): సైన్స్ అండ్ టెక్నాలజీ రంగంలో రిసెర్చ్ కోసం ఆర్జీయూకేటీ, టీఎస్ కాస్ట్ మధ్య గురువారం అవగాహన ఒప్పందం కుదిరింది. ఒప్పందం ప్రకారం ఇరుసంస్థలు నూతన ఆవిష్కరణలు, రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్‌లను రూపొందించనున్నాయి. గురువారం హైదరాబాద్ సైఫాబాద్‌లోని అరణ్యభవన్‌లో టీఎస్ కాస్ట్ సభ్యకార్యదర్శి ఎం నగేశ్, ఆర్జీయూకేటీ వీసీ వెంకటరమణ, డైరెక్టర్ పీ సతీశ్‌కుమార్ పరస్పరం ఒప్పంద పత్రాలను మార్చుకొన్నారు. ఈ సందర్భంగా అటవీ పర్యావరణ శాస్త్ర, సాంకేతిక శాఖల మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడుతూ, బోధన, పరిశోధన రంగాల్లో అవకాశాల అన్వేషణకు ఈ ఒప్పందం మరింత దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, సబితాఇంద్రారెడ్డి సహకారంతో బాసర ఆర్జీయూకేటీలో మౌలిక వసతులు మెరుగుపడ్డాయని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతోపాటు క్యాంపస్ ప్లేస్‌మెంట్లు పెరిగాయని చెప్పారు. ఆర్జీయూకేటీ సహకారంతో జిల్లాలను ఐటీ, ఇన్నోవేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు.

న్యాక్‌తో ఐఐఐటీ బాసర ఎంవోయూ

మాదాపూర్, మార్చి 9: నైపుణ్య రంగంలో శిక్షణ ఇస్తూ ఎంతోమందికి ఉపాధి కల్పిస్తున్న న్యాక్‌తో గురువారం ఐఐఐటీ బాసర అవగాహన ఒప్పందం కుదుర్చుకొన్నది. ఒప్పందంలో భాగంగా విద్యార్థులకు ప్లేస్‌మెంట్ లింక్డ్ ఫినిషింగ్ స్కూల్ ప్రోగ్రాంను న్యాక్ అందించనున్నది. గురువారం హైదరాబాద్ మాదాపూర్‌లోని న్యాక్ ఆడిటోరియంలో ఐఐఐటీ వీసీ వెంకటరమణ, న్యాక్ డైరెక్టర్ జనరల్ కే భిక్షపతి ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. కార్యక్రమంలో పలువురు న్యాక్ సిబ్బంది పాల్గొన్నారు.

మహారాష్ట్రలోనూ మన 'రైతుబంధు'!

- తెలంగాణ పథకాన్ని కాపీ కొట్టిన బీజేపీ పాలిత రాష్ట్రం
- 2023-24 బడ్జెట్‌లో రైతులే లక్ష్యంగా వరాల జల్లు
- పెట్టుబడి సాయమే కాదు.. తెలంగాణ పథకాలన్నీ కావాలి
- బీఆర్‌ఎస్ కిసాన్ సమితి మహారాష్ట్ర అధ్యక్షుడు మాణిక్‌రావు కదం డిమాండ్



హైదరాబాద్, మార్చి 9 (నమస్తే తెలంగాణ): భారత రాష్ట్ర సమితి అధినేత, తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన 'అబ్ కీ బార్ కిసాన్ సర్కార్' నినాదం దేశంలో ప్రభంజనం సృష్టిస్తున్నది. దశాబ్దాలుగా కల్లబొల్లి కబుర్లతో కాలం వెల్లదీసి, రైతాంగ సమస్యలపై ఉదాసీనంగా వ్యవహరించిన ప్రభుత్వాల పాలకులను హడలెత్తిస్తున్నది. రైతాంగం మెప్పు పొందే దిశగా పరుగులు పెట్టిస్తున్నది. తాజాగా మహారాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2023–24 బడ్జెట్ ఇందుకు నిదర్శనం. తెలంగాణలో అమలవుతున్న రైతుబంధు పథకాన్ని ఇప్పటికే కేంద్రంతోపాటు పలు రాష్ట్రాలు కాపీ కొట్టగా, తాజాగా ఆ జాబితాలో మహారాష్ట్ర సర్కారు చేరింది. ఆ రాష్ట్రంలోని 1.5 కోట్ల మంది రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.6 వేలు ఇచ్చేందుకు అక్కడి ప్రభుత్వం నిర్ణయించింది. బడ్జెట్‌లో 6,900 కోట్లను కేటాయించింది. బీఆర్‌ఎస్‌కి మహారాష్ట్రలో లభిస్తున్న ఆదరణ వల్లే ఈ కీలక నిర్ణయాలు తీసుకున్నదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

మహారాష్ట్ర బడ్జెట్‌పై బీఆర్‌ఎస్ ప్రభావం

స్వల్పకాలంలోనే బీఆర్‌ఎస్‌కు లభిస్తున్న ఆదరణ చూసి మహారాష్ట్ర పాలకులు బెంబేలెత్తిపోతున్నారు. ఈ నేపథ్యంలోనే అక్కడి రైతాంగానికి ఉపశమనం కలిగించే దిశగా చర్యలకు ఉపక్రమించారు. తెలంగాణలో అమలవుతున్న రైతుబంధు అమలుకు నిర్ణయించారు. ఆత్మహత్యలు అత్యధికంగా నమోదవుతున్న మరాట్వాడ, పర్భణి పరిధిలోని 14 జిల్లాల్లోని రైతులకు సరఫరా చేస్తున్న గోధుమలకు బదులు ఏటా ఒక్కో రైతుకు రూ.1,800 నేరుగా అందజేయనున్నారు. మిషన్ కాకతీయను స్ఫూర్తిగా తీసుకొని 2016లో ప్రారంభించి, అటకెక్కించిన జలయుక్త్ శివార్ పథకాన్ని పునఃప్రారంభించాలని నిర్ణయించారు. మహారాష్ట్ర రైతాంగంలో బీఆర్‌ఎస్‌కు లభిస్తున్న ఆదరణను చూసి అక్కడి నేతల్లో వణుకు పుట్టిందని పలువురు పేర్కొంటున్నారు.

కేసీఆర్ 'అబ్ కీ బార్ కిసాన్ సర్కార్'కు విశేష స్పందన

కరెంటు అందక, సాగునీరు లేక, మద్దతు ధర లేక, ప్రభుత్వ చేయూత లేక మహారాష్ట్ర రైతాంగం దశాబ్దాలుగా కునారిల్లుతున్నది. రైతుల ఆత్మహత్యలకు చిరునామాగా మారింది. కాగా, తెలంగాణ పథకాలపై మహారాష్ట్ర రైతాంగం హర్షం వ్యక్తం చేస్తుండటంతోపాటు తమకూ ఆ పథకాలు కావాలని డిమాండ్ చేస్తున్నది. అబ్ కిబార్ కిసాన్ సర్కార్ నినాదంతో నాందేడ్‌లో బీఆర్‌ఎస్ అధినేత, తెలంగాణ సీఎం కేసీఆర్ నిర్వహించిన సమావేశానికి ఈ నేపథ్యంలోనే విశేష స్పందన లభించింది. తెలంగాణకు సరిహద్దులో ఉన్న నాందేడ్ జిల్లాతోపాటు సౌత్, నార్త్, బోకర్, నాయిగాం, ముద్కేడ్, డెగ్లూర్, లోహ నియోజకవర్గాలు, కిన్వట్, ధర్మాబాద్ పట్టణాలు, నయిగాం, బిలోలి, ఉమ్రి, హిమాయత్‌నగర్ తదితర మండలాల్లో తెలంగాణ పథకాలపై జోరుగా చర్చలు జరుగుతున్నాయి. నాందేడ్ సమావేశంతో బీఆర్‌ఎస్‌లో మొదలైన చేరికల పరంపర ఇప్పటికీ కొనసాగుతూనే వున్నది. మహారాష్ట్రకు చెందిన మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, జడ్పీ సభ్యులు, పంచాయితీ సమితి సర్పంచ్‌లు, కార్పొరేటర్లు, కాంగ్రెస్, బీజేపీ, శివసేనకు చెందిన సీనియర్ నేతలు, కీలకనాయకులు బీఆర్‌ఎస్‌లోకి వరుసకడుతున్నారు.

తెలంగాణ పథకాలన్నీ కావాలి



పంట పెట్టుబడి సాయం ఒక్కటే కాదు తెలంగాణ సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న పథకాలన్నీ కావాలని మహారాష్ట్ర రైతులు కోరుకుంటున్నారు. ఉచిత కరెంటు, సాగునీళ్లు, సకాలంలో ఎరువులను అందివ్వాలని డిమాండ్ చేస్తున్నారు. అందుకే బీఆర్‌ఎస్ పార్టీకి మహారాష్ట్రలో విశేష స్పందన లభిస్తున్నది. బీఆర్‌ఎస్‌లో చేరేందుకు రైతులు, యువకులు, నేతలు ఉత్సాహం చూపుతున్నారు. బీఆర్‌ఎస్‌ను చూసి ఇక్కడి పార్టీలన్నీ వణికిపోతున్నాయి. బీఆర్‌ఎస్ ప్రభావం వల్లే బడ్జెట్‌లో రైతుల కోసం నిధులను పెంచారు.

– మాణిక్‌రావు కదం, భారత రాష్ట్ర కిసాన్ సమితి మహారాష్ట్ర అధ్యక్షుడు

అంధ విద్యార్థులకు 'లాంగ్వేజెస్' చాన్స్

హైదరాబాద్, మార్చి 09 (నమస్తే తెలంగాణ): అంధ విద్యార్థులకు విద్యాశాఖ శుభవార్త చెప్పింది. ఆరు నుంచి ఎస్సెస్సీ వరకు మూడు (తెలుగు, హిందీ, ఇంగ్లిష్) లాంగ్వేజెస్ పరీక్షలను రాసుకొనే అవకాశం ఇస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. అంధ విద్యార్థులు గతంలో ఒక సబ్జెక్ట్ (లాంగ్వేజ్) పరీక్ష రాయకున్నా పాస య్యే వెసులుబాటు ఉన్నది. ప్రస్తుతం లాంగ్వేజెస్‌ను రాసుకొనే అవకాశం కల్పించాలని కొందరు ఔత్సాహిక విద్యార్థులు, పలు ఎన్జీవోలు హైకోర్టు ను ఆశ్రయించాయి. పరీక్షలు రాసే అవకాశం, మినహాయింపు విషయా న్ని విద్యార్థులకే వదిలివేయాలని విద్యాశాఖకు హైకోర్టు సూచించింది. దీంతో లాంగ్వేజెస్‌ను రాసుకొనే అవకాశం కల్పిస్తూనే, రాయలేమని చెప్పే వారికి మినహాయింపు ఇస్తున్నట్టు విద్యాశాఖ పేర్కొన్నది.

రూ.50తో ఆరు గంటల ప్రయాణం

- మహిళలు, వృద్ధులకు తెలంగాణ ఆర్టీసీ టీ-6 టికెట్
- కుటుంబం, స్నేహితుల కోసం ఎఫ్-24 టికెట్ సౌకర్యం
- రూ.300తో రోజంతా నలుగురు ప్రయాణానికి చాన్స్
- గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నేటి నుంచి అమలు
- పోస్టర్లను ఆవిష్కరించిన ఎండీ వీసీ సజ్జనార్



గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో టీఎస్‌ఆర్టీసీ ప్రకటించిన ప్రత్యేక ఆఫర్ల పోస్టర్‌ను గురువారం ఆవిష్కరిస్తున్న సంస్థ ఎండీ వీసీ సజ్జనార్, ఇతర ఉన్నతాధికారులు

హైదరాబాద్/సిటీబ్యూరో, మార్చి 9 (నమస్తే తెలంగాణ): గ్రేటర్ హైదరాబాద్‌లోని ప్రజలు, పర్యాటకులకు మరింత చేరువయ్యేందుకు టీఎస్ ఆర్టీసీ రెండు స్పెషల్ ఆఫర్లను ప్రకటించింది. ఇప్పటికే టీ–24 టికెట్ ఇస్తున్న సంస్థ.. తాజాగా టీ–6, ఫ్యామిలీ–24 పేరుతో కొత్త టికెట్లను తీసుకొచ్చింది. వీటి పోస్టర్లను టీఎస్‌ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ గురువారం హైదరాబాద్‌లోని బస్‌భవన్‌లో ఆవిష్కరించారు. ఈ టికెట్లు శుక్రవారం నుంచి బస్ కండక్టర్ల వద్ద లభిస్తాయి. మహిళలు, సీనియర్ సిటిజన్లు రూ.50 చెల్లించి టీ–6 తీసుకొని గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని సిటీ ఆర్డినరీ, మెట్రో బస్సుల్లో 6 గంటలపాటు ఎక్కడి నుంచి ఎక్కడికైనా ప్రయాణించవచ్చు. మధ్యా హ్నం 2 గంటల తర్వాత ఈ టికెట్లను ఇవ్వ రు. టికెట్ తీసుకొనే సమయంలో వృద్ధులు వయసు ధ్రువీకరణకు ఆధార్ కార్డు చూపించాల్సి ఉంటుంది. వారంతాలు, సెలవు దినా ల్లో కుటుంబసభ్యులు, స్నేహితులు కలిసి ప్రయాణించేందుకు వీలుగా రూ.300తో ఫ్యామిలీ–24 టికెట్ తీసుకొని నలుగురు రోజంతా సిటీ ఆర్డినరీ, మెట్రో బస్సుల్లో ప్రయాణించవచ్చు. శని, ఆదివారాలతోపాటు సెలవు దినాల్లో మాత్రమే ఈ ఆఫర్ ఉంటుంది. ఇప్పటికే అమలులో ఉన్న టీ–24 టికెట్లను 55.50 లక్షల మంది కొనుగోలు చేశారు. ప్రతి రోజు సగటున 25 వేల వరకు ఆ టికెట్లు అమ్ముడవుతున్నాయి. కార్యక్రమంలో సంస్థ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ వీ రవీందర్, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సంగ్రామ్ సింగ్‌జీ పాటిల్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు పీవీ మునిశేఖర్, వినోద్‌కుమార్, వెంకటేశ్వర్లు, సీపీఎం కృష్ణ కాంత్, సీటీఎం జీవన్ ప్రసాద్, సీఎంఈ రఘునాథరావు, సీఈఐటీ రాజశేఖర్, సీటీఎం (ఎంఅండ్‌సీ) విజయ్ కుమార్, సీఎఫ్‌ఎం విజయ పుష్ప, హైదరాబాద్, సికింద్రాబాద్ ఆర్‌ఎంలు వరప్రసాద్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యా - ఉద్యోగ సమాచారం

నేటి నుంచి వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ హాల్‌టికెట్లు

హైదరాబాద్, మార్చి 9(నమస్తే తెలంగాణ) : వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ (క్లాస్–ఏ,బీ) పోస్టుల భర్తీకి ఈ నెల 15, 16న నిర్వహించే రాత పరీక్షలకు శుక్రవారం నుంచి హాల్‌టికెట్లు జారీ చేయనున్నట్టు టీఎస్‌పీఎస్సీ అధికారులు తెలిపారు. విద్యార్థులు తమ హాల్‌టికెట్లను https://www.tspsc.gov.in వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.


16న అఖిల భారత ఉన్నత విద్యామండలి సదస్సు

హైదరాబాద్, మార్చి 9 (నమస్తే తెలంగాణ): ఉన్నత విద్యను సంస్కరించడం, మార్పులు చేయడం ప్రధాన ఎజెండాగా అఖిల భారత ఉన్నత విద్యామండలి చైర్మన్ల సదస్సు ఈ నెల 16,17న హైదరాబాద్ వేదికగా నిర్వహించనున్నారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో నేషనల్ ఎడ్యుకేషన్ ప్లానింగ్ అండ్ అడ్మినిస్ట్రేషన్ (నేపా) సహకారంతో ఈ సదస్సును బేగంపేట హరితప్లాజాలో నిర్వహించనున్నారు. దేశంలోని పలు రాష్ట్రాల ఉన్నత విద్యామండళ్ల చైర్మన్లు, ఇతర విద్యావేత్తలు సదస్సుకు హాజరుకానున్నారు.

మొక్కకు వ్యాక్సిన్‌లా ప్లాస్మా వాటర్!

- కీటకాలు, తెగుళ్లను తట్టుకొనేలా..
- దిగుబడిని పెంచే కొత్త టెక్నాలజీ
- ఆధునిక విధానంపై ఇక్రిసాట్ స్టడీ

హైదరాబాద్ సిటీబ్యూరో, మార్చి 9 (నమస్తే తెలంగాణ): మెట్టభూముల్లో సాగు విధానాలను ప్రోత్సహించి.. సన్న, చిన్నకారు రైతులకు లాభం చేకూరేలా ఇక్రిసాట్ సంస్థ పరిశోధనలు చేస్తున్నది. అమెరికాకు చెందిన ఓ వ్యవసాయ పరిశోధన సంస్థతో కలిసి మెట్ట భూముల్లో సాగుకు అనుకూలంగా ప్లాస్మా వాటర్ టెక్నాలజీపై అధ్యయనం చేసేందుకు సన్నద్ధమవుతున్నది. ఇక్రిసాట్ జీన్ బ్యాంక్‌తో కలిసి కీటకాలు, తెగుళ్లను తట్టుకొని దిగుబడిని పెంచే ఆధునిక విధానమైన ప్లాస్మా వాటర్ టెక్నాలజీని వినియోగించేందుకు సిద్ధమవుతున్నది. ఇప్పటికే పరిశోధకులు వివిధ దశల్లో ఉన్న మొక్కల జీవన కాలానికి అనుగుణంగా ప్లాస్మా అప్లికేషన్లను ప్రయోగాత్మకంగా ఉపయోగించి ఫలితాలను విశ్లేషిస్తున్నారు. ప్లాస్మా వాటర్ కంపెనీలతో కుదిరిన ఒప్పందం ప్రకారం దేశంలోని మెట్ట భూముల్లో వ్యవసాయాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా పనిచేయనున్నారు.



ప్లాస్మా వాటర్ టెక్నాలజీ నమూనా చిత్రం

ప్లాస్మా వాటర్ టెక్నాలజీ అంటే?

గాలి, నీరు, విద్యుత్తు సాయంతో నీటిని ప్లాస్మైజ్డ్ వాటర్‌గా మార్చి మొక్కకు అందించడాన్నే ప్లాస్మా వాటర్ టెక్నాలజీగా పిలుస్తున్నారు. పేటెంట్ కలిగిన ప్లాస్మా చాంబర్ ద్వారా నీటిని పంపు చేస్తారు. ఈ నీటిలో ఎలాంటి సూక్ష్మజీవులు, బ్యాక్టీరియా మనుగడ సాగించలేదు. పూర్తిగా రియాక్టివ్ ఆక్సిజన్‌తోపాటు నైట్రోజన్ పరమాణువులను కలిగి ఉంటుంది. గింజలు, మొక్కల్లో రోగ నిరోధక వ్యవస్థను బలపరుస్తుంది. ప్రస్తుతం అమెరికావ్యాప్తంగా దీనిపై విస్తృతంగా అధ్యయనం చేస్తున్నారు. ఈ టెక్నాలజీతో సాగు నిర్వహణ భారంతోపాటు రసాయనిక ఎరువుల వినియోగం కూడా తగ్గి.. సేంద్రియ ఉత్పత్తులను పొందేందుకు అవకాశం ఉన్నదని ఇక్రిసాట్ వర్గాలు వెల్లడించాయి.

పీఈసెట్ షెడ్యూల్ విడుదల

- 13న నోటిఫికేషన్ జారీ
- 15 నుంచి దరఖాస్తుల స్వీకరణ

హైదరాబాద్, మార్చి 9 (నమస్తే తెలంగాణ) : టీఎస్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (పీఈసెట్– 2023–24) షెడ్యూల్ ఖరారైంది. గురువారం హైదరాబాద్ మాసబ్‌ట్యాంక్‌లోని తన కార్యాలయంలో ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి పీఈసెట్ షెడ్యూల్‌ను విడుదల చేశారు. బీపీఈడీ, యూజీ–డీపీఈడీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఈ పరీక్షకు ఈ నెల 13న నోటిఫికేషన్ విడుదల చేస్తామని లింబాద్రి ప్రకటించారు. దరఖాస్తు ఫీజుగా ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.500, బీసీ, జనరల్ విద్యార్థులు రూ.900 చెల్లించాలని పేర్కొన్నారు. దరఖాస్తు, ఇతర వివరాలకు https://pecet.tsche.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ సమావేశంలో ఉన్నత విద్యామండలి వైస్‌చైర్మన్ వెంకటరమణ, కార్యదర్శి డాక్టర్ ఎన్ శ్రీనివాస్‌రావు, శాతవాహన వర్సిటీ వైఎస్ చాన్స్‌లర్ మల్లేశ్, మహాత్మాగాంధీ వర్సిటీ వైస్ చాన్స్‌లర్ గోపాల్‌రెడ్డి, పాలమూరు వర్సిటీ వైస్ చాన్స్‌లర్ లక్ష్మీకాంత్ రాథోడ్, పీఈసెట్ కన్వీనర్ రాజేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



హైదరాబాద్ మాసబ్‌ట్యాంక్‌లోని తన కార్యాలయంలో పీఈసెట్ షెడ్యూల్‌ను విడుదల చేస్తున్న ఉన్నత విద్యామండలి చైర్మన్ లింబాద్రి, వివిధ యూనివర్సిటీల వైస్‌చాన్స్‌లర్లు

షెడ్యూల్ ఇలా..	తేదీలు
నోటిఫికేషన్	13-3-23
దరఖాస్తుల స్వీకరణ	15-3-23
దరఖాస్తుల గడువు	6-5-23
500 ఆలస్య రుసుంతో	15-5-23
2 వేల ఆలస్య రుసుంతో	20-5-23
5 వేల ఆలస్య రుసుంతో	25-5-23
హాల్‌టికెట్ల డౌన్‌లోడింగ్	26-5-23
ఫిజికల్ టెస్ట్‌లు	1-6-23 నుంచి 10-6-23
ఫలితాల ప్రకటన	జూన్ మూడో వారంలో

డిగ్రీలో సైబర్ సెక్యూరిటీ కోర్సు

వచ్చే విద్యాసంవత్సరంలో అందుబాటులోకి.. రూపొందించిన నల్సార్, ఓయూ

హైదరాబాద్, మార్చి 9 (నమస్తే తెలంగాణ): వచ్చే విద్యాసంవత్సరంలో డిగ్రీలో సైబర్ సెక్యూరిటీ కోర్సును ప్రవేశపెట్టాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి నిర్ణయించింది. సైబర్ నేరాలపై అవగాహన కల్పించడమేగాక, వాటిని అరికట్టే యోధులను తయారుచేసేందుకు ఈ కోర్సును ప్రవేశపెట్టనున్నట్టు తెలిపింది. ఉస్మానియా, నల్సార్ వర్సిటీ విషయ నిపుణులచే సైబర్ సెక్యూరిటీ కోర్సును రూపొందించినట్టు పేర్కొన్నది. గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన వీసీల సమావేశంలో ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి, కళాశాల విద్య కమిషనర్ నవీన్‌మిట్టల్, పలు వర్సిటీల వీసీలు ప్రొఫెసర్ రవీందర్, గోపాల్‌రెడ్డి, మల్లేశ్, రవీందర్‌గుప్తా, లక్ష్మీకాంత్ రాథోడ్ మరిన్ని నిర్ణయాలు తీసుకొన్నారు. ఈ విద్యా సంవత్సరంలోనే డిగ్రీ కోర్సులను ప్రారంభించాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు.



ఉన్నత విద్యామండలి నిర్ణయాలు


- వచ్చే విద్యాసంవత్సరం సైబర్ సెక్యూరిటీతో పాటు బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ మేజర్ సబ్జెక్టుగా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్‌లర్నింగ్‌ను మైనర్ సబ్జెక్టులుగా నిర్వహించాలి.
- ప్రైవేట్ అనుబంధ డిగ్రీ కాలేజీలకు కోర్సులవారీగా కాకుండా జెనరిక్ అఫిలియేషన్ మంజూరు.
- విద్యార్థుల అభిరుచులకు అనుగుణంగా కోర్సులు, సిస్టంలో మార్పులు.
- న్యాక్ గ్రేడింగ్‌కు వెళ్లే ఒక్కో కాలేజీకి ఉన్నత విద్యామండలి తరఫున రూ.లక్ష సీడ్ ఫండ్ అందజేత.

తల'సిరి'లో తెలంగాణ టాప్

- తెలంగాణ తలసరి ఆదాయం రూ.3,17,115
- దేశ తలసరి ఆదాయం రూ.1,72,000
- రాష్ట్రంలో తొమ్మిదేండ్లలో 156% వృద్ధి
- దేశ సగటు కంటే 84.36% ఎక్కువ
- నేషనల్ స్టాటిస్టికల్ ఆఫీస్ వెల్లడి

ఏ దేశమైనా, రాష్ట్రమైనా అభివృద్ధి చెందిందని చెప్పేందుకు తలసరి ఆదాయాన్నే గీటురాయిగా తీసుకుంటారు. దేశ, రాష్ట్ర అభివృద్ధి వేగానికి తలసరి ఆదాయ వృద్ధిరేటు ప్రధాన సూచీగా నిలుస్తుంది. అంతటి విశేష ప్రాధాన్యమున్న తలసరి ఆదాయ వృద్ధిలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. దేశానికే రోల్‌మాడల్ అని బీజేపీ భజన బృందం పదే పదే చెప్తున్న గుజరాత్ ఈ జాబితాలో 11 స్థానానికి పరిమితవగా.. ప్రధాని నరేంద్రమోదీ ప్రాతినిధ్యం వహిస్తున్న ఉత్తరప్రదేశ్ అట్టడుగు స్థానంలో నిలిచింది.

హైదరాబాద్, మార్చి 9 (నమస్తే తెలంగాణ): ఏ లక్ష్యంతోనైతే స్వరాష్ట్రాన్ని సాధించుకున్నామో.. ఆ లక్ష్యం దిశగా తెలంగాణ వేగంగా అడుగులు వేస్తున్నది. కేంద్రం ఏకాణా ఇయ్యకున్నా స్వీయ శక్తితో ముందుకు సాగుతున్నది. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను రాష్ట్రం నలుదిక్కులకూ వికేంద్రీకరిస్తూ తిరుగులేని ఆర్థిక శక్తిగా ఎదుగుతున్నది. 2014–15 నుంచి తలసరి ఆదాయాన్ని ఏటేటా గణనీయంగా మెరుగుపరుచుకుంటున్న తెలంగాణ.. ఈ రంగంలో తనకు సాటి లేదని మరోసారి రుజువు చేసుకున్నది. 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన దేశ తలసరి ఆదాయ గణాంకాల్లో తెలంగాణ ఏ రాష్ట్రానికీ అందనంత ఎత్తులో నిలిచింది. నేషనల్ స్టాటిస్టికల్ ఆఫీస్ విడుదల చేసిన ఈ గణాంకాల ప్రకారం.. 2014–15 ఆర్థిక సంవత్సరంలో రూ.1,24,104గా ఉన్న తెలంగాణ తలసరి ఆదాయం ఇప్పుడు ఏకంగా రూ.3,17,115కి ఎగబాకింది. అంటే, గత తొమ్మిదేండ్లలో తెలంగాణ తలసరి ఆదాయం ఏకంగా 156 శాతం (రూ.1,93,001) వృద్ధి చెందింది. ఇదే సమయంలో దేశ తలసరి ఆదాయం 98 శాతం వృద్ధితో రూ.86,647 నుంచి రూ.1,72,000కు పెరిగింది. దీనితో పోలిస్తే తెలంగాణ తలసరి ఆదాయం 84.36 శాతం (రూ.1,45,115) ఎక్కువ.



అగ్రస్థానంలో తెలంగాణ

కేంద్ర పాలిత ప్రాంతమైన గోవాను మినహాయిస్తే తలసరి ఆదాయ వృద్ధిలో తెలంగాణ అగ్రస్థానంలో కొనసాగుతున్నది. ఆ తర్వాతి స్థానాల్లో వరుసగా కేరళ, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, హర్యానా, ఒడిశా, తమిళనాడు, మహారాష్ట్ర ఉన్నాయి. దేశానికే రోల్‌మాడల్‌గా బీజేపీ పదేపదే చెప్తున్న గుజరాత్ 11వ స్థానంలో నిలువగా.. ప్రధాని నరేంద్రమోదీ ప్రాతినిధ్యం వహిస్తున్న ఉత్తరప్రదేశ్ అన్ని రాష్ట్రాల కంటే అట్టడుగున ఉన్నది. ఈ ఆర్థిక సంవత్సరాన్ని మాత్రమే పరిగణలోకి తీసుకున్నా తలసరి ఆదాయ వృద్ధిలో తెలంగాణే మొదటి స్థానంలో ఉన్నది. 2022–23లో తెలంగాణ తలసరి ఆదాయం రూ.41,672 పెరిగింది. ఇది తెలంగాణ చరిత్రలోనే ఆల్‌టైమ్ రికార్డు. ఇదే సమయంలో జాతీయ తలసరి ఆదాయం రూ.21,993 మాత్రమే పెరిగింది. ఇలా చూసినా తెలంగాణ కంటే జాతీయ తలసరి ఆదాయం దాదాపు 50% తక్కువే.

తెలంగాణ తలసరి ఆదాయం	
2014-15వ ఆర్థిక సంవత్సరంలో	రూ.1,24,104
2022-23వ ఆర్థిక సంవత్సరంలో	రూ.3,17,115
తొమ్మిదేండ్లలో సాధించి వృద్ధి	156%

దేశ తలసరి ఆదాయం	
2014-15వ ఆర్థిక సంవత్సరంలో	రూ.86,647
2022-23వ ఆర్థిక సంవత్సరంలో	రూ.1,72,000
తొమ్మిదేండ్లలో సాధించిన వృద్ధి	98%

గత తొమ్మిదేండ్లలో తెలంగాణ, జాతీయ తలసరి ఆదాయాలు

సంవత్సరం	తెలంగాణ		దేశం	
	తలసరి ఆదాయం	వృద్ధిరేటు (%)	తలసరి ఆదాయం	వృద్ధిరేటు (%)
2014-15	1,24,104	10.6	86,647	9.5
2015-16	1,40,840	13.5	94,797	9.4
2016-17	1,59,395	13.2	1,03,870	9.6
2017-18	1,79,358	12.5	1,15,224	10.9
2018-19	2,09,848	17.0	1,25,946	9.3
2019-20	2,31,378	10.3	1,32,115	4.9
2020-21	2,31,103	-0.1	1,26,855	-4.0
2021-22	2,75,443	19.2	1,50,007	18.3
2022-23	3,17,115	15.1	1,72,000	13.7

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

పర్యావరణ పాఠాలు

భూతాపం ప్రమాదం ముంచుకొస్తున్నది.. పారాహుషార్ అంటూ మరో పరిశోధన ప్రపంచ దేశాలకు హెచ్చరిక జారీ చేసింది. భారత్‌లో తమిళనాడు రాజధాని చెన్నై, పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలకు తీవ్ర ప్రమాదం పొంచి ఉందని తేల్చి చెప్పింది. గత ఏడాది ఏప్రిల్‌లో విడుదలైన ఒక అధ్యయన నివేదిక కూడా.. 2050 నాటికి ముంబై, మంగళూరు, చెన్నై, విశాఖపట్నం, తిరువనంతపురం నగరాలు పాక్షికంగా మునిగిపోతాయని వెల్లడించింది. వాతావరణ మార్పులపై ఏర్పాటైన అంతర్ ప్రభుత్వ సంస్థ (ఐపీసీసీ) ఇదే విషయాన్ని సాధికారికంగా ప్రకటించింది. మరో పదేండ్లలో భారత దేశ ఆర్థిక రాజధాని ముంబై దాదాపు 65 శాతం మునిగిపోనున్నదని, గోవా, కోల్‌కతా, చెన్నైలతోపాటు దేశంలోని పలు తీరప్రాంతాలకు ముంపు ముప్పు ఉన్నదని తెలిపింది. భూతాపం తగ్గింపునకు తక్షణ కార్యాచరణ అవసరమని ఇవన్నీ హెచ్చరిస్తున్నాయి.

గత ఏడాది డిసెంబర్‌లో కేంద్రమంత్రి జితేంద్రసింగ్ ఒక విషయం చెప్పారు. 1901-1971 మధ్య ఏటా 1.3 మిల్లీమీటర్ల చొప్పున పెరిగిన సముద్రమట్టం.. 2006-18 మధ్య ఏటా 3.7 మిల్లీమీటర్ల చొప్పున పెరిగిందని వెల్లడించారు. సముద్రమట్టం పెరగటం అంటే ముంపు ప్రమాదం పెరగటమే. గ్లోబల్ వార్మింగ్ ప్రభావం నిత్య జీవితంలోనూ కనిపిస్తున్నది. రుతువులు మారుతున్నాయి. సాగుపై ప్రభావం పడుతున్నది. ఓవైపు వడగాలులు వీస్తుంటే మరోవైపు వరదలు ముంచేస్తున్నాయి. కానీ, కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఉపశమన చర్యలను మాత్రం చేపట్టటం లేదు. పైగా తన అనుంగు కార్పొరేట్ మిత్రులకు అనుకూలంగా ఉండేలా పర్యావరణ నిబంధనలను, చట్టాలను మారుస్తున్నది. ఒకరి కోసం దేశ భవిష్యత్తును తాకట్టు పెట్టటానికి వెనుకాడని సర్కార్.. పర్యావరణ అంశాన్ని పట్టించుకుంటుందని ఆశించటం అత్యాశే అవుతుంది. ఈ విధానాల వల్లనే 'పర్యావరణ పనితీరు సూచీ-2022' జాబితాలో 180 దేశాలలో భారత్ చివరి స్థానంలో నిలిచింది.


కేంద్రం వైఖరి ఇలా ఉన్నప్పటికీ.. ప్రకృతి సమతుల్యతను కాపాడటానికి, భావి తరాలకు పుడమి తల్లిని భద్రంగా అప్పగించటానికి తెలంగాణ ప్రభుత్వం శాయశక్తులా కృషి చేస్తున్నది. రాష్ట్ర ఆవిర్భావం నుంచే పర్యావరణ పరిరక్షణకు ముఖ్యమంత్రి కేసీఆర్ అమిత ప్రాధాన్యం ఇచ్చారు. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద మానవ ప్రయత్నంగా ఐక్యరాజ్య సమితితో ప్రశంసలు అందుకున్న హరితహారం కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నారు. ఇప్పటి వరకూ తెలంగాణలో దాదాపు 250 కోట్ల మొక్కలు నాటారు. ఫలితంగా 2014లో రాష్ట్రంలో పచ్చదనం పరిధి 24 శాతం ఉంటే.. ఇప్పుడు 31 శాతానికి పెరిగింది. దేశంలో ఏ రాష్ట్రం ఇంత వృద్ధిని సాధించలేదు. హరితహారాన్ని పలు రాష్ట్రాలు స్ఫూర్తిగా తీసుకొని మొక్కలను పెంచుతున్నాయి. అంతర్జాతీయంగా ప్రఖ్యాతి గాంచిన 'వరల్డ్ గ్రీన్ సిటీ' అవార్డుకు హైదరాబాద్ ఎంపికైంది. తెలంగాణ నుంచి కేంద్రం పర్యావరణ పాఠాలు నేర్చుకోవాలి.

మనసు విప్పి మాట్లాడుకుందామా?!

చాలా ఏండ్ల కిందట ఒక మిత్రుడు 'అవినీతి అనేది నోట్లోని ఉమ్మి లాంటిది. మనది మనకు బాగానే ఉంటది, చప్పరించి మింగేస్తం. ఎదుటివారిది మాత్రం అసహ్యం వేస్తది' అని నాతో అన్నాడు! అసలు అవినీతి అంటే అక్రమ సంపాదనకు సంబంధించిన విషయంగా మాత్రమే అర్థం చేసుకుంటం. కానీ కాదు. లోతుగా చూస్తే నీతిలేని పనులన్నీ అవినీతే. మరి ఎవరు తేల్చగలరు ఏది నీతి, ఏది కాదు అని? సమాధానానికి రావడానికి, సమాధానపడటానికి రెండు పేరాల సమయం తీసుకుందాం. ఈ రెండు ఉదాహరణలు చూద్దాం.



శ్రీశైల్‌రెడ్డి పంజుగుల
90309 97371



రామాయణంలో వానర రాజు వాలిని చెట్టు చాటునుంచి చంపుతడు రాముడు. యుద్ధ నియమాల ప్రకారం అది అనైతికం. కానీ తమ్ముడిని రాజ్యం నుంచి తరిమేసి, తమ్ముడి భార్యను చెరపట్టిన వాడు నియమాల గురించి మాటలాడవచ్చునా? దానికి విలువ ఉంటదా?

భారతంలో అంగరాజు కర్ణుడిని నిరాయుధుడిగా, కూరుకుపోయిన రథచక్రాన్ని ఎత్తుతున్న సందర్భంలో కృష్ణుడి పనుపు మీద బాణం వేసి కూలుస్తడు అర్జునుడు. యుద్ధ నియమాల ప్రకారం అది అనైతికం. కానీ ఒక మహిళను నిండు సభలో వలువలు ఊడ్పించినపుడూ, ఒక యువకుడిని నలుగురు చుట్టుముట్టి హత్య చేయడంలో భాగస్వామి అయినపుడూ రాని నైతిక మీమాంస యముని మహిషపు లోహ గంటలు మోగినపుడు రావచ్చునా?

త్రివిక్రమ్ శ్రీనివాస్ అనే సినీ మాటల రచయిత అంటరు 'మనవి కానప్పుడు విలువలు, మనవి అయినపుడు లెక్కలూ మాట్లాడితే చాలా బాగోదు', అని! కాబట్టి... అవినీతి, అనైతికతకు గుత్తేదారులు అయినవారు తమ స్వలాభం కోసం, సొంత అజెండా కోసం ఇతరులను నిందించినపుడు, కక్షలు సాధిస్తున్నపుడు, దానికోసం అన్ని వ్యవస్థలనూ నిర్లజ్జగా, బాహాటంగా ఉపయోగించుకుంటున్నపుడు మనం ఎవరిపక్కన నిలవాలో తెలియజెప్పేందుకు మన పురాణేతిహాసాల్లోని నిక్షిప్తాలు, ప్రక్షిప్తాలూ ఎన్నో ఉదాహరణలు ఇస్తయి మనకు. సునామీలా చుట్టుముట్టేసే అసమగ్ర, అసమాచార వాట్సాప్ వర్సిటీ ప్రాయోజిత ప్రసారాల్లో కొట్టుకుపోయేపుడు ఈ వివేచన గడ్డిపోచలా మనకు సాయపడుతది. ఏటికి ఎదురీదే ఉలిపికట్టెలా మనను మనం నిలుపుకొనే సందర్భాలూ ఇలాంటివే.

తెలంగాణ ఉద్యమకారిణి, జాగృతి వ్యవస్థాపకురాలు, ఎమ్మెల్సీ కవితను అవినీతి పేరుతో టార్గెట్ చేయడాన్ని మనం ఇట్లనే లోతుగా విశ్లేషించుకుంటే సూక్ష్మం బోధపడుతది. కవిత గురించి రాసేటపుడు సీఎం కేసీఆర్ కూతురు అని మొదలుపెట్టడం అంటేనే ఆమె ఎందుచేత టార్గెట్ అయిన్రు అనేది స్పష్టపడుతది.

'మీరు భ్రష్టు పట్టించిన ఈ దేశాన్ని గాడిలో పెడుతా; తెలంగాణలో లాగ దేశమంతా 24 గంటలు కరెంటు ఇస్తా; ఇంటింటికీ రక్షిత తాగునీరు ఇస్తా; ప్రతి ఎకరానికీ కడుపు నిండా సాగునీరు ఇస్తా; జాతీయ జెండాలు చైనాలో కాదు మన గల్లీల్లో తయారు చేపిస్తా; మీరు తెగనమ్ముతున్న ఎల్ఐసీ, సింగరేణిలు సహా మన జాతిసంపదను ప్రజల పరం చేస్తా; తెలంగాణ వడ్లు పండిస్తే వద్దని, కొనబోమని బెదిరించి ఇపుడు దేశంలో ఆహారధాన్యాల కొరత వస్తున్నదని చెప్పే మీ దార్శనికత లేమి నుంచి దేశాన్ని విముక్తం చేస్తా; అసలైన అర్థంలో హైందవ ఆధ్యాత్మికత, తాత్వికతకు ప్రపంచంలో గుర్తింపు తెస్తా; నాలుగేండ్లు కాంట్రాక్టు ఉద్యోగమిచ్చి ఆ తర్వాత రోడ్డు మీద పడేయకుండా మన యువతకు భద్ర జీవితం ఇచ్చే ప్రణాళికలు రచిస్తా; పుట్టినప్పటి నుంచి కట్టెకాలే వరకూ మహిళలను కంటికి రెప్పలా కాపాడుకునే చట్టబద్ధ పాలన అందిస్తా; బహుజనుల జీవితాలను కాన్షీరాం చూపిన వెలుగులో ప్రగతిమార్గం పట్టిస్తా; ఒక్కమాటలో... అంబేద్కర్ పేరు సచివాలయానికి పెట్టడమే కాదు, ఆయనను గుండెలో దాచుకొని, రాజ్యాంగ పీఠికలోని ప్రతి అంశమూ మ్యానిఫెస్టోగా పనిచేస్తా... ఇందుకే బీఆర్ఎస్..' అని రణన్నినాదం చేసిండు కేసీఆర్.

> ఈడీజీ అలియాస్ మోడీజీ... ఈ క్షణంలో కూడా బీజేపీలో కవిత జాయిన్ అయితే ఇంక ఆమెపై కేసూ ఉండదు, విచారణా ఉండదన్నది మీకూ నాకూ ఈ దేశంలోని ప్రతి ఒక్కరికీ తెలుసు. కాషాయ కండువా కప్పుకొంటే వెంటనే ఆమె ఫ్లయిట్ ఎక్కి హైదరాబాద్ వచ్చేయొచ్చు. ఇది ఊహాగానమూ కాదు, కవితను వెనకేసుకురావడమూ కాదు. ఆమెతో బీజేపీ అలాంటి ప్రయత్నం చేసింది గతంలో. ఏక్‌నాథ్ షిండేకు తెలంగాణ రూపం కవిత అనుకున్నది బీజేపీ. కానీ, ఆ పాచిక పారలేదు. ఇదిగో, అసలు విషయం ఇదీ!

ఇదిగో ఇక్కడ కాలింది బీజేపీకి. కాళింది మడుగులో కాళీయుడిలాగ రెచ్చిపోతున్నరు. ఎక్కి తొక్కేవాడి ఉగ్రరూపం ముందున్నది! రాముడి పేరు చెప్పుకొని కాయలు అమ్ముకునే వారి బండారం బీఆర్ఎస్ వచ్చినంక ఇంకా ఇంకా బయటపడుతున్నది. కేసీఆర్‌కు దేశవ్యాప్తంగా దక్కుతున్న ఆదరణ, పెరుగుతున్న మద్దతు చూసినంక బీజేపీకి నిద్రపట్టడం లేదు.

> కేసీఆర్‌ను దెబ్బతీయాలనే ఒకే ఒక్క లక్ష్యంతో పనిచేస్తున్నరు. ఆయన ప్రభుత్వాన్ని కూల్చడానికి దొంగ స్వాములను పంపిన్రు. ఆయన వారిని వలవేసి పట్టుకొని చిప్పకూడు తినిపించిన్రు. దేశంలో తొమ్మిది రాష్ట్రాల్లో పారిన పాచిక ఇక్కడ తిరగబడింది. దాంతో బీజేపీ అహం మరింత దెబ్బతిన్నది. దేశవ్యాప్త ప్రముఖ నాయకులతో కలిసి మోదీపై లేఖాస్త్రం సంధించిన్రు కేసీఆర్. కాళ్ల కింద నేల కదిలే భయవిహ్వలత ఆవహించింది వారికి.

కాబట్టే కేసీఆర్ కూతురు కవిత టార్గెట్ అయిన్రు! వేరే కారణమేమీ లేదు. మిత్రులారా.. ఈ వ్యాసం శీర్షిక ప్రకారం కొంచెం ఓపెన్‌గా మాట్లాడుకుంటే లిక్కర్ స్కామ్ ఒక స్కామే కాదు. బోడి వందకోట్ల అంశం ఒక అంశమా? మోదీ, ఆయన మిత్రులూ దోచేసిన లక్షల కోట్ల అవినీతి ముందు ఢిల్లీలో జరిగింది స్కామ్ అంటే ప్రజలు నవ్విపోరూ? మోదీజీ మీరు రోజూ పొద్దున్న తినే ఇంపోర్టెడ్ తైవాన్ పుట్టగొడుగులతో కలిపి మింగేసే ఎంగిలిలా మీ అవినీతి, మీ అనైతికత, మీ సర్వభ్రష్టత మీకు కమ్మగా ఉన్నది కదూ?

ప్రజలు, నాయకులు, మేధావులూ ఆలోచించాలి. కేసీఆర్‌పై కోపంతోనో, కల్వకుంట్ల కుటుంబంపై జెలసీతోనో అభిప్రాయాలు ఏర్పరచుకోకూడదు. బీజేపీ అక్రమ పద్ధతులు ఆర్థిక అవినీతికంటే వేల రెట్లు ప్రమాదకరం. అదానీ రూపంలో లక్షల కోట్ల రూపాయలు సాధారణ మదుపుదారుల సొమ్మును కాజేసిన వారిని ఈడీ ఎందుకు పట్టించుకోదు? ఎస్‌బీఐ, ఎల్ఐసీ నిర్వాహకులను ఎందుకు బోను ఎక్కించదు? బీజేపీలో చేరిన నాయకులను ఎందరెందరినో ఎందుకు వదిలిపెట్టింది? రెక్కలు ముక్కలు చేసుకొని ఈ దేశ సంపదను పెంచుతున్న సామాన్య ప్రజలను జీఎస్టీ పేరుతో దోపిడీ చేయడం కాదా అవినీతి? కార్పొరేట్ గద్దలకు దోచిపెట్టిన మొత్తంలో ఒకటో వంతు కూడా కాని ప్రజాధనాన్ని వివిధ సంక్షేమ రూపాల్లో ప్రజలకు అందిస్తే అవి 'ఉచితాలు' అని ఏడవడం, వాటిని బంద్ చేయాలని సొల్లు వాగడం కాదా అనైతికత? కరెంటు, నీళ్లు, ఉద్యోగాలు, ఆత్మగౌరవాల్లో తన రాష్ర్టాన్ని నెంబర్ వన్‌గా నిలబెట్టాలని తపన పడుతున్న ప్రభుత్వాన్ని ఆర్థిక ఇబ్బందులకు గురిచేయడం, తమ కక్షసాధింపు వల్ల ప్రజలే ఇబ్బంది పడుతరన్న ఎరుకలేని తనం కాదా అరాచకం? దేశంలో రూపాయి పతనం, విదేశాల్లో దేశ ప్రతిష్ఠ పతనం కాదా దేశద్రోహం? ఈ దేశానికి శిరోధార్యమైన గాంధీ విలువలను సబర్మతీ తీరాన పూడ్చిపెట్టి, ఆయన హత్యను కూడా కీర్తించడం కాదా కుసంస్కారం?

ఎన్టీఆర్ పాట 'మనలో పాపం చేయనివాడే ఆ రాయి విసరాలి... ఏ లోపం లేనివాడే ఆ శిక్ష విధించాలి' గుర్తుంది కదా మీకైనా? ఆ వెలుగులో చూస్తే ఇపుడు మోదీ ప్రహసనం ఎంత వికృతమెంత వైపరీత్యమెంత హాస్యాస్పదం? బీజేపీకి లొంగక కేసీఆర్ స్థయిర్యాన్ని పెంచినందుకు, బీఆర్ఎస్ రూపంలో దేశానికి తెలంగాణ లాంటి శ్రేయోరాజ్యం సాకారం చేయగల నాయకునిగా ఆయన గరిమ పెంచుతున్నందుకు కవితకు అభినందనలు. కేసులు, శిక్షలు, చట్టబద్ధ మార్గాలకు స్వాగతం పలుకుతూనే... ఈ ప్రాసెస్‌కు తూట్లు పొడిచే నయవంచనను ఎదిరిద్దాం! కవితకు, కేసీఆర్‌కు అండగా ఉండటం అంటే యుద్ధ నియమాల ప్రకారం న్యాయం వైపు ఉండటం. మనకు రాముడు, కృష్ణుడు చెప్పింది ఇదే.

'When dictatorship is a fact, revolution becomes a right' అంటరు 19వ శతాబ్దపు ఫ్రెంచ్ రచయిత, తాత్వికుడు విక్టర్ హ్యూగో. ఇపుడు దేశమంతా విప్లవం రావాల్సి ఉన్నది. ఇది కల్వకుంట్ల కుటుంబ స్వవిషయం కాదు, వసుధైక కుటుంబ సాధనా యజ్ఞంలో భాగం! ఆలోచించండి. గత తొమ్మిదేళ్లుగా ఆర్థికంగా మిమ్మల్ని రాచిరంపాన పెట్టిన దోపిడీదారుల గురించి కొంచెం సీరియస్‌గానే ఆలోచించండి. అసలైన అవినీతిపరులను, అనైతిక సామ్రాట్టులను ఎట్లా ఏరిపారేయాలో మనసు పెట్టి ఆలోచించండి. జై భారత్!

బీజేపీని ఎన్నటికీ నమ్మరు

బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం మేమే అని చెప్పుకోవడమే కాదు, ఏకంగా 2023లో తెలంగాణలో అధికారంలోకి వస్తామనే భ్రమల్లో బీజేపీ నాయకులు ఉండటం హాస్యాస్పదం. కేంద్రంలోని బీజేపీ రాష్ట్రంలో బీజేపీ చేరికల కమిటీ అని ఒకటి ఏర్పాటుచేసి దానికి ఈటల రాజేందర్‌ను చైర్మన్‌గా నియమించింది. విడ్డూరమేమంటే దేశంలో ఏ రాజకీయ పార్టీకి, ఇప్పటివరకు ఇలాంటి కమిటీ లేదు. బీజేపీ కొత్తగా 'చేరికల కమిటీ' అని వేసి, ఆస్తుల రక్షణ కోసం బీజేపీలోకి వలస వచ్చిన ఈటెల రాజేందర్‌ను దానికి చైర్మన్‌గా నియమించడం మరీ విచిత్రం. తెలంగాణలోని ఇతర పార్టీల్లో ఉన్న అసంతృప్తులను బెదిరించి, సీబీఐ, ఐటీ దాడుల ద్వారా లొంగదీసుకోవడం, లేదంటే డబ్బు ఎరజూపి కొనడం ఈ బీజేపీ చేరికల కమిటీ చేసే పని.



ఓ.నరసింహారెడ్డి
80080 02927



ఆస్తుల రక్షణ కోసమో, లేక ఆ పార్టీ బెదిరింపులకు లోబడో కొందరు నాయకులు బీజేపీలో చేరుతున్నారు. అయితే అలా చేరినవారు ఆ పార్టీలో ఇమడలేక మళ్లీ బయటకు వస్తుండటం ఆ పార్టీ అంతర్గత వివాదాలను స్పష్టం జేస్తున్నది. నాగం జనార్దన్‌రెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఒక ఫోరం ఏర్పాటుచేసుకొని, తర్వాత కాంగ్రెస్‌లో చేరారు. ఇనుగాల పెద్దిరెడ్డి, మోత్కుపల్లి నర్సింహులు, స్వామి గౌడ్, దాసోజు శ్రవణ్ తదితరులు బీజేపీలోని అంతర్గత కుమ్ములాటలను తట్టుకోలేక బయటకువచ్చారు. 2014లో అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీతో పొత్తు పెట్టుకున్న బీజేపీ 5 ఎమ్మెల్యే స్థానాలను గెలిచింది. అవే ఎన్నికల్లో బీఆర్ఎస్ సొంతంగా 63 స్థానాలను గెలిచింది. 2018 తర్వాత తెలంగాణలో జరిగిన 5 ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ 3, బీజేపీ 2 స్థానాలు అభ్యర్థుల వ్యక్తిగత బలం వల్లే గెలిచింది. ఆ పార్టీకి నాగార్జునసాగర్, హుజూర్‌నగర్‌లలో డిపాజిట్ కూడా దక్కలేదు. భావోద్వేగాలను రెచ్చగొట్టడం, మతం పేరుతో ప్రజలను చీల్చడం, విద్వేష రాజకీయాలు చేయడమే బీజేపీ పని. 250 ఏండ్ల కిందట జరిగిన దాడులకు, నేడు దేశంలో ఉన్న ఒక మతం ప్రజలను బాధ్యులుగా చేయడం ఎంతవరకు సబబు?

ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం తొమ్మిదేండ్లలో అన్నిరంగాల్లో అద్భుతమైన ప్రగతిని సాధించింది. 2014లో రూ.1,24,000 ఉంటే ఇప్పుడు అదే తలసరి ఆదాయం రూ.3,17,000. 2014కు ముందు విద్యుత్ ఎప్పుడు పోయేదో, ఎప్పుడు వచ్చేదో తెలియదు. ఇప్పుడు రాష్ట్రంలో 24 గంటలు నిరంతరాయంగా విద్యుత్ అందుతున్నది. 2020-21లో తెలంగాణ రైతాంగం ఏకంగా 3 కోట్ల టన్నుల వరి ధాన్యం పండిస్తే కేంద్రం కొనలేక చేతులెత్తేసింది. టీఎస్ ఐపాస్ ద్వారా దాదాపు 3 లక్ష ల కోట్ల పెట్టుబడులు రాగా, 19 లక్షల మం ది ఉపాధి పొందారు. తెలంగాణకు బీజేపీ చేసినంత ద్రోహం మరే పార్టీ చేయలేదు. విభజన చట్టంలోని కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు కర్మాగారం, గిరిజన యూనివర్సిటీ, అసెంబ్లీ సీట్ల పెంపు, కృష్ణానదిలో తెలంగాణ నీటి వాటా, వెనుకబడిన జిల్లాలకు నిధులు తొమ్మిదేండ్ల తర్వాత కూడా అమలుచేయలేదు. స్వయంగా కేసీఆర్, మంత్రులు ఢిల్లీ వెళ్లి కేంద్రమంత్రులకు విన్నవించినా ఫలితం దక్కలేదు.

తెలంగాణలో ప్రభుత్వం, అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లలో జోడించి సుపరిపాలనను అందిస్తున్నది. కొన్ని అద్భుత విధానాలను రూపొందించి మంచి ఫలితాలను సాధించింది. వ్యవసాయం కావచ్చు, టీఎస్-ఐపాస్ కావచ్చు, జల విధానం కావచ్చు, సంక్షేమ పథకాలు కావచ్చు. గురుకుల విద్యావిధానం కావచ్చు.. ఈ అభివృద్ధి సరిగా లేదంటే బీజేపీ వద్ద ఉన్న డెవలప్‌మెంట్ మోడల్ ఏమిటో ప్రజలకు వివరించండి. అంతేకానీ తిట్ల పురాణమే మా సిద్ధాంతం, వ్యక్తిగత దూషణలే మా విధానం అంటే బీజేపీని నమ్మే పరిస్థితిలో తెలంగాణ ప్రజలు లేరు.

మునుగోడు ఉప ఎన్నికల్లో ఓడిన తర్వాత ఎవరూ నోరు మెదపడం లేదు. ఉప ఎన్నికకు ముందు నెలలో ప్రభుత్వాన్ని కూల్చేస్తాం, జైలుకు పంపుతాం, వాళ్లు టచ్‌లో ఉన్నారు, వీళ్లు టచ్‌లో ఉన్నారని 30 మంది ఎమ్మెల్యేలు అమిత్ షా సమక్షంలో చేరుతారని ఊదరగొట్టింది బీజేపీ. బండి సంజయ్‌ది ఓ గ్రూపు, కిషన్‌రెడ్డిది మరో గ్రూపు, ఈటెలది ఇంకో గ్రూపు. ఆత్మను చంపుకొని అవసరాల కోసం బీజేపీలో చేరిన ఈటెల పరిస్థితి డోలాయమానంగా ఉన్నది. ఆయన ఎంతకాలం ఆ పార్టీలో ఉంటాడో తెలియని పరిస్థితి.

అదానీ స్కాం దేశాన్ని కుదిపేయగా, మోదీ, బీజేపీని ప్రతిష్ఠ దిగజార్చింది. అదానీతో సంబంధం లేదంటున్న బీజేపీ జేపీసీ కమిటీ ఎందుకు వేయడం లేదు. సామాన్యుల సొమ్ము 12 లక్షల కోట్లు ఆవిరైపోయినా, తన ఆప్తమిత్రుడు అదానీని కాపాడేందుకే మోదీ సిద్ధమయ్యారు.

> విపక్షాలను లొంగదీసుకునేందుకే ఢిల్లీ ఉప ముఖ్యమంత్రిని సీబీఐ విచారణకు పిలిచి, అరెస్టు చేశారు. బీజేపీకి శివసేన, అకాలీదళ్, జేడీయూ దూరమై సీబీఐ, ఈడీ, ఐటీ దగ్గరయ్యాయి. తాజాగా మార్చి, 10న ఢిల్లీ జంతర్‌మంతర్‌లో 'మహిళా రిజర్వేషన్' కోసం ఒక్కరోజు దీక్ష తలపెట్టిన ఎమ్మెల్సీ కవితకు ఈడీ నోటీసులు పంపడం అత్యంత ఖండనీయం. బీజేపీ అభద్రతా భావంలోకి కూరుకుపోతున్నదని దీన్నిబట్టే తెలుస్తున్నది.

రాష్ట్రంలో ఎన్నికలకు 10 నెలల సమయం మాత్రమే ఉండగా బీజేపీకి మాత్రం అభ్యర్థులు కరువయ్యారు. ఇతర పార్టీల నుంచి బీజేపీలో చేరడానికి ఎవరూ సిద్ధంగా లేరు. మేధావులు, ప్రజలు వైరుధ్యాలను అధ్యయనం చేసి, అప్రజాస్వామిక పాలన కొనసాగిస్తున్న బీజేపీని ఓడించకపోతే దేశం వందేండ్లు వెనక్కిపోతుంది. ఇప్పటికే సమాజానికి బీజేపీ చేసిన నష్టం పూడ్చాలంటే ఒక తరం పడుతుంది.

(వ్యాసకర్త: రాజకీయ విశ్లేషకులు, ఉన్నత విద్యా మండలి మాజీ సభ్యులు)

2014 నాటి తమ ఎన్నికల ప్రణాళికలో 'వాతావరణం, మార్పులకు కాలుష్యానికి గురికాకుండా విస్తృత ఉపశమన చర్యలు చేపడుతాం. పర్యావరణ రక్షణార్థం ప్రపంచ దేశాలతో, పర్యావరణ సంస్థలతో కలిసి పనిచేస్తాం. బొగ్గు, వగైరా ఖనిజాల పొదుపు, భద్రతల మేనేజ్‌మెంట్ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తాం' అని రాసుకొన్నది బీజేపీ. కానీ గద్దెనెక్కిన దగ్గరి నుంచి, బీజేపీ ప్రభుత్వం తమ ఎన్నికల ప్రణాళికను పాటించకపోగా, యూపీఏ ప్రభుత్వం రూపొందించిన పర్యావరణ పరిరక్షణ చట్టాలకు తూట్లు పొడుస్తున్నది.

చెట్లు ఓట్ల కోసం కాదు



పాతూరి వెంకటేశ్వరరావు
98490 81889

ఇలా పర్యావరణ చట్టాలకు తూట్లు పొడుస్తూ ఉద్యమాలను, ఉద్యమకారులను అణచివేస్తూ, గత ఐదేండ్లలో 409 చ.కి.మీ. అటవీ భూములను కార్పొరేట్లకు కట్టబెట్టింది కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం.

హరితహారం: గీత 13-28 'విశ్వమంతటా ఈశ్వరుడు సమంగా నిల్చి ఉండుటను చూడగలిగిన జ్ఞాని, దేనిని హింసించినా, ఈశ్వరుని హింసించినట్లని గ్రహించగలడు' ఉదా: ప్రాణి మనుగడకు వివిధ అవయవాల రూపంలో దేహమంతటా నిలిచినట్లే.. జీవుల మనుగడ కోసం భూమి అంతటా సముద్రాలు- కొండలు- అడవులు- నదులు- చెరువులు- పొలాలు- నివాసాల రూపంలో నిలిచి ఉన్నాడు ఈశ్వరుడు. దీన్నే ప్రకృతి సమతూకమన్నారు శాస్త్రజ్ఞులు. ఈ సమతూకాన్ని కాపాడుకుంటుండాలన్న 'గీతా ప్రబోధాన్ని పాటిస్తున్న నేతల్లో ప్రథముడు తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్.


ఉదా: 33.3 శాతం ఉండాల్సిన అడవులు, విచక్షణారహితంగా నరికారు కాబట్టి తెలంగాణలో 19 శాతానికి పతనమైనట్లు పలు సర్వేల ద్వారా గుర్తించారు కేసీఆర్. అడవులు తరిగితే రాష్ట్ర ప్రజలు వర్షాభావం- వాయు కాలుష్యం- భూతాపం- భూ కంపాలు మొదలైన ప్రమాదాల బారినపడతారని గ్రహించారు. 'వృక్షో రక్షతి, రక్షితః!' అంటూ ప్రజలను, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వాధికారులను ప్రోత్సహిస్తూ ఇండ్ల ముందు- చేలగట్లు మీద- రోడ్ల పక్కన కార్యాలయాల చుట్టూ, ఖాళీ ప్రదేశాల్లో ఏడేండ్లలో 250 కోట్ల మొక్కలను నాటించారు. నాటడమే కాదు, వేసవిలో ట్యాంకర్ల ద్వారా నీళ్లు పోయించి, కంచె వేయించి వృక్షాలుగా అభివృద్ధి చేశారు. అడవుల్లోనూ ఖాళీలున్న చోటా పండ్ల చెట్లను నాటించారు. అవి కాపురాగానే గ్రామాల్లోని కోతులన్ని అడవిబాట పట్టాయి. ఆ పండ్ల చెట్లే నేడు 'మంకీ ఫుడ్ కోర్టులుగా' మారినయి. అడవుల రక్షణార్థం వాటి చుట్టూ కందకాలు తీయించి, బయటి పశువులు అడవులను మేయకుండా చేశారు. కందకాలలోని నీళ్లు అడవి జంతువులకు తాగునీరైంది. సీఎం కేసీఆర్ 'హరితహారాన్ని' నిరంతర ప్రక్రియగా రూపొందించే సంకల్పంతో గ్రామగ్రామాన నర్సరీలను పెంపొందింపజేస్తున్నారు. 'ఓట్లు రాల్చని చెట్లు ఎన్ని నాటితే ఏం లాభం?' అన్నట్టు చూస్తున్న ప్రజాప్రతినిధులతో 'హరితహారం' పథకానికి ఓట్లు రాలవ్, కానీ వర్షాలు మాత్రం కచ్చితంగా రాలుతయి! మీకు హామీ ఇస్తున్నా అంటూ ప్రోత్సహించారు.

భూమి నుంచి నీటిని తోడుకుంటున్న మనపై తిరిగి భూమికి నీరందించాల్సిన బాధ్యత కూడా ఉన్నదని, మన ఇళ్ల దగ్గర, వీధుల పక్కన ఇంకుడు గుంతలు నిర్మించి, చెరువులను పునరుద్ధరించి, తద్వారా భూగర్భ జలాలను పెంపొందించే ప్రణాళికలను కూడా రూపొందించారు కేసీఆర్. తత్ఫలితంగానే పుష్కల వర్షాలతో, పాడిపంటల సమృద్ధితో భారతదేశానికి మరో ధాన్యాగారంగా, దేశానికి అత్యధికంగా ఆదాయాన్నందిస్తున్న నాల్గవ రాష్ట్రంగా వర్ధిల్లుతున్నది తెలంగాణ.



తన రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు 'విశ్వనగరం'గా ఖ్యాతిని, 'వరల్డ్ గ్రీన్ సిటీ' జాతీయ అవార్డును కూడా సంపాదించుకున్నారు ముఖ్యమంత్రి కేసీఆర్. కానీ, నాడు తన గుజరాత్‌కు ముఖ్యమంత్రిగా కలుషిత రాష్ట్రంగానూ! నేడు ప్రధానిగా కాలుష్యరహిత దేశాల్లో తన భారతదేశానికి 180వ ర్యాంకును, మిక్కిలి కాలుష్యపూరిత 20 ప్రపంచ నగరాలలో 15 నగరాలున్న దేశంగా, తన దేశానికి; అత్యంత కాలుష్య నగరంగా తన దేశ రాజధాని ఢిల్లీకి, బోలెడంత అపఖ్యాతిని తెచ్చిపెట్టారు నరేంద్ర మోదీ. దీన్నిబట్టి రాజనీతిజ్ఞుడెవరో, రాజకీయ వ్యాపారి ఎవరో, దేశ ప్రజలు ఏ నేతను ఎందుకు రమ్మంటున్నారో? ఏ నేతను ఎందుకు పొమ్మంటున్నారో? ప్రజలకు స్పష్టంగా అర్థమవుతున్నది.

(వ్యాసకర్త: సీనియర్ జర్నలిస్టు)



> 'జ్ఞానాన్ని ఆర్జించకపోవటం పశుత్వమే తప్ప మరొకటి కాదు. జ్ఞానార్జన ద్వారా మాత్రమే ఒక వ్యక్తి తన తక్కువ స్థాయిని వదిలేసి గొప్ప స్థాయికి చేరుకోగలుగుతాడు.'
>
> 'మేల్కొను, లేచి నిలబడు, చదువు.. సంప్రదాయాల సంకెళ్లను తెంచుకో.. విముక్తిని సాధించు'
>
> - సావిత్రీబాయి పూలే, ఆధునిక భారతదేశ తొలి ఉపాధ్యాయురాలు
>
> (నేడు వర్ధంతి)





మరోసారి సిసోడియా అరెస్ట్

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కేసులో అరెస్టై తీహార్ జైలులో ఉన్న మాజీ ఉప ముఖ్యమంత్రి మనిష్ సిసోడియాను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) గురువారం ఇదే కేసులో మనీ లాండరింగ్ ఆరోపణలతో అరెస్ట్ చేసింది. సిసోడియా బెయిల్ పిటిషన్ శుక్రవారం విచారణకు రానున్న ఒక రోజు ముందు ఈ అరెస్ట్ చేయడం గమనార్హం. మద్యం పాలసీలో అక్రమాలకు పాల్పడ్డారంటూ సిసోడియాను సీబీఐ గత నెల అరెస్ట్ చేయగా తీహార్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ఇదే కేసుకు సంబంధించి హవాలాకు పాల్పడ్డారంటూ ఈడీ ఆయనను మంగళవారం జైలులో ఐదు గంటల పాటు ప్రశ్నించింది. గురువారం కూడా కొద్దిసేపు ప్రశ్నించిన ఈడీ.. సిసోడియాను అరెస్ట్ చేస్తున్నట్టు ప్రకటించింది.

బెయిల్ వస్తుందన్న భయంతోనే..

సిసోడియాను ఈడీ అరెస్ట్ చేయడంపై ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ తీవ్రంగా స్పందించారు. 'లిక్కర్ కేసులో సిసోడియాను తొలుత సీబీఐ అరెస్ట్ చేసింది. ఆయన ఇంటిపై చేసిన దాడిలో సీబీఐకి ఎలాంటి నగదు, ఆధారాలు కాని లభ్యం కాలేదు. శుక్రవారం సిసోడియా బెయిల్ పిటిషన్ విచారణకు ఉన్నది. ఆయన బెయిల్‌పై విడుదల కానున్నారు. దీంతో ఈడీ ఇప్పుడు సిసోడియాను అరెస్ట్ చేసింది. రోజుకో కేసు బనాయించి ఆయనను జైలులో ఉంచడమే వారి ఏకైక లక్ష్యం. వారికి ప్రజలే తగిన సమాధానం ఇస్తారు' అని కేజ్రీవాల్ ట్వీట్ చేశారు.

కీలుబొమ్మల కిరికిరి దాడులు

విమర్శిస్తే ఈడీ

ఎదురు తిరిగితే సీబీఐ

దారికి తెచ్చుకోవాలంటే ఈడీ ప్లస్ సీబీఐ

ప్రతిపక్ష పార్టీల నాయకుల మీద రాజకీయ ప్రతీకార దాడుల కోసం గడిచిన తొమ్మిదేండ్లలో బీజేపీ అనుసరిస్తున్న ఫార్ములా ఇది.

- విపక్ష పార్టీల నేతలే లక్ష్యంగా ఈడీ, సీబీఐ వేధింపులు
- మొత్తం కేసుల్లో 95% విపక్ష నాయకులపైనే
- నేరారోపణలు రుజువైంది మాత్రం 0.5% కంటే తక్కువే
- విపక్షాలను రాజకీయంగా దెబ్బతీయడమే లక్ష్యంగా పావులు
- కమలం కండువా కప్పుకొంటే వెంటనే కేసులు మాయం



(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మార్చి 9 (నమస్తే తెలంగాణ): 2014 నుంచి ఇప్పటివరకు ఈడీ, సీబీఐ ఫైల్ చేసిన కేసుల్లో 95 శాతం ప్రతిపక్ష నాయకులు, వారి బంధువుల మీదే నమోదయ్యాయి. ఇందులో 0.46 శాతం కేసులే రుజువయ్యాయి. ప్రతిపక్ష నాయకులను ప్రజాక్షేత్రంలో దెబ్బతీయడానికి, రాజకీయంగా కుంగదీయగడానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ఈ కేసులను నమోదు చేస్తున్నట్టు అర్థమవుతున్నది. అప్పటివరకు కేసులు, దర్యాప్తు సంస్థల విచారణను ఎదుర్కొన్న నేతలు.. బీజేపీ తీర్థం పుచ్చుకోగానే సచ్ఛీలురుగా మారుతారు. అప్పటివరకూ దూకుడుగా వ్యవహరించిన ఈడీ, సీబీఐ హఠాత్తుగా కనిపించకుండాపోతాయి.

ఈడీ కేసులు .. విపక్ష పార్టీలపై ఇలా..

1.	కాంగ్రెస్-24
2.	టీఎంసీ-19
3.	ఎన్సీపీ-11
4.	శివసేన (ఠాక్రే)-8
5.	డీఎంకే-6
6.	బీజేడీ-6
7.	ఆర్జేడీ-5
8.	బీఎస్పీ-5
9.	ఎస్పీ-5
10.	టీడీపీ-5
11.	ఆప్-4
12.	ఐఎన్ఎల్డీ-3
13.	వైసీపీ-3
14.	సీపీఎం-2
15.	ఎన్సీ-2
16.	పీడీపీ-2
17.	అన్నాడీఎంకే-1
18.	ఎంఎన్ఎస్-1
19.	ఎస్బీఎస్పీ-1
20.	టీఆర్ఎస్-1
21.	స్వతంత్రులు-2

ఈడీ కేసులు ఎదుర్కొంటున్న ప్రముఖ విపక్ష నాయకులు



1. కాంగ్రెస్: సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, పీ చిదంబరం, కార్తీ చిదంబరం, పంజాబ్ మాజీ సీఎం చరణ్‌జిత్ చన్నీ సోదరుడు, రాజస్థాన్ సీఎం అశోక్ గెహ్లాట్ సోదరుడు, భూపేందర్ హుడా, ఓక్రం ఇబోబీ సింగ్, డీకే శివకుమార్
2. శివసేన (ఠాక్రే): సంజయ్ రౌత్, అనీల్ పరబ్, ఆనంద్ రావ్ అద్సుల్
3. ఎన్సీపీ: శరద్ పవార్, అజిత్ పవార్, నవాబ్ మాలిక్, అనిల్ దేశ్‌ముఖ్, ఛగన్ భుజ్‌బల్, ఏక్‌నాథ్ ఖడ్సే
4. టీఎంసీ: అభిషేక్ బెనర్జీ, మదన్ మిత్రా, ఫర్హాద్ హకీం, కునాల్ ఘోష్, సౌగతా రాయ్, పార్థ చటర్జీ
5. ఆర్జేడీ: లాలూ ప్రసాద్ యాదవ్, తేజస్వీ యాదవ్, మీసా భారతి
6. ఆప్: సత్యేంద్ర జైన్, మనీశ్ సిసోడియా
7. సీపీఎం: కొడియారి బాలకృష్ణన్ కుమారుడు
8. నేషనల్ కాన్ఫరెన్స్: ఫరూక్ అబ్దుల్లా
9. టీఆర్ఎస్: నామా నాగేశ్వర్‌రావు



సీబీఐ కేసులు .. విపక్ష పార్టీలపై ఇలా..

1.	తృణమూల్ -30
2.	కాంగ్రెస్-26
3.	ఆర్జేడీ-10
4.	బీజేడీ-10
5.	వైసీపీ-6
6.	బీఎస్పీ-5
7.	టీడీపీ-5
8.	ఆప్-4
9.	అన్నాడీఎంకే-4
10.	ఎస్పీ-4
11.	సీపీఎం-4
12.	ఎన్సీపీ-3
13.	డీఎంకే-2
14.	ఎన్సీ-2
15.	పీడీపీ-1
16.	టీఆర్ఎస్-1
17.	స్వతంత్రులు-1

సీబీఐ కేసులు ఎదుర్కొంటున్న ప్రముఖ విపక్ష నాయకులు

1. కాంగ్రెస్: కార్తీ చిదంబరం, డీకే శివకుమార్
2. ఆర్జేడీ: లాలూ ప్రసాద్ యాదవ్
3. బీఎస్పీ: మాయావతి
4. ఎస్పీ: ఆజంఖాన్
5. ఎన్సీపీ: అనిల్ దేశ్‌ముఖ్
6. తృణమూల్: అభిషేక్ బెనర్జీ, పార్థ చటర్జీ
7. ఆప్: మనీశ్ సిసోడియా

తొమ్మిదేండ్ల పాలనలో విపక్షాలపై బీజేపీ కక్షసాధింపులు ఇలా..

- ఈడీ, సీబీఐ ఫైల్ చేసిన మొత్తం కేసుల్లో ప్రతిపక్ష నాయకులపై నమోదైన కేసులు– 95%
- నమోదైన కేసుల్లో నిరూపణ జరిగి, శిక్షపడినవారు– 0.46%
- ఇంకా నిరూపణ కాని/ట్రయల్ దశలో ఉన్న కేసులు – 99.54%
- తొమ్మిదేండ్లలో ఈడీ పెట్టిన కేసులు – 121
- ప్రతిపక్ష నాయకులపై నమోదు చేసినవి –115
- తొమ్మిదేండ్లలో సీబీఐ నమోదు చేసిన కేసులు – 124
- ప్రతిపక్ష నాయకులపై నమోదు చేసినవి – 118
- పీఎంఎల్ఏ తదితర సెక్షన్ల కింద తొమ్మిదేండ్లలో ఈడీ పెట్టిన కేసులు – 5,422
- ప్రతిపక్ష నాయకులపై నమోదు చేసిన కేసులు – 5,150
- శిక్ష పడ్డవారు/రుజువైన కేసులు –25
- రాజకీయంగా దెబ్బతీయాలని, ప్రజల్లో ప్రతికూల సంకేతాలు వెళ్లాలన్న ఉద్దేశంతోనే విపక్ష నేతలపై ఈడీ, సీబీఐ కేసుల నమోదు
- గత పదేండ్ల యూపీఏ హయాంతో పోలిస్తే, 9 ఏండ్ల బీజేపీ హయాంలో విపక్షాలపై నమోదైన కేసులు – 27 రెట్లు ఎక్కువ

బీజేపీలో చేరాక వీరిపై కేసులు మాయం

1. **నారాయణ్ రాణె:** మనీలాండరింగ్ కేసులో ఈడీ వేటాడింది. 2017లో బీజేపీకి అనుబంధంగా సొంత పార్టీ పెట్టుకోవడంతో దాడులు ఆగాయి. కేంద్రమంత్రయ్యారు. 2019లో పార్టీని బీజేపీలో విలీనం చేశారు.
2. **సువేందు అధికారి:** పశ్చిమబెంగాల్‌కు చెందిన టీఎంసీ నేత. శారద మల్టీలెవల్ మార్కెటింగ్ కుంభకోణంలో 2014 నుంచి సీబీఐ పలుమార్లు ప్రశ్నించింది. 2020లో ఆయన బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. అప్పటినుంచీ విచారణ బంద్.
3. **హిమంత బిశ్వశర్మ:** శారద కుంభకోణంలో నిందితుడు. 2014 నవంబర్‌లో సీబీఐ ఆయన ఇంటిపై దాడులు చేసింది. 2015 ఆగస్టులో బీజేపీలో చేరారు. ఏకంగా అస్సాం సీఎం అయ్యారు.
4. **ముకుల్ రాయ్:** 2014లో బెంగాల్‌లో లంచాలు తీసుకోవటంపై సంచలనం సృష్టించిన శారద కేసులో నిందితుడు. సీబీఐ పలుమార్లు నోటీసులు ఇవ్వడంతో 2017లో బీజేపీలో చేరారు. విచారణ ఆగింది. పైగా 2021 మేలో ముకుల్‌రాయ్‌కి క్లీన్ చిట్ ఇచ్చింది. ఆ వెంటనే ఆయన మళ్లీ తృణమూల్‌లో చేరారు.
5. **జ్యోతిరాదిత్య సింధియా:** కాంగ్రెస్‌కు చెందిన జ్యోతిరాదిత్య సింధియాపై భూ ఆక్రమణ కేసులు నమోదయ్యాయి. 2020 మార్చి 10న ఆయన బీజేపీలో చేరగానే మధ్యప్రదేశ్ ఎకనామిక్స్ అఫెన్స్ వింగ్ ఈ కేసును మూసివేసింది.
6. **భావన గవ్‌లీ:** మహారాష్ట్రలోని ఠాక్రే శివసేనలో ఉన్నప్పుడు ఈడీ ఐదుసార్లు నోటీసులిచ్చింది. ఇప్పుడు ఏక్‌నాథ్ షిండే వర్గం శివసేన ఎంపీగా ఉన్నారు. పార్టీకి చీఫ్‌విప్‌గా కొనసాగుతున్నారు. ఈడీ కేసులు మరుగునపడ్డాయి.
7. **యశ్వంత్ జాదవ్:** యశ్వంత్ జాదవ్, ఆయన సతీమణి యామినీ జాదవ్‌పై ఫెమా ఉల్లంఘనల కింద ఈడీ కేసులు పెట్టింది. షిండే వర్గంలో చేరగానే ఆ కేసులు అటకెక్కాయి.
8. **ప్రతాప్ సర్‌నాయక్:** శివసేనలో ఉన్నప్పుడు మనీలాండరింగ్ ఆరోపణలతో ఈడీ కేసు నమోదు చేసింది. షిండే సేనలోకి రాగానే, కేసు ఊసేలేకుండా పోయింది.
9. **సుజనా చౌదరి:** టీడీపీకి చెందిన కేంద్ర మాజీ మంత్రి సుజనా చౌదరి ఇండ్లు, కంపెనీలపై 2018 నవంబర్‌లో ఈడీ, 2019 జూన్ 2న సీబీఐ దాడులు జరిగాయి. ఆయన వెంటనే ఢిల్లీ వెళ్లి జూన్ 20న బీజేపీలో చేరారు. ఆ తర్వాత దాడులు ఆగిపోయాయి.
10. **సీఎం రమేశ్:** టీడీపీకి చెందిన సీఎం రమేశ్‌పై 2018 అక్టోబర్‌లో ఐటీ, 2019 ఏప్రిల్‌లో ఈడీ దాడులు జరిగాయి. ఆయన కూడా సుజనా చౌదరితో కలిసి జూన్ 20న బీజేపీలో చేరారు. ఆ రోజు నుంచే దాడులు ఆగాయి.

డబుల్ ట్రబుల్ ఇంజిన్

నీ భర్త బతికే ఉన్నాడా?

బెంగళూరు: కర్ణాటక బీజేపీ ఎంపీ మునిస్వామి ఓ మహిళ పట్ల దురుసుగా ప్రవర్తించారు. నుదుట కుంకుమ ఎందుకు పెట్టుకోలేదని నిలదీశారు. మహిళా దినోత్సవం సందర్భంగా వనితలు తయారు చేసిన ఉత్పత్తులతో ఓ ప్రదర్శన ఏర్పాటు చేయగా మునిస్వామి సందర్శించారు. ఓ మహిళ వద్దకు వెళ్లిన ఆయన 'నుదుట కుంకుమ ఎందుకు పెట్టుకోలేదు. నీ భర్త బతికే ఉన్నాడా? డబ్బుల కోసం ఇతర మతాల్లోకి ఎందుకు మారుతున్నారు?'అన్నారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరలైంది. దీంతో పలువురు నెటిజన్లు ఎంపీ వ్యాఖ్యలపై భగ్గుమన్నారు.

గుజరాత్‌లో గూండాయిజం

గాంధీనగర్, మార్చి 9: గుజరాత్‌లో ఓ ఐఏఎస్ అధికారిని బంధించి దాడి చేశారు కొందరు దుండగులు. సబర్మతి నది తీరంలో చేపడుతున్న చేపల ప్రాజెక్టులను పరిశీలించడానికి ఐఏఎస్ అధికారి నితిన్ సంగ్వన్ సిబ్బందితో కలిసి వెళ్లారు. ఈ సందర్భంగా నితిన్‌తో ఓ కాంట్రాక్టర్ వాగ్వాదానికి దిగాడు. మాటామాటా పెరగడంతో తన అనుచరులతో కలిసి అధికారి నితిన్‌ను బంధించి, దాడి చేశాడా కాంట్రాక్టర్. విషయం పోలీసులకు తెలవడంతో కేసు నమోదు చేసి ముగ్గురిని అరెస్టు చేశారు. చేపల ప్రాజెక్టుల్లో అవినీతిని ప్రశ్నించినందుకే ఐఏఎస్ అధికారిపై దాడి జరిగినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు.

మొన్నటిదాకా తిట్టి.. ఇప్పుడు దోస్తీ కట్టి!

- మేఘాలయలో బీజేపీ తప్పుడు రాజకీయం
- ఎన్పీపీ అవినీతి సర్కారు అని ఆరోపణ
- అదే పార్టీతో కలిసి ప్రభుత్వం ఏర్పాటు



కాన్రాడ్ సంగ్మా



అమిత్ షా

స్పెషల్ టాస్క్ బ్యూరో

హైదరాబాద్, మార్చి 9 (నమస్తే తెలంగాణ): 'ఈశాన్యంలో అత్యంత అవినీతి ప్రభుత్వం ఏదైనా ఉన్నదంటే అది నేషనల్ పీపుల్స్ పార్టీ ప్రభుత్వమే' అని ఇటీవల మేఘాలయలో బీజేపీ అగ్రనేత, కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు ఇవి. కానీ, ఇప్పుడు అదే పార్టీతో కలిసి బీజేపీ అక్కడ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. గతంలో ఎన్పీపీ, యునైటెడ్ డెమోక్రటిక్ పార్టీ (యూడీపీ) సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. కానీ, ఈ సారి ఎన్నికల్లో మిత్రపక్షాని హ్యాండ్ ఇచ్చి బీజేపీ ఒంటరిగా పోటీ చేసింది. సొంతంగా అధికారంలోకి రావాలన్న బీజేపీ దుర్బుద్ధిని పసిగట్టిన ఎన్పీపీ అధినేత, మేఘాలయ సీఎం కాన్రాడ్ సంగ్మా కూడా ఆ పార్టీతో బంధాన్ని తెంచుకున్నారు. ఎన్నికల్లో బీజేపీకి రెండే రెండు సీట్లు దక్కాయి. ఎన్నికల ప్రచారంలో ఎన్పీపీ ప్రభుత్వాన్ని టార్గెట్ చేస్తూ బీజేపీ తీవ్రస్థాయిలో దుమ్మెత్తిపోసింది. ఇప్పుడు అదే పార్టీతో పొత్తు పెట్టుకొని ప్రభుత్వంలో చేరి మంత్రి పదవిని కూడా తీసుకొన్నది. అత్యంత అవినీతి ప్రభుత్వం అని తిట్టిన అమిత్ షాతో పాటు, ప్రధాని మోదీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సంగ్మా ప్రమాణస్వీకారానికి హాజరయ్యారు. స్వార్థ రాజకీయాల కోసం అవినీతి ఆరోపణలు చేయటం, అభియోగాలు మోపటం బీజేపీకి వెన్నతో పెట్టిన విద్య అని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.




ఉత్తరాది బీజేపీ నేతల 'ఫేకుడు'

తమిళనాడు సీఎం స్టాలిన్

చెన్నై, మార్చి 9: బీజేపీకి వ్యతిరేకంగా జాతీయ స్థాయిలో ఐక్య కూటమి అవసరం గురించి తాను మాట్లాడిన మరుసటి రోజు నుంచే వదంతుల వ్యాప్తి మొదలైందని తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ ఆరోపించారు. దక్షిణాదిలో వలస కార్మికులపై దాడులు జరిగాయని ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన బీజేపీ నాయకులు ఉద్దేశపూర్వకంగా వదంతులు పుట్టిస్తున్నారని, తప్పుడు వీడియోలతో ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. దాడుల ఘటనపై వెంటనే ఆరా తీయగా, అది అబద్ధమని తేలిందని పేర్కొన్నారు. బీహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్‌తో మాట్లాడానని, వారంతా క్షేమంగా ఉన్నారని హామీ ఇచ్చినట్టు వెల్లడించారు.

అమెరికాకు తుఫాను ముప్పు


- హెచ్చరికలు జారీ చేసిన ఆ దేశ యంత్రాంగం
- 2 వారాల రేషన్ సిద్ధంగా ఉంచుకోవాలని సూచన
- కాలిఫోర్నియాలో 1.75 కోట్ల మందిపై ప్రభావం



శాన్‌ఫ్రాన్సిస్కో, మార్చి 9: ఇటీవల ప్రకృతి వైపరీత్యాలతో అల్లాడుతున్న అమెరికాను మరో తుఫాను తాకనున్నది. గురువారం తుఫాను వచ్చే అవకాశం ఉన్నదని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కాలిఫోర్నియా ప్రాంత వాసులకు హెచ్చరికలు జారీ అయ్యాయి. తుఫాను కారణంగా భారీ వర్షాలతో పాటు పెద్దఎత్తున మంచు గడ్డలు కరిగి వరదలు సంభవించే ప్రమాదం ఉన్నదని అధికారులు తెలిపారు. రోడ్లపై నిలిచే నీటితో ప్రయాణానికి ఆటంకం ఏర్పడే అవకాశం ఉన్నదని, వేల గృహాలు, వాణిజ్య సంస్థలకు విద్యుత్తు సరఫరా నిలిచిపోవచ్చునని, లోతట్టు ప్రాంతాల వారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కాలిఫోర్నియా, శాన్‌ఫ్రాన్సిస్కో, సక్రమెంటో తీర ప్రాంతాలకు చెందిన 1.75 కోట్ల మందిపై ఈ తుఫాను ప్రభావం ఉంటుందని హెచ్చరికలు జారీ అయినట్టు సీఎన్ఎన్ వార్తా సంస్థ వెల్లడించింది. తుఫాను నేపథ్యంలో ఇండ్లలో ఉండే వారికి, వ్యాపారులకు మౌంటెరే కౌంటీలో పలు సూచనలు జారీ అయ్యాయి. కనీసం రెండు వారాలకు సరిపడా ఆహార పదార్థాలను సిద్ధంగా ఉంచుకోవాలని, వరద నుంచి రక్షణకు ఇసుక బ్యాగ్‌లను సిద్ధంగా ఉంచుకోవాలని బిగ్ సర్ ప్రాంతవాసులకు అధికారులు సూచించారు. కాగా వరదల పరిస్థితులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని మౌంటెరే కౌంటీ అగ్నిమాపక శాఖ చీఫ్ జాసన్ వెబర్ తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా రిజర్వాయర్లు పూర్తిగా నీటితో నిండాయని, ఇప్పుడు భారీ వర్షాలు కురిస్తే పెద్దమొత్తంలో వరద నీరు రోడ్లపైకి వచ్చి చేరే అవకాశం ఉన్నదని వెల్లడించారు. విపత్తును ఎదుర్కొనేందుకు సిబ్బంది అప్రమత్తంగా ఉన్నారని పేర్కొన్నారు.

హెచ్-1బీ ఉద్యోగులకు డిమాండ్

న్యూఢిల్లీ: హెచ్-1బీ వీసాదారులకు నిజంగా ఇది శుభవార్తే. ఇటీవల తొలగింపునకు గురైన ఉద్యోగులను చాలా అమెరికా కంపెనీలు తమ సంస్థల్లోకి తీసుకోవడం ప్రారంభించాయి. దాంతో ఇటీవల పరిణామాలతో తిరిగి స్వదేశాలకు వెళ్లిపోవాల్సిన గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్న హెచ్-1బీ వీసా ఉద్యోగులు ఊపిరి పీల్చుకుంటున్నారు. ఇటీవల ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఆర్థిక మాంద్యం పరిస్థితులు, ద్రవ్యోల్బణం భయాలతో పలు ప్రముఖ కంపెనీలు ఉద్యోగులను తొలగిస్తున్నాయి. ఇలా వేల మందిని ఉద్యోగంలోంచి హఠాత్తుగా తీసేయడంతో దేశంలోనే కాక అమెరికా లాంటి దేశాలలో పనిచేస్తున్న ఉద్యోగులకు కష్టాలు ఎదురయ్యాయి. అమెరికా వీసా నిబంధనల ప్రకారం హెచ్-1బీ వీసాపై ఉన్న వారు ఉద్యోగం కోల్పోయిన 60 రోజుల్లో మరో జాబ్‌లో చేరాలి. లేకపోతే వారి దేశాలకు తిరుగు ప్రయాణం అవ్వాల్సిందే. దాంతో వారంతా దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఈ సమయంలో వారిని కొత్త కంపెనీలు ఆహ్వానిస్తున్నాయి.



గాలి నుంచే నేరుగా కరెంట్!

సిడ్నీ: గాలిలో లభించే కొద్దిపాటి హైడ్రోజన్‌ను ఉపయోగించి విద్యుచ్ఛక్తిని తయారు చేయగల ఓ ఎంజైమ్‌ను ఆస్ట్రేలియాలోని మోనాష్ యూనివర్సిటీ పరిశోధకులు కనుగొన్నారు. ఇది గాలినుంచి విద్యుత్తును ఉత్పత్తి చేయగల పరికరాల అభివృద్ధికి మార్గం సుగమం చేస్తుందని పరిశోధకులు భావిస్తున్నారు. ఈ ఎంజైమ్ ఆధారిత విద్యుదుత్పత్తి పరికరంతో ఎప్పుడంటే అప్పుడు కరెంట్‌ను ఉత్పత్తి చేసుకోవచ్చని, అవసరం లేనప్పుడు మూసేయవచ్చని పరిశోధకులు చెప్తున్నారు. ఇది ఒక ఎలక్ట్రిసిటీ జనరేటర్‌లా పనిచేస్తుందని వివరించారు.

అంధకారం ముంగిట భారత్!

విద్యుత్తు కోతలతో విసిగివేసారిన గ్రామస్థులు.. ఏకంగా ఓ సబ్ స్టేషన్‌కే నిప్పుపెట్టారు.

– బీజేపీపాలిత మధ్యప్రదేశ్‌లోని దటోడా గ్రామంలో నిరుడు చోటుచేసుకొన్నదీ ఘటన

వేళాపాళాలేకుండా కరెంటు కోతలు, పవర్ హాలిడేలతో విసిగిపోయిన పారిశ్రామికవేత్తలు.. బెంగళూరు ఎలక్ట్రిసిటీ సప్లై కంపెనీ అధికారులకు కర్పూర హారతులు ఇచ్చి నిరసన తెలిపారు.

– గత మేలో బీజేపీపాలిత కర్ణాటకలో జరిగిందీ ఘటన

మరికొద్ది రోజుల్లో ఈ ఘటనలు పునరావృతం కావొచ్చు. కారణం.. దేశంలో కరెంటు కటకట మళ్లీ షురూ కానుండటమే!



- 18 నెలల్లో దేశంలో నాలుగోసారి విద్యుత్తు సంక్షోభం
- ఈ వేసవిలో మళ్లీ కరెంట్ కోతలు.. రాత్రిళ్లు నరకమే
- నిరుటి కంటే 6.4% ఎక్కువ విద్యుత్తు డిమాండ్
- 'డిమాండ్-సప్లై'పై ముందుచూపులేని కేంద్రం
- ఫలితం.. డజనుకు పైగా రాష్ట్రాల్లో విద్యుత్తు కోతలు?!

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మార్చి 9 (నమస్తే తెలంగాణ): దేశంలో కరెంటు కటకట మళ్లీ ముంచుకురానున్నది. వచ్చే నెలలో రాత్రి వేళల్లో పెద్దయెత్తున విద్యుత్తు కోతలు ఉండబోతున్నాయి. కరెంటు కోతలు ఈ ఒక్క వేసవికే పరిమితం కాబోవు.. రానున్న సంవత్సరాల్లో కూడా ఈ పరిస్థితి మళ్లీ కొనసాగవచ్చు. ఈ మేరకు ప్రఖ్యాత అంతర్జాతీయ వార్తాసంస్థ 'రాయిటర్స్' ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. గనుల నుంచి బొగ్గు నిల్వల వెలికితీత, ప్లాంట్ల నిర్వహణ, విద్యుదుత్పత్తి, డిమాండ్-సరఫరా పట్ల కేంద్రంలోని బీజేపీ సర్కారుకు ముందస్తు అవగాహన లేకపోవడమే ఈ విద్యుత్తు కోతలకు కారణంగా తెలుస్తున్నది. గడిచిన 18 నెలల వ్యవధిలో దేశంలో నాలుగు సార్లు విద్యుత్తు సంక్షోభం తలెత్తింది. రాయిటర్స్ నివేదిక ప్రకారం.. గత ఏడాది ఏప్రిల్‌తో పోలిస్తే వచ్చే నెలలో దేశవ్యాప్తంగా విద్యుత్తు వినియోగం 6.4 శాతం ఎక్కువగా ఉండనున్నది. అయితే, పీక్ డిమాండ్ 217 గిగావాట్ల కంటే 1.7 శాతం విద్యుత్తు లోటు ఉండనున్నట్టు నివేదిక అంచనా వేసింది. దీంతో రాత్రిళ్లు కరెంటు కోతలు తప్పవని హెచ్చరించింది. విద్యుత్తు కోతలతో దవాఖానలు, మెట్రో, ఆటో, ఎలక్ట్రానిక్స్, స్టీల్, పేపర్, ఎరువుల తయారీ కంపెనీలపై తీవ్ర ప్రభావం పడనున్నట్టు వెల్లడించింది. ఈ మేరకు గ్రిడ్‌లకు సంబంధించి కొన్ని పత్రాలను విశ్లేషించినట్టు వివరించింది.

వచ్చే వేసవిలో విద్యుత్తు సరఫరా విషయంలో కొంత సమస్య ఉన్నది. ఇది ఒత్తిడిని కలిగిస్తున్నది.

– గ్రిడ్ కంట్రోలర్ ఆఫ్ ఇండియా లిమిటెడ్

పేపర్ మిల్లులో ఒక్క నిమిషం కూడా విద్యుత్తు సరఫరా నిలిచిపోయినా కాగితం బ్లాక్ అవుతుంది. వేల రూపాయల నష్టం వాటిల్లుతుంది.

– పీజీ ముకుందన్ నాయర్, ఇండియన్ పేపర్ ఇండస్ట్రీ మాజీ చీఫ్

ఇప్పుడు ఎలా??


కిందటేడాది గరిష్ఠ విద్యుత్తు డిమాండ్-207 గిగావాట్లు

అప్పుడు గరిష్ఠంగా సరఫరా విద్యుత్తు –187 గిగావాట్లు

వచ్చే నెల అవసరమయ్యే గరిష్ఠ విద్యుత్తు డిమాండ్-217 గిగావాట్లు

గత మేలో విద్యుత్తు సంక్షోభం ఇలా..

విద్యుత్తు కోతలు ఎదుర్కొన్న రాష్ట్రాలు	16
దేశంలో మొత్తం థర్మల్ ప్లాంట్లు	269
బొగ్గు కొరతతో ఉత్పత్తిని నిలిపేసిన ప్లాంట్లు	109
బొగ్గు నిల్వలు కనిష్ఠస్థాయికి చేరిన ప్లాంట్లు	122



పర్యవేక్షణ గాలికి..

దేశంలోని 70 శాతం విద్యుత్తు అవసరాలను బొగ్గు తీరుస్తున్నది. దీన్ని అర్థం చేసుకోకుండా సోలార్ పవర్‌పై మొగ్గు చూపిన బీజేపీ ప్రభుత్వం.. ఆ దిశగా కూడా సరైన చర్యలు చేపట్టట్లేదు. ఇప్పటికిప్పుడు అవసరాలను తీరుస్తున్న బొగ్గు, హైడ్రో పవర్ జనరేషన్‌ను పట్టించుకోవట్లేదు. బొగ్గు వెలికితీత, పవర్ ప్లాంట్లకు బొగ్గు సరఫరా పర్యవేక్షణను గాలికొదిలేసింది.

విద్యుత్తు కోతలు ఉండకుండా చూడండి

వేసవిలో అంతరాయాలు లేకుండా విద్యుత్తు సరఫరాకు చర్యలు తీసుకోవాలని కేంద్ర విద్యుత్తు శాఖ మంత్రి ఆర్కే సింగ్ విద్యుత్తు సరఫరా సంస్థలను ఆదేశించారు. విద్యుత్తు సంస్థలతో జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ.. వేసవిలో ముఖ్యంగా ఏప్రిల్-మేలో విద్యుత్తుకు డిమాండ్ అధికంగా ఉంటుందని, దీన్ని దృష్టిలో ఉంచుకొని విద్యుత్తు సరఫరాలో ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. రాష్ట్రాలు, కేంద్రాలకు బొగ్గు కేటాయింపులో నిజాయితీ, పారదర్శకంగా వ్యవహరించాలని సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అధికారులను ఆదేశించారు. డిమాండ్-సప్లై మధ్య అంతరాన్ని అధిగమించడానికి బహుళ వ్యూహాత్మక విధానాన్ని అమలు చేయాలన్నారు.

25న శ్రీవారి కానుక బియ్యం వేలం

హైదరాబాద్, మార్చి 9 (నమస్తే తెలంగాణ): తిరుమల శ్రీవారి ఆలయంతోపాటు ఇతర అనుబంధ ఆలయాలకు హుండీ ద్వారా భక్తులు కానుకగా సమర్పించిన బియ్యాన్ని ఈ నెల 25న వేలం వేయనున్నట్టు తిరుమల తిరుపతి దేవస్థానం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ మేరకు 11,640 కిలోల బియ్యానికి టెండర్లను ఆహ్వానిస్తున్నట్టు పేర్కొన్నది. ఆసక్తిగల వారు ఈ నెల 25లోపు 'కార్యనిర్వహణాధికారి, టీటీడీ' పేరుతో రూ.2,500 డీడీ తీసి, సీల్డ్ టెండర్‌ను తిరుపతిలోని మార్కెటింగ్ విభాగం, జనరల్ మేనేజర్ (వేలం) కార్యాలయంలో సమర్పించాలని టీటీడీ అధికారులు పేర్కొన్నారు. అదేరోజు సాయంత్రం టెండర్లను తెరుస్తామని, ఇతర వివరాల కోసం తిరుపతిలోని టీటీడీ మార్కెటింగ్ కార్యాలయ ఫోన్ నంబర్ 0877-2264429లో సంప్రదించాలని పేర్కొన్నారు.

శ్రీవారికి బ్యాటరీ వాహనం విరాళం

ఐడీబీఐ బ్యాంక్ డైరెక్టర్ రాకేశ్‌శర్మ గురువారం ఉదయం టీటీడీకి సుమారు రూ.7.67 లక్షల విలువైన 6 సీట్లు కలిగి బ్యాటరీతో నడిచే వాహనాన్ని విరాళంగా అందించారు. శ్రీవారి ఆలయం ముందు వాహనానికి పూజలు నిర్వహించిన అనంతరం బ్యాంకు ప్రతినిధులు శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో రమేశ్‌బాబుకు వాహన తాళాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో తిరుమల డీఐ జానకీరామారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓ నక్షత్రం చుట్టూ నీటి అణువులు!

- **తేలనున్న మన సౌర వ్యవస్థ నీటి గుట్టు**

శాంటియాగో, మార్చి 9: కోట్ల ఏండ్ల క్రితం మన సౌరవ్యవస్థలో నీళ్లు ఎలా ఉద్భవించాయి? అనే మిస్టరీ వీడనున్నది. ఇందుకోసం మన సమీప నక్షత్ర వ్యవస్థ సహాయం చేస్తున్నది. ఈ వ్యవస్థలోని 'వీ883 ఓరియోనిస్' అనే కొత్త నక్షత్రం చుట్టూ ఖగోళ పరిశోధకులు నీటి అణువులను గుర్తించారు. పరిశోధకులు ఉత్తర చిలీలోని అటకామా లార్జ్ మిల్లీమీటర్/సబ్ మిల్లీమీటర్ అరే ఆఫ్ టెలిస్కోప్‌ల శ్రేణిని ఉపయోగించి 1,300 కాంతి సంవత్సరాల దూరంలో ఉన్న ఈ నక్షత్రాన్ని గమనించారు. ఈ నక్షత్రం పుట్టినప్పటి నుంచీ దాని చుట్టూ ధూళి, మేఘం, వాయువులతో కూడిన గ్రహం ఏర్పడినట్టు గుర్తించారు. చివరికి మిలియన్ ఏండ్లలో ఈ గ్రహం తోకచుక్కలు, గ్రహశకలాలు, గ్రహాలుగా రూపాంతరం చెందుతుందని అంచనా వేశారు. ఈ గ్రహాన్ని ఏర్పరిచిన డిస్క్‌లో రసాయన సంకేతాల ద్వారా నీటి ఆవిరి, గ్యాసియస్ వాటర్ (వాయురూపంలో నీరు) ఉన్నట్టు గుర్తించారు. ఈ అధ్యయన ఫలితాలు 'నేచర్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.



జగిత్యాల జిల్లా ధర్మపురి పోలీస్ స్టేషన్‌లో లక్ష్మీనరసింహస్వామి వారికి పూజలు

ఠాణాలో లక్ష్మీనరసింహుడికి పూజలు

- **నేత్రపర్వంగా స్వామివారి దక్షిణ దిగ్యాత్ర ఘట్టం**

ధర్మపురి, మార్చి 9: అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం జగిత్యాల జిల్లా ధర్మపురి శ్రీలక్ష్మీనరసింహ స్వామివారి దక్షిణ దిగ్యాత్ర ఘట్టాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని పోలీసు సిబ్బంది స్టేషన్‌కు తీసుకెళ్లి పూజలు నిర్వహించారు. స్వామివారు దక్షిణం వైపు విహారయాత్రకు బయలుదేరే కార్యక్రమాన్ని దక్షిణ దిగ్యాత్రగా చెప్తారు. ఈ దిగ్యాత్రలో భాగంగా శ్రీలక్ష్మీనరసింహ స్వామి (యోగ, ఉగ్ర) ఉత్సవ మూర్తులను ఆలయం నుంచి బయటకు తీసుకొచ్చి కళాకారుల ప్రదర్శనల మధ్య సాయంత్రం దక్షిణ దిశలోని పోలీస్ స్టేషన్ వైపు తీసుకెళ్లారు. జగిత్యాల, మెట్‌పల్లి డీఎస్పీలు ప్రకాశ్, రవీందర్‌రెడ్డి, ఎస్బీ సీఐ రాజశేఖర్‌రావు, ధర్మపురి సీఐ బిల్లా కోటేశ్వర్, ఎస్సైలు కిరణ్‌కుమార్, రామకృష్ణ, నరేశ్, దత్తాత్రి, పోలీస్ సిబ్బంది స్వామివారిని లోపలికి తీసుకెళ్లారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఎదుట ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులను ఉంచి, వారి ఎదుట ఆయుధాలను ఉంచి పూజలు చేశారు.



విజయనగరం జిల్లా శృంగవరపు కోటకు చెందిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి చిప్పాడ శేషగిరిరావు తదితరులకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీఆర్‌ఎస్ ఏపీ అధ్యక్షుడు తోట చంద్రశేఖర్

ప్రజావిశ్వాసం కోల్పోయిన మోదీ, జగన్

బీఆర్‌ఎస్ ఏపీ అధ్యక్షుడు తోట చంద్రశేఖర్

హైదరాబాద్, మార్చి 9 (నమస్తే తెలంగాణ): కేంద్రంలో ప్రధాని మోదీ, ఏపీలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజావిశ్వాసం కోల్పోయారని బీఆర్‌ఎస్ పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు తోట చంద్రశేఖర్ అన్నారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో గురువారం ఏపీ నుంచి వచ్చిన పలువురు నేతలు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ మార్గదర్శకత్వంలో అటు దేశంలో, ఇటు ఏపీలో మార్పులొస్తాయనే విశ్వాసంతో ప్రజలున్నారని తెలిపారు. రోజురోజుకూ ఏపీలో బీఆర్‌ఎస్ బలపడుతున్నదని చెప్పారు. తెలంగాణ మాడల్ దేశానికి దిక్సూచిగా మారిందని తెలిపారు. కేంద్రంలో బీజేపీని గద్దె దించే వరకు బీఆర్‌ఎస్ విశ్రమించబోదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ పార్టీలో చేరిన విజయనగరం జిల్లా శృంగవరపుకోటకు చెందిన చిప్పాడ శేషగిరిరావు, విజయవాడ నుంచి వచ్చిన పెండ్యాల రవీందర్, విక్రమ్‌కుమార్, మహేశ్‌ధీర, అనిల్‌సింగ్ తదితరులకు తోట చంద్రశేఖర్ గులాబీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.



సత్తిబాబు, స్వప్నకుమారి, సునీత వివాహ వేడుక

వరుడు ఒక్కడు.. వధువులు ఇద్దరు

పెద్దలు, బంధువుల సమక్షంలో పెండ్లి ● సోషల్ మీడియాలో పెండ్లి వేడుక వైరల్

చర్ల, మార్చి 9: ఇద్దరినీ ప్రేమించాడు. ఇద్దరితో సహజీవనం చేశాడు. ఇద్దరు పిల్లలకు తండ్రి అయ్యాడు. చివరికి ఇద్దరు యువతులను ఒకే ముహూర్తానికి పెద్దల సమక్షంలో పెండ్లి చేసుకున్నాడు. ఈ వివాహ వేడుకకు భద్రాద్రి జిల్లా చర్ల మండలంలోని ఎర్రబోరు గ్రామం వేదికైంది. ఈ వివాహ కార్యక్రమం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది. చర్ల మండలం ఎర్రబోరు గ్రామానికి చెందిన మడకం సత్తిబాబు ఇదే మండలంలోని దోసిళ్లపల్లికి చెందిన స్వప్నకుమారి, కుర్నపల్లికి చెందిన సునీతతో ప్రేమాయణం సాగించాడు. ఇద్దరితో సహజీవనం చేశాడు. స్వప్నకుమారికి పాప, సునీతకు బాబు పుట్టారు. పెండ్లి విషయంలో స్వప్నకుమారి, సునీతకు మధ్య చర్చ జరిగింది. ఈ విషయంపై పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టారు. ఈ పంచాయితీలో సత్తిబాబు ఇద్దరినీ ప్రేమించానని, తాను ఇద్దరినీ పెండ్లి చేసుకుంటానని తేల్చి చెప్పాడు. ఆ తర్వాత సత్తిబాబు, సునీత, స్వప్నకుమారి చర్చించుకున్నారు. సత్తిబాబు నిర్ణయాన్ని ఇద్దరూ అంగీకరించారు. అనుకున్నదే తడవుగా పెండ్లి పత్రికలు అచ్చు వేయించారు. బంధువులను ఆహ్వానించారు. గురువారం ఉదయం పెండ్లి జరగాల్సి ఉండగా సోషల్ మీడియాలో ఈ విషయం వైరల్ అయింది. దీంతో కంగారు పడిన వరుడు, వధువుల కుటుంబ సభ్యులు అప్రమత్తమై బుధవారం రాత్రే వివాహం జరిపించారు. సత్తిబాబు పెద్దలు, బంధుమిత్రుల సమక్షంలో స్వప్నకుమారి, సునీత మెడలో తాళిబొట్టు కట్టి ఇద్దరు భార్యలకు భర్త అయ్యాడు.

మానసిక ఒత్తిడితోనే గుండెపోట్లు

- **వ్యాయామం, ఆరోగ్య పరీక్షలు అవసరం**
- **ఆహార నియమాలు పాటించాలి: ఐఎంఏ**



హైదరాబాద్, మార్చి 9 (నమస్తే తెలంగాణ): ప్రజల జీవనశైలిలో పలు మార్పులు వస్తున్నందున 30 ఏండ్ల వయస్సు పైబడినవారంతా వ్యక్తిగత ఆరోగ్యంపై దృష్టి సారించాలని, ఆహార నియమాలను తప్పక పాటించాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) పేర్కొన్నది. ఆకస్మిక గుండెపోటుతో మరణిస్తున్నవారి సంఖ్య నానాటికీ పెరుగుతున్న నేపథ్యంలో ఈ సూచన చేసింది. జీవన విధానంలో విస్తృత మార్పులు రావడం, మానసిక ఒత్తిడి పెరగడంతోపాటు నివారణ చర్యలు, రెగ్యులర్ హెల్త్ చెకప్‌లు లేకపోవడం ఇలాంటి మరణాలకు ప్రధాన కారణమని ఐఎంఏ తెలంగాణ స్టేట్ ప్రెసిడెంట్ బీఎన్ రావు, ప్రముఖ కార్డియాలజిస్ట్ ఎంఎస్‌ఎస్ ముఖర్జీ గురువారం ఓ ప్రకటనలో వివరించారు. కొవిడ్ వ్యాక్సిన్ల వల్ల గుండెపోట్లు సంభవించడం చాలా తక్కువని, అయినప్పటికీ దానిపై లోతైన పరిశోధనలు జరగాల్సి ఉన్నదని తెలిపారు. గుండెపోటు మరణాలపై ఎవరూ ఆందోళన చెందవద్దని, 30 ఏండ్లు పైబడిన వారంతా రక్తపోటు, రక్తంలో చక్కెర స్థాయిలను తరచూ పరీక్షించుకోవాలని, 40 ఏండ్లు పైబడినవారంతా ఏడాదికోసారి కార్డియాక్ చెకప్ చేయించుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఆహార నియమాలను పాటించడంతో పాటు క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తూ బరువును అదుపులో పెట్టుకోవాలని, మద్యపానం, ధూమపానం లాంటి దురలవాట్లకు దూరంగా ఉండాలని తెలిపారు. మానసిక ఒత్తిడిని తగ్గించుకునేందుకు రోజూ కనీసం 6 గంటలైనా నిద్రపోవాలని సూచించారు.

- **గంగమ్మ ఉబికే.. భూతల్లి మురిసె**



బోరులో మోటర్ లేకపోయినా పాతాళగంగ మాత్రం పైకి తన్నుకొస్తున్నది. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం గోగుపల్లికి చెందిన కుంట రంగారెడ్డి అనే రైతు పొలంలోని బోరు నుంచి 24 గంటలు నీరు పైకి ఉబికి వస్తున్నది. 15 ఏండ్ల క్రితం బోరు వేయగా, మోటరు బిగించకపోయినా పాతాళగంగ తరచూ ఎగిసిపడుతున్నదని రైతు రంగారెడ్డి తెలిపాడు. తనకున్న 10 ఎకరాలతోపాటు మరికొందరు రైతుల పొలాలకు సాగునీరు అందిస్తున్నదని చెప్పాడు. అటవీ ప్రాంతం కావడంతో పాటు సమీపంలో ఒర్రెలు ఉండటంతో నీరు ఇలా వస్తున్నదని ఆయన పేర్కొన్నాడు. నీరంతా కాలువ ద్వారా పొలాలు తడుపుతూ కిందకు వెళ్లి తిరిగి ఒర్రెలో కలుస్తున్నదని ఆ రైతు చెప్తున్నాడు.
– కోరె అరవింద్, ములుగు ఫొటోగ్రాఫర్

ఎంపీ కోమటిరెడ్డిది అగ్రకుల అహంకారమే

ఎంఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు తీగల ● ప్రవర్తన మార్చుకో చాలు : చెరుకు



నీలగిరి, మార్చి 9: టీపీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ చెరుకు సుధాకర్‌పై భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వ్యాఖ్యలు భావోద్వేగంతో చేసినవి కావని, అగ్రకుల అహంకారంతోనే చేశారని మహాజన సోషలిస్టు పార్టీ (ఎంఎస్‌పీ) రాష్ట్ర అధ్యక్షుడు తీగల ప్రదీప్‌గౌడ్ విమర్శించారు. గురువారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని నవ్య హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో చెరుకు సుధాకర్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాల నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. చెరుకు సుధాకర్‌ను పార్టీలకతీతంగా ఉద్యమకారుడిగా, బహుజన వర్గాల నాయకుడిగా సమాజం చూస్తున్నదన్నారు. కోమటిరెడ్డిని తక్షణమే కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని ప్రదీప్‌గౌడ్ డిమాండ్ చేశారు. కోమటిరెడ్డి వ్యాఖ్యలకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని చెప్పారు. అనంతరం చెరుకు సుధాకర్ మాట్లాడుతూ.. తమ కుటుంబం 40 ఏండ్లుగా అనేక ఉద్యమాలు చేసి కష్టాలను చూసిందని తెలిపారు. ఒక ఎంపీగా కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అనైతికంగా మాట్లాడి న్యాయస్థానంపై గౌరవం ఉన్నదని చెప్తే సమాజం సిగ్గుపడుతుందని విమర్శించారు. 'నీ క్షమాపణ అవసరం లేదు. నీ ప్రవర్తన మార్చుకో చాలు. నీకు కోర్టుల మీద, రాజ్యాంగం మీద గౌరవం ఉంటే గిట్ల నేనా మాట్లాడేది' అని మండిపడ్డారు. వెంకట్‌రెడ్డిది బహుజనులను అణగదొక్కిన చరిత్ర అని టీపీసీసీ జనరల్ సెక్రటరీ కొండేటి మల్లయ్య, తిప్పర్తి మాజీ జడ్పీటీసీ తండు సైదులుగౌడ్ అన్నారు. నల్లగొండ నియోజకవర్గంలో ఆయన చేసిన అభివృద్ధి, ద్వితీయ శ్రేణి నాయకుల తయారీపై గడియారం సెంటర్ వద్ద బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ చేశారు.

అంత్యక్రియల్లో తేనెటీగల దాడి

- **శవాన్ని వదిలి పరుగులు తీసిన గ్రామస్థులు**

దండేపల్లి, మార్చి 9 : అంత్యక్రియల్లో పాల్గొనేందుకు వెళ్లిన వారిపై తేనెటీగలు దాడి చేయగా పలువురికి గాయాలయ్యాయి. ఈ ఘటన మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం నెల్కివెంకటాపూర్‌లో గురువారం చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన పిట్టల లక్ష్మయ్య అనే వృద్ధుడు అనారోగ్యంతో మృతిచెందాడు. ఆయన అంత్యక్రియలకు బంధువులు, గ్రామస్థులు తరలివచ్చారు. అంతిమయాత్ర కోసం మృతదేహాన్ని ఇంటి నుంచి శ్మశానవాటికకు తరలిస్తున్నారు. శ్మశానవాటిక సమీపంలోకి రాగానే ఒక్కసారిగా తేనెటీగలు గ్రామస్థులను చుట్టుముట్టాయి. దాంతో అక్కడే వదిలా అంతా పారిపోయారు. వృద్ధులు, పిల్లలు పరుగులు పెట్టినా వదలకుండా కుట్టడంతో దాదాపు 40 మందికి గాయాలయ్యాయి. వీరిలో కొందరు దండేపల్లి, లక్షెట్టిపేట దవాఖానలకు వెళ్లి చికిత్స చేయించుకున్నారు. ఆ తరువాత కుటుంబ సభ్యులు వెళ్లి అంత్యక్రియలు పూర్తిచేశారు.

తెలంగాణలో అభివృద్ధి భేష్

- **ప్రశంసించిన మాల్దీవ్స్ ప్రతినిధుల బృందం**

పటాన్‌చెరు, మార్చి 9 : తెలంగాణ పల్లెల్లో అభివృద్ధి బాగా జరుగుతున్నదని మాల్దీవ్స్ ప్రతినిధులు కొనియాడారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ (ఎన్‌ఐఆర్‌డీ) అధికారుల ఆధ్వర్యంలో గురువారం మాల్దీవ్స్ బృందం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం కర్ధనూర్‌లో పర్యటించింది. ఇందులో 23 మందితో కూడిన మాల్దీవ్ ఎలెక్టెడ్ కౌన్సిల్ మెంబర్స్, మున్సిపల్ మెంబర్స్ తోపాటు అధికారులు ఉన్నారు. డైరెక్టర్ ఆఫ్ ట్రైనింగ్ ప్రోగ్రాం డాక్టర్ అంజన్‌కుమార్ భంజ, ఎన్‌ఐఆర్‌డీ అధికారులు మధుసూదన్, తాఖీయొద్దీన్ ఆధ్వర్యంలో రాష్ట్ర అధికారులు మాల్దీవ్స్ బృందానికి వివరాలు వెల్లడించారు. సంక్షేమ కార్యక్రమాలతోపాటు తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తరువాత గ్రామాల్లో నూతనంగా ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలు, నర్సరీలు, పారిశుద్ధ్యం అమలు, డంప్‌యార్డుల ఏర్పాటును మాల్దీవ్స్ ప్రతినిధులు పరిశీలించారు. తమది పర్యాటకంపై ఆధారపడిన దేశమని, తమవద్ద చెత్త సమస్య తీవ్రంగా ఉన్నదని వారు తెలిపారు. తెలంగాణలో అమలవుతున్న తడి, పొడి చెత్త సేకరణ, డంప్‌యార్డుల నిర్వహణను తమ దేశంలోనూ అమలు చేసేందుకు ప్రతిపాదిస్తామని అన్నారు. హరితహారం కార్యక్రమాన్ని ఎంతో గొప్పగా చేపడుతున్నారని వారు ప్రశంసించారు. కోతుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆహార కేంద్రాన్ని చూసి మాల్దీవ్స్ ప్రతినిధులు ఆశ్చర్యపోయారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఎదురుకాల్పులు

- **ఇద్దరు కోబ్రా జవాన్లకు గాయాలు**

కొత్తగూడెం క్రైం, మార్చి 9 : ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో మావోయిస్టులు, భద్రతా బలగాలకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో ఇద్దరు జవాన్లు గాయపడ్డారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా దబ్బమర్క పోలీస్ క్యాంప్ నుంచి కోబ్రా 208 బెటాలియన్, ఎస్‌టీఎఫ్ జవాన్లు సంయుక్త ఆధ్వర్యంలో సాకిలేర్ అటవీ ప్రాంతంలో మావోయిస్టుల ఆపరేషన్‌కు బయల్దేరారు. భద్రతా బలగాల రాకను పసిగట్టిన మావోయిస్టులు జవాన్లపై మెరుపుదాడికి దిగారు. గ్రానైట్ లాంచర్లను జవాన్లపై ప్రయోగించారు. జవాన్లు అప్రమత్తమై మావోయిస్టులపై ఎదురు కాల్పులు జరిపారు. ఇరువర్గాల మధ్య సుమారు 15 నిమిషాలపాటు కాల్పులు జరిగినట్టు తెలుస్తున్నది. జవాన్ల ధాటికి తాళలేక మావోయిస్టులు కాల్పులు జరుపుతూనే దట్టమైన అటవీ మార్గంలోకి పారిపోయారు. ఈ ఘటనలో కోబ్రా 208 బెటాలియన్‌కు చెందిన ఇద్దరు జవాన్లకు గాయాలయ్యాయి. ఈ ఎదురుకాల్పుల్లో సుమారు ఆరుగురు మావోయిస్టులు గాయపడినట్టు పోలీసులు భావిస్తున్నారు.

సముద్రాల్లో 170 ట్రిలియన్ల ప్లాస్టిక్ వ్యర్థాలు

న్యూఢిల్లీ: సముద్రాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. 170 ట్రిలియన్ల ప్లాస్టిక్ వస్తువులు సముద్రాల్లో చేరినట్టు పరిశోధకులు గుర్తించారు. వీటిని సేకరించి తూకం వేస్తే 23 లక్షల టన్నులు అవుతుందని అంచనా వేశారు. ఇంత భారీస్థాయిలో ప్లాస్టిక్ సముద్రాల్లో కలవడం వల్ల ఊహించని రీతిలో కాలుష్యం ఏర్పడుతున్నదన్నారు.

దేశంలో కోటి మంది వృద్ధులకు చిత్తవైకల్యం

న్యూఢిల్లీ: దేశంలోని దాదాపు కోటి మంది వృద్ధులు చిత్తవైకల్యంతో బాధపడుతున్నారని అధ్యయనం అంచనా వేసింది. 60 ఏండ్ల దాటిన వారిలో జ్ఞాపకశక్తి, ఆలోచనాశక్తి, నిర్ణయాధికారం తగ్గిపోతున్నాయని, ఈ పరిస్థితి అమెరికా, బ్రిటన్ తర్వాతి స్థానాల్లో భారతే ఉన్నదని వెల్లడించింది. సెమీ సూపర్‌వైజ్‌డ్ మెషిన్ లర్నింగ్ (కృత్రిమమేధ) సహాయంతో దేశవ్యాప్తంగా 31,477 మంది వృద్ధుల డాటాను పరిశీలించగా ఈ విషయం బయటపడింది. భారత్‌లో చిత్తవైకల్యంపై ప్రభుత్వం దృష్టి సారించిన దాఖలాలు లేవని పరిశోధకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎయిరిండియా ఉద్యోగి కిలోన్నర బంగారం స్మగ్లింగ్

కొచ్చి,: విధి నిర్వహణలో ఉండగా స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ ఉద్యోగిని కేరళలోని కొచ్చిన్ విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులు అరెస్ట్ చేశారు. బహ్రెయిన్–కోజికోడ్–కోచి విమానం సిబ్బందిలోని షఫీ అనే వయనాడ్‌కు చెందిన ఉద్యోగి బుధవారం 1,487 గ్రాముల బంగారంతో పట్టుబడ్డాడు. ఇతడు బంగారాన్ని చేతుల చుట్టూ కట్టుకుని, అది కనిపించకుండా చొక్కాను కవర్‌చేసి చెకింగ్ పాయింట్ నుంచి తప్పించుకోవడానికి ప్రయత్నించాడు. అయితే అప్పటికే ముందస్తు సమాచారం అందుకున్న అధికారులు.. బంగారాన్ని స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేశారు. స్మగ్లింగ్‌కు పాల్పడిన షఫీని విధుల నుంచి ఎయిరిండియా సస్పెండ్ చేసింది.

అదానీ కోసం మోదీ క్రికెట్ ఫ్రెండ్‌షిప్!

ఆసీస్, టీమిండియా నాలుగో టెస్టు మర్మమిదేనా?

అహ్మదాబాద్ స్టేడియంలో మోదీ, ఆస్ట్రేలియా పీఎం సందడి

- ఆస్ట్రేలియాలో అదానీ కంపెనీలపై పెద్దఎత్తున నిరసనలు
- ఈ సమయంలోనే భారత్‌కు ఆస్ట్రేలియా పీఎం ఆంటోనీ
- వాణిజ్య ఒప్పందాల పేరిట అదానీ ఉదంతంపై చర్చ?!
- అందుకే, పీఎంల చర్చపై మౌనంగా పీఎంవో, ఎంబసీ
- ఆంటోనీ పర్యటనపై ఆస్ట్రేలియా మేధావుల విమర్శలు

రీడ్ బిట్‌విన్ ది లైన్స్

(కంటికి కనిపించేవన్నీ నిజాలు కాదు. కొంచం లోతుగా విశ్లేషిస్తే.. కనిపిస్తున్న దృశ్యం వెనుక జరుగుతున్న అసలు తంతు ఏమిటో అర్థమవుతుంది)

– 1862లో ఓ ఇన్వెస్టిగేషన్ దర్యాప్తు స్టోరీని ప్రచురిస్తూ 'న్యూయార్క్ టైమ్స్' ఉటంకించిన ఈ ఒక్క వాక్యం.. ఆ దేశ రాజకీయాల్లో పెను మార్పులను తీసుకొచ్చింది.

ఆస్ట్రేలియా–భారత్ మధ్య అహ్మదాబాద్‌లో నాలుగో టెస్ట్ మ్యాచ్. ప్రధాని మోదీ, ఆస్ట్రేలియా ప్రధాని ఆంటోనీ ఆల్బనీస్ గురువారం ఈ మ్యాచ్‌కు హాజరై.. సందడి చేశారు. అందరికీ అర్థమైంది ఇక్కడివరకే.

నౌ.. రీడ్ బిట్‌విన్ ది లైన్స్

హిండెన్‌బర్గ్ నివేదిక నేపథ్యంలో.. గౌతమ్ అదానీకి వ్యతిరేకంగా ఆస్ట్రేలియాలో నిరసనలు పెచ్చరిల్లుతున్నాయి. ఇదే సమయంలో ఆ దేశ ప్రధాని ఆంటోనీ ఆల్బనీస్ భారత్‌కు వచ్చారు. ఆయన పర్యటనకు ముందే, కొందరు ఆస్ట్రేలియా రాజకీయ ప్రముఖులు అదానీకి సపోర్ట్‌గా వ్యాఖ్యలు చేశారు. ఇప్పుడు భారత్‌కు వచ్చిన ఆంటోనీతో మ్యాచ్ అరగంట చూసిన మోదీ ఆయనతో ఏకాంతంగా భేటీ అయ్యారు. ద్వైపాక్షిక సంబంధాలు, వాణిజ్య ఒప్పందాల గురించి ఏదైనా ప్రకటన వస్తుందని అందరూ అనుకొన్నారు. అయితే, అలా జరుగలేదు. ఎందుకు? ఇరు దేశాల ప్రధానుల మధ్య జరిగిన చర్చ మరో 'దోస్త్ కహానీ' గురించి కావడమే దీనికి కారణంగా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఆ దోస్త్ ఎవరో కాదు.. మోదీ ఆప్తమిత్రుడు!

(కడవేర్గు రాజశేఖర్)

హైదరాబాద్, మార్చి 9 (నమస్తే తెలంగాణ): బోర్డర్–గావస్కర్ సిరీస్‌లో భాగంగా భారత్–ఆస్ట్రేలియా మధ్య జరుగుతున్న నాలుగో టెస్టు మ్యాచ్ మొదటి రోజు ఆటలో ప్రధాని మోదీ, ఆస్ట్రేలియా ప్రధాని ఆంటోనీ ఆల్బనీస్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మోదీ స్వరాష్ట్రం గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో నరేంద్రమోదీ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌ను ఇరు దేశాల ప్రధానులు ప్రత్యేక గ్యాలరీలో కూర్చొని అరగంట పాటు వీక్షించారు. అంతకు ముందు పసిడి పూత పూసిన గోల్ఫ్ కారులో మైదానమంతా కలియదిరిగారు. 75 ఇయర్స్ ఆఫ్ ఫ్రెండ్‌షిప్ త్రూ క్రికెట్ పేరిట.. 75 ఏండ్ల ఇండో–ఆస్ట్రేలియా మైత్రీ సంబురాల్లో భాగంగా ఇదంతా చేసినట్టు మోదీ పరివారం చెప్పుకొచ్చింది. అయితే, ఇదంతా నాణేనికి ఒకవైపు మాత్రమే. దీని వెనుకాల అసలు కథ మరొకటి ఉన్నదని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

పర్యటనకు ముందే అదానీకి అనుకూలంగా వ్యాఖ్యలు

1947లో భారత్–ఆస్ట్రేలియా మధ్య తొలి టెస్ట్ మ్యాచ్ జరిగింది. కిందటేడాదితో.. ఇరు దేశాలు 75 ఏండ్ల క్రికెట్ మైత్రీబంధాన్ని పూర్తి చేసుకొన్నాయి. ఒకవేళ వీటిని వేడుకగా జరుపుకోవాలంటే, ఆస్ట్రేలియా ప్రధాని ఆంటోనీని కేంద్రప్రభుత్వం, బీసీసీఐ అప్పుడే ఆహ్వానించాలి. అలా జరుగలేదు. పోనీ.. బోర్డర్–గావస్కర్ సిరీస్ మొదలైన ఫిబ్రవరి 9న అయినా.. పిలిచారా అంటే? అదీ జరుగలేదు. ఆస్ట్రేలియాలోని అదానీ గనులు, ప్లాంట్లకు వ్యతిరేకంగా అప్పటికే కొనసాగుతున్న నిరసనలు హిండెన్‌బర్గ్ నివేదిక వెలువడ్డాక, గత నెలలో మరో స్థాయికి వెళ్లాయి. అదానీ గ్రూప్ కంపెనీలకు రుణాలు ఇవ్వొద్దంటూ ఆస్ట్రేలియా బ్యాంకుల ఎదుట అక్కడి పౌరులు ఫిబ్రవరి రెండో వారంలో పెద్దయెత్తున నిరసనలు చేపట్టారు. దీంతో నార్వే వెల్త్ ఫండ్ సహా పలు అంతర్జాతీయ సంస్థలు అదానీ కంపెనీలపై ఆంక్షలు విధించాయి. నిరసనలను చల్లార్చేందుకు ఆస్ట్రేలియాకు చెందిన పలువురు రాజకీయ నాయకులు యత్నాలు మొదలెట్టారు. భారత్ నుంచి అతిపెద్ద పెట్టుబడీదారుగా ఉన్న అదానీ గ్రూప్‌పై తమకు పూర్తి విశ్వాసం ఉన్నదంటూ ఆస్ట్రేలియా హైకమిషనర్ బేరీ ఓ ఫారెల్ పేర్కొన్నారు. అదానీ గ్రూప్ నుంచి మరికొన్ని పెట్టుబడులను ఆశిస్తున్నామంటూ మాజీ ప్రధాని టోనీ అబాట్ వెల్లడించారు. సరిగ్గా, ప్రధాని ఆంటోనీ భారత్ పర్యటనకు ముందే వీళ్లు అదానీకి అనుకూలంగా ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.



గురువారం అహ్మదాబాద్‌లోని స్టేడియంలో ప్రధాని మోదీ, ఆస్ట్రేలియా ప్రధాని ఆంటోనీ

మ్యాచ్ ఓ సాకు మాత్రమే!

భారత పర్యటన గురించి గత డిసెంబర్‌లోనే ఆంటోనీ ఓ ట్వీట్ చేశారు. అయితే, అధికారికంగా దాన్ని ఆయన కార్యాలయం మొన్నటివరకూ ధ్రువీకరించలేదు. అయితే, అదానీ గ్రూప్‌పై విమర్శలు వెల్లువెత్తిన నేపథ్యంలో.. హడావుడిగా పర్యటన ఖరారు అయినట్టు తెలుస్తున్నది. ఆస్ట్రేలియాలో అదానీ కంపెనీకి బొగ్గు గనుల ప్రాజెక్టు అనుమతులను ఇప్పించడానికే 2014లో మోదీ ఆ దేశంలో పర్యటించినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఇప్పుడు అదానీ కంపెనీలపై ఆస్ట్రేలియాలో పెద్దయెత్తున నిరసనలు జరుగుతున్నాయి. ఇలాంటి సమయంలో ఆంటోనీ భారత పర్యటనకు వస్తే.. ప్రతిపక్షాలు విమర్శలు వ్యక్తం చేస్తాయన్న కారణంతో.. 75 ఇయర్స్ ఆఫ్ ఫ్రెండ్‌షిప్ త్రూ క్రికెట్ పేరిట గురువారం జరుగుతున్న బోర్డర్–గావస్కర్ సిరీస్ నాల్గో టెస్ట్ మ్యాచ్‌ను ఓ సాకుగా చూపించినట్టు తెలుస్తున్నది. మ్యాచ్ జరిగిన తర్వాత.. మోదీ, ఆంటోనీ ఏకాంతంగా భేటీ అయ్యారు. ఇరు దేశాల మధ్య దౌత్య, వాణిజ్య సంబంధాలపై వారిద్దరి మధ్య చర్చ జరుగొచ్చని అందరూ భావించారు. అయితే, అలా జరుగలేదు. ఒకవేళ దౌత్య సంబంధాలు, ఒప్పందాలపై చర్చ జరిగితే, పీఎంవో గానీ, ఇరు దేశాల ఎంబసీలు గానీ అధికారిక ప్రకటనలు, మీటింగ్ మినట్స్ సారాంశాన్ని విడుదల చేసేవని విశ్లేషకులు చెబుతున్నారు. అయితే అలా ఏమీ జరుగలేదు. తన మిత్రుడు అదానీకి సంబంధించిన వివాదంపై మోదీ ప్రధానంగా అంటోనీతో చర్చించినట్టు భావిస్తున్నారు. భారత్‌లో ఆంటోనీ పర్యటనను ఆస్ట్రేలియాలోని జర్నలిస్టులు, మేధావులు తప్పుబడుతున్నారు. మతవిద్వేషాలను రెచ్చగొట్టి అసహనాన్ని ప్రోత్సహిస్తున్న మోదీని ఆంటోనీ కలవడం సరికాదంటూ 'ది ఆస్ట్రేలియన్' పత్రికలో ప్రముఖ జర్నలిస్ట్ గిడెన్ హెయ్ విమర్శించారు.

టికెట్లు కొన్నది.. బీజేపీ నేతలే

ఆస్ట్రేలియాలో మిత్రుడి కంపెనీలు ఇబ్బందుల్లో ఉన్నాయి. ఎలాగైనా ఆదుకోవాలి. అక్కడి పీఎంను ఏదో సాకుతో ఇక్కడికి రప్పించి.. కూలంకషంగా మాట్లాడాలి. ఇదే సమయంలో '75 ఇయర్స్ క్రికెట్ ఫ్రెండ్‌షిప్' గుర్తొచ్చింది. అంతే, నిమిషాల్లో ఆస్ట్రేలియా పీఎం ఆంటోనీకి మోదీ కబురుపెట్టారు. స్వరాష్ట్రం గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో తన పేరిట పునర్నిర్మించిన స్టేడియాన్ని వేదికగా చేసుకొన్నారు. అయితే, స్టేడియంలో జనం లేకపోతే తనకు పరువు తక్కువ. దీంతో బీజేపీ ఎమ్మెల్యేలు, మంత్రులను రంగంలోకి దింపారు. స్టేడియంలోని మొత్తం 1,30,000 టికెట్లలో 80,000 టికెట్లను వాళ్లతోనే కొనిపించి.. పబ్లిక్‌కు ఫ్రీగా పంపిణీ చేశారు. ఒక్కో ఎమ్మెల్యేకు 12 వేల టికెట్లను టార్గెట్‌గా పెట్టారు. అలా జనాన్ని సమీకరించి.. క్రికెట్ మ్యాచ్‌ను రాజకీయ సభగా మార్చివేశారు.